ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 26.09.2025 | సంపుటి :12 | సంచిక : 68 | పేజీలు :12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






# రైలు నుంచి రయ్యిమంటూ..

- భారత్ అమ్ములపొదిలోకి కొత్త అస్త్రం..
- దేశ రక్షణ వ్యవస్థ అరుదైన ఘనత
- అగ్ని ప్రైమ్ క్షిపణి ప్రయోగం విజయవంతం
- రైలు ఆధారిత మొబైల్ లాంఛర్ వ్యవస్థ నుంచి విజయవంతంగా పరీక్షించాం
- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత రక్షణ వ్యవస్థ అరుదైన ఘనత సాధించింది. అగ్ని ప్రైమ్ క్షిపణి ప్రయోగాన్నివిజయవంతంగా పూర్తి చేసుకుంది. రైల్వే నెట్‌వర్క్ నుంచి సైతం ప్రయోగించగలడం ఈ క్షిపణి ప్రత్యేకత. రైలు ఆధారిత మొబైల్ లాంఛర్ వ్యవస్థ నుంచి క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం ఉదయం వెల్లడించారు.ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఐల్యాండ్ నుంచి ఈ క్షిపణి ప్రయోగం జరిగింది. డీఆర్‌డీవో, మిగతా 2లో..





## కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు

# నేటి నుంచి

**తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ**

**హైదరాబాద్(జనంసాక్షి):**మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మార్గదర్శకాల్లో ప్రభుత్వం మిగతా 2లో..



## తమిళనాడు 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' కార్యక్రమం

# అద్భుతం

- తెలంగాణలోనూ వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తాం
- 56 అంగుళాల ఛాతీతో ఏం ప్రయోజనం?
- ఒలింపిక్స్‌లో ఒక్క గోల్డ్ మెడల్ కూడా రాలేదు
- అందుకే తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నాం: సీఎం రేవంత్
- తమిళనాడు-తెలంగాణ మధ్య సాంస్కృతిక, స్నేహ సంబంధాలు కొనసాగాలని కోరుకుంటున్నానని వెల్లడి

**చెన్నై(జనంసాక్షి):**తమళినాడులో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం వియవంతమైందని..దీంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని.. వచ్చే ఏడాది తెలంగాణలోనూ ఈ పథకాన్ని ప్రారంభిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విద్యలో ముందంజలో మిగతా 2లో..

# తెలంగాణ సర్కారు చేతికి మెట్రో నిర్మాణ బాధ్యతలు



## మొదటి దశ కొనుగోలు చేయనున్న ప్రభుత్వం

## రూ.13వేల కోట్ల అప్పుల టేకోవర్‌కు సంసిద్ధత

- ఈ మేరకు సీఎం రేవంత్, ఎల్అండ్‌టీ సీఎండీ మధ్య కుదిరిన ఒప్పందం
- ఎల్&టీకి రూ.2100 కోట్లు నగదు చెల్లింపునకు అంగీకారం
- ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్న నిర్మాణసంస్థ

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్టు రానుంది. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్‌అండ్‌టీ సీఎండీ మధ్య అంగీకారం కుదిరింది. మెట్రో మొదటి దశ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఎల్‌అండ్‌టీకి ఉన్న రూ. 13వేల కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు సంసిద్ధత తెలిపినట్టు సమాచారం. ఎల్‌అండ్‌టీకి రూ. 2,100 కోట్లు నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణ నుంచి ఆ సంస్థ వైదొలగనుంది. హైదరాబాద్ మెట్రో 69 కి.మీ.మొదటిదశని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ. 22 వేల కోట్లతో నిర్మించిన విషయం తెలిసిందే. మిగతా 2లో..



## గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు

# 27న నియామక పత్రాలు

- 562 మందికి అందించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నేటి లోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయాలని సీఎస్ ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్ -1 అభ్యర్థులకు ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. శనివారం సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నత అధికారులతో సి.ఎస్. టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ద్వారా ఎంపి-కై-న 563 మంది అభ్యర్థుల కు అపాయింట్‌మంట్ ఆర్డర్లు అందిస్తారని సిఎస్ తెలిపారు. దాదాపు 18 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర మంత్రులందరినీ కూడా ఆహ్వానిస్తున్నట్టు- సి.ఎస్ తెలిపారు. ఎంపి-కై-న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవిన్యూ, హోం, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ మిగతా 2లో..



## వెనుకబడిన వర్గాల కోసం


# 'మోస్ట్ బ్యాక్‌వర్డ్ జస్టిస్'

- వెనుకబడిన వర్గాలను బలోపేతం,వారి భాగస్వామ్యాన్ని పెంచడమే దీని ఉద్దేశం
- బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ మేనిఫెస్టో విడుదల చేసిన రాహుల్ గాంధీ
- ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ

**పాట్నా(జనంసాక్షి):**బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాహుల్ మోస్ట్ బ్యాక్ వర్డ్ జస్టిస్ మేనిఫెస్టో విడుదల చేశారు. వెనుకబడిన వర్గాలను బలోపేతం చేయడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'బీజేపీ అబద్ధాలు చెబుతోంది. దా రి మళ్లించే కుట్రలు చేస్తోంది. కాంగ్రెస్ మాత్రం వెను కబడిన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు పూర్తి హక్కులు కల్పించడంలో కట్టుబడి ఉంది. బిహార్‌లో వెను కబడిన వర్గాలను బలోపేతం చేసి, వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి మేం ఈ మేనిఫెస్టో తీసుకొస్తున్నాం. ఈ వర్గాల ప్రగతికి విద్యే అత్యుత్తమ మిగతా 2లో..

# ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దు

## స్మితాసబర్వాల్‌కు హైకోర్టులో ఊరట



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఘోష్ కమిషన్ నివేదికపై పలువురు ఇప్పటికే కోర్టు మెట్లు ఎక్కారు. ఈనేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ హైకోర్టును ఆశ్రయించగా ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక మిగతా 2లో..

# ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి

**అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి**

- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్ (జనంసాక్షి):** తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ మిగతా 2లో..





నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఉన్న అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

# తెలంగాణలో జోరు వానలు

- అధికారులను అప్రమత్తం చేసిన రాష్ట్ర సర్కారు
- రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు.. గోదావరి ఉగ్రరూపం
- భారీ వర్షాలతో గోదావరి, మంజీరా నదులకు పోటెత్తుతున్న వరద
- నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద గోదావరి ఉగ్రరూపం
- తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవాహం.. ఇరు రాష్ట్రాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి, మంజీర నదులకు వరద పోటెత్తుతోంది. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మంజీర, గోదావరి నదులకు వరద ప్రవాహం పెరగడంతో కందకుర్తి త్రివేణి సంగమం వద్ద వరద ప్రవాహం పెరిగింది. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఉన్న అంతర్రాష్ట్ర వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో తెలంగాణ - మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు వంతెన వైపు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పరివాహక ప్రాంతంలోని పంటలు నీట మునిగాయి. మిగతా 2లో..



## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి

# ఆస్తుల్ని అనుభవించే హక్కులేదు

- అటువంటి వారిని వెళ్లగొట్టొచ్చు
- మరోసారి స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. అలా ప్రవర్తించే సంతానాన్ని బయటకు వెళ్లగొట్టొచ్చని తేల్చిచెప్పింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన 'తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం' అండగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది. కుమారుడు తమ సంరక్షణ బాధ్యతలు చూసుకోవడం లేదంటూ మహారాష్ట్రకు మిగతా 2లో..

## హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో

# 4 లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే

- దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం
- రూ.30 వేల కోట్లతో నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారులు
- రాష్ట్రానికి రూ.860 కోట్లతో 422 కి.మీ రోడ్లు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో 4 లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా హైవేల నిర్మాణం చేపడతామన్నారు.దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చిందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి గడ్కరీ చెప్పారని అన్నారు."భూసేకరణ త్వరగా పూర్తిచేస్తే.. ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా అవుతుంది. మెట్రో విస్తరణలో సీఎం వ్యవహారశైలి సమంజసంగా లేదు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని కోరుకునే వ్యక్తుల్లో ముందుంటా. ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో విషయంలో ప్రోయాక్టివ్‌గా వ్యవహరించాం. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే నష్టాల్లో నడుస్తోంది. మెట్రో నష్టాలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం.. వారే తేల్చుకోవాలి. మెట్రోకు అన్ని రకాలుగా మా సహకారం ఉంటుంది. కాళేశ్వరంపై సీబీఐ ప్రతిపాదనలు అందాయి. ఆ అంశం పరిశీలనలో ఉంది. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలకు భాజపా భయం పట్టుకుంది. భారత రాష్ట్ర సమితితోనో, మిగతా 2లో..

# అన్ని రంగాల్లోనూ స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించాలి

- రానున్న రోజుల్లో జీఎస్టీ ఇంకా తగ్గిస్తాం : ప్రధాని మోదీ
- ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభం
- ఆత్మనిర్భర భారత్ వైపునకు దేశం సాగాలని సూచన

**హైదరాబాద్(జనంసాక్షి):**అన్ని రంగాల్లోనూ స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత్ తన భవిష్యత్ ప్రయాణంలో స్వదేశీ ఆర్థిక వ్యవస్థగా మారడంపై ఎక్కువగా దృష్టి పెట్టాలని అభిప్రాయపడ్డారు. దేశంలో వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి తమ ప్రభుత్వం అనవసరమైన నిబంధనలను తొలగించిందని వెల్లడించారు. ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' తయారీకి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చిప్ నుంచి షిప్ వరకు ప్రతిదీ భారత్‌లోనే తయారు చేయాలని తాము మిగతా 2లో..





# 'స్థానిక'ంకు సిద్ధం కావాలి

**పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

**హైదరాబాద్(జనంసాక్షి):**స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ మిగతా 2లో..



# రూ.62వేల కోట్లతో 97 తేజస్ ఫైటర్‌జెట్లు

**హాల్‌తో రక్షణశాఖ ఒప్పందం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వాయుసేనలో కీలక సేవలందించిన మిగ్-21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలకనున్న రక్షణ శాఖ.. వీటి స్థానంలో తేజస్ జెట్లను ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే.ఈ క్రమంలో రూ. 62,370 కోట్లతో 97 తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తో రక్షణశాఖ ఒప్పందం చేసుకొంది. ఇందుకోసం ప్రధాని మోదీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నెలలోనే ఈ ఒప్పందం పూర్తయ్యింది.మిగ్-21 యుద్ధవిమానాల స్థానంలో ఈ సింగిల్ ఇంజిన్ ఎంకే-1ఏ తేజస్ జెట్‌లను ప్రవేశపెడుతున్నారు. తాజాగా సమీకరిస్తున్న 97 విమానాల్లో.. 68 యుద్ధవిమానాలు, మిగతా 9లో..

### తమిళనాడు 'సీఎం బ్రేక్‌ఫాస్ట్'
## కార్యక్రమం అద్భుతం

తమిళనాడు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" ఇంత మంచి కార్యక్రమానికి నన్ను ఆహ్వానించినందుకు సంతోషం. అన్నాదొరై, కరుణానిధి, కామరాజ్ నాడార్ వంటి గొప్ప యోధుల జన్మస్థలం తమిళనాడు. కరుణానిధి విజన్‌ను అమలు చేస్తున్న స్టాలిన్, ఉదయనిధిలను అభినందిస్తున్నా..ఇందిరాగాంధీ కామరాజ్ ప్లాన్‌ను అనుసరించారు..కామరాజ్ తమిళనాడులో తీసుకువచ్చిన విద్యా విధానాన్ని దేశం అనుసరిస్తోంది.ఈ కార్యక్రమం తమిళనాడు యువతకు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉంటుంది.తమిళనాడు అమలుచేస్తున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం హృదయాన్ని తాకింది.బ్రేక్‌ఫాస్ట్‌తో పేద విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది.తెలంగాణలోనూ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తాం.నాన్ ముదలవన్ (స్కిల్ డెవలప్‌మెంట్) రూ.10 వేల ఉపకార వేతనం ప్రభుత్వ కళాశాలలకు వెళ్లే బాలురు, బాలికలకు ఇచ్చే ఈ స్కీమ్‌లు ఉండడం అదృష్టం.తమిళనాడు పేదలకు అండగా మంచి సీఎం స్టాలిన్ ఉన్నారు.ఎన్నో శతాబ్దాల నుంచి తమిళ, తెలుగు రాష్ట్రాలు, ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రకపరమైన బలమైన సంబంధం ఉంది.1991 సరళీకరణ తర్వాత సరళీకృత ఆర్థిక విధానాలతో తమిళనాడులో మ్యానుఫ్యాక్చరింగ్ రంగం అభివృద్ధి చెందింది..తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాలు అభివృద్ధి చెందాయి.సామాజిక న్యాయం అమలులో తమిళనాడు-తెలంగాణ మధ్య సారూప్యతలున్నాయి.మేం కరుణానిధిని స్ఫూర్తిగా తీసుకున్నాం.మా రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం, 27 శాతం ఎస్సీ, ఎస్టీలకు, మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నాం.భారతీయులంతా తమిళనాడు విద్యా విధానంతో స్ఫూర్తి పొందారు. దేశంలో మొట్టమొదటగా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించింది తమిళనాడు రాష్ట్రమే.తమిళనాడు అమలు చేస్తున్న విద్యా విధానం మాకు ప్రేరణ కలిగించింది. దక్షిణాదికి చెందిన కేరళ, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు తమిళనాడు విద్యా విధానం ఆదర్శంగా నిలిచింది. తెలంగాణలో మా ప్రభుత్వం, నేను విద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.విద్యా శాఖను నా దగ్గరే ఉంచుకున్నా...మా రాష్ట్రంలో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం.తెలంగాణ నుంచి ప్రతి ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. నైపుణ్యాలేమితో ఉద్యోగాలు దక్కించుకోపోతున్నందున వారి స్కిల్స్ పెంచి ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. 56 అంగుళాల ఛాతీతో ఏం ప్రయోజనం అందుకే నేను యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించాం... అందులో సంజయ్ గోయెంకా, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, ఉపాసన కొణిదెల వంటి క్రీడాకారులు, కార్పొరేట్ వాళ్లను తీసుకున్నాం.స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నాం.

## అంగన్‌వాడీలకు దసరా సెలవులు
### తొలిసారి 8 రోజుల పాటు మంజూరు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు ఎనిమిది రోజుల పాటు- దసరా సెలవులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల చరిత్రలో తొలిసారిగా దసరా సెలవులు ఇవ్వడం ఇదే ప్రథమం. ప్రభుత్వ పాఠశాలలు మాదిరిగానే దసరా, బతుకమ్మ పండగలు జరుపుకునే విధంగా దసరా సెలవులు మంజూరు చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి.అన్నపూర్ణ, ఇతర ప్రతినిధుల బృందం మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కలిసి ఐదీ-వల విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సీతక్క సెలవులు మంజూరు చేయించారు. ఈ మేరకు 27 నుంచి అక్టోబర్ 4 వరకు దసరా సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు యధావిధిగా పోషకాహారాన్ని అందజేయాలని సూచించారు. అంగన్వాడీలకు సెలవులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు అంగన్వాడీ టీ-చర్లు, హెల్పర్లు కృతజ్ఞతలు తెలిపారు. 8 రోజుల పాటు- అంగన్వాడీ కేంద్రాలు మూసి ఉండనున్నాయి.

## ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దు

అమలును నిలిపివేయాలంటూ స్మిత సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఘోష్ కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దు.. స్మిత సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మిత సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక అమలును నిలిపివేయాలంటూ స్మిత సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. స్మిత సభర్వాల్ గత ప్రభుత్వ హయాంలో సీఎంవోలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు. ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలివ్వాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తనను సాక్షిగా పిలిచిందని, అయితే తనపై ఆరోపణలు చేసే ముందు చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు.

### హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో
## 4 లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే

కాంగ్రెస్ తోనే కలిసి ప్రయాణిస్తాం అని అన్నారు.. గతంలో ఆ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాలు నడిపాయి. తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తాం. బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో మద్దతిచ్చాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అని కిషన్‌రెడ్డి అన్నారు.
దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం
దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమని బీజేపీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి సరైన అడుగులు పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాలతో తెలంగాణకు జాతీయ రహదారులను అనుసంధానం అయ్యాయని, జాతీయ రహదారుల నిర్మాణ వల్ల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలియజేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణ రహదారులపై చర్చించాను, రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారులకు నిర్మాణం చేపట్టాం అని పేర్కొన్నారు. రూ.860 కోట్లతో 422 కి.మీ. రోడ్లను రాష్ట్రానికి మంజూరు చేశామని, రూ.30 వేల కోట్లకు పైగా నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా.. తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందువరుసలో నేనుంటాను.. మా మంత్రిత్వ శాఖలో.. తెలంగాణ ప్రాజెక్టులకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మా ప్రాయార్టీగా గా వ్యవహరించామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది..

### తెలంగాణ సర్కారు చేతికి
## మెట్రో నిర్మాణ బాధ్యతలు



కాగా ఈ అంశాన్ని కొలిక్కి తెచ్చేందుకు ప్రభుత్వం కొన్ని రోజులుగా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మెట్రో మార్గాన్ని రాయదుర్గం నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్‌సిటీ మీదుగా నియోపోలిస్ వరకు మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం వరకు ఎల్.బి.నగర్ నుంచి హయత్‌నగర్ వరకు గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నాగోల్ నుంచి ఎల్.బి.నగర్, ఒవైసీ ఆసుపత్రి మీదుగా శంషాబాద్ వరకు ఇలా పూర్తిస్థాయిలో విస్తరిస్తేనే ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం ఉన్న మెట్రోరైలును పరిగణనలోకి తీసుకొంటే ప్రజలు చివరి పాయింట్లో దిగి ముఖ్యమైన ప్రాంతాలకు ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని, రెండోదశ పూర్తి చేస్తేనే పూర్తిస్థాయిలో ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది. ప్రస్తుతం నిత్యం 5 లక్షల మంది వరకు ప్రయాణిస్తుండగా, విస్తరణ తర్వాత ఆ సంఖ్య 12 నుంచి 13 లక్షలకు చేరుతుందని, అప్పుడు మొదటి దశ మెట్రోకు చాలా ఉపయోగమంటూ వివిధ రకాల లెక్కలను సంస్థ ముందు పెట్టినా అంగీకరించలేదని తెలిసింది. మొదటి దశ మెట్రోకు 9 శాతం వడ్డీతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొన్నారని, ప్రస్తుతం 4 శాతం వడ్డీతోనే తీసుకోవడానికి అవకాశం ఉన్నందున మూడేళ్లలోనే లాభాల్లోకి వస్తుందని ఒక సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. ఎల్ అండ్ టీతో ఒక అంగీకారానికి వచ్చి, ముందుకు వెళ్తే తప్ప కేంద్రం సానుకూలంగా స్పందించే అవకాశం లేకపోవడంతో వీలైనంత త్వరగా పరిష్కారం కనుగొనేందుకు ప్రభుత్వం చర్చలను ముమ్మరం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.హైదరాబాద్ మెట్రో 69 కి.మీ మొదటి దశను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.22 వేలతో నిర్మించారు. కానీ అది కేవలం 3 శాతం ప్రయాణికుల అవసరాలు మాత్రమే తీరుస్తోంది. గతేడాది జూన్‌లో 1.30 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తే, ఈ ఏడాది జూన్?లో ఆ సంఖ్య 1.24 కోట్లకు తగ్గింది. ప్రధానంగా గుమ్మం నుంచి గమ్యం దాకా (ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ) సరైన ప్రజా రవాణా లేకపోవడమే ఇందుకు సమస్య. మెట్రోను నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ, ప్రభుత్వ సంస్థ హెచ్‌ఎంఆర్ అన్ని వేళల్లో, అన్ని స్టేషన్లలో ఈ సదుపాయం కల్పించడంలో విఫలమయ్యాయి. దీంతో నగరంలో కష్టమైనా 71 శాతం మంది వ్యక్తిగత వాహనాల్లోనే ప్రయాణిస్తున్నారు. స్టేషన్లలో పార్కింగ్ ఫీజులూ చెల్లిస్తున్నారు. ఆటోల్లో వస్తే ఎక్కువ డబ్బులు చెల్లిస్తున్నారు. మెట్రో ఎక్కడానికి వెళ్లినా, దిగినా ఇదే పరిస్థితి. ఛార్జీ గురించి

## రైలు నుంచి రయ్యిమంటూ...

భారత సైన్యం సంయుక్తంగా ఈ ప్రయోగం నిర్వహించాయి. దాదాపు 2,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని చేధించేలా ఈ అడ్వాన్స్‌డ్ అగ్ని క్షిపణిని రూపొందించినట్లు రక్షణ శాఖ చెబుతోంది. రైలు నెట్‌వర్క్‌పై ఎటువంటి ముందస్తు ఏర్పాట్లు లేకుండానే ఈ క్షిపణిని ప్రయోగించవచ్చని చెబుతోంది."ఈ ప్రయోగం భారతదేశాన్ని అత్యాధునిక క్షిపణి వ్యవస్థలు కలిగిన దేశాల వర్గంలో నిలిపింది. ఈ సందర్భంగా డీఆర్‌డీవ, ఎస్‌ఎఫ్‌సీ, సైన్యానికి అభినందలు" అని రాజ్‌నాథ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు 27న నియామక పత్రాలు

నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు- పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి హార్థిక ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని, ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు- చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ఈ -టె-లి కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీ-కే శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## 'స్థానిక'ంకు సిద్ధం కావాలి

నిర్వహించారు.క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయలేదని, తెలంగాణ సంస్కృతి పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేసేలా చూడాలని సూచించారు.



## వెనుకబడిన వర్గాల కోసం 'మోస్ట్ బ్యాక్‌వర్డ్ జస్టిస్'

మార్గం. అందుకే విద్యా రంగంలో వారికి మరింత అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నాం' అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. ఇకపై ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేస్తామని రాహుల్ గాంధీ తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో రిజర్వ్ చేసిన సీట్లలో సగం ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ఈబీసీ పిల్లలకు కేటాయిస్తాం. నియామకాలలో జరిగే అన్యాయ పద్ధతులను రద్దు చేస్తాం ఇది కేవలం విద్య గురించే కాదు. వెనుకబడిన వర్గాల సమానత్వం, గౌరవం కోసం పోరాటం. ఇదే నిజమైన సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి హామీ' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, అతి వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం 10 తీర్మానాలు చదివి వినిపించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే తప్పకుండా ఈ హామీలను నేరవేరుస్తామని చెప్పారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితం నిర్వహించిన కులగణన ప్రకారం, బిహార్? జనాభాలో 36శాతం మంది ఈబీసీలు ఉన్నారని అన్నారు. స్థానిక సంస్థలు, పంచాయతీల్లో ఈబీసీల రిజర్వేషన్లు 20శాతం నుంచి 30 శాతానికి పెంపు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో (రూ.25 కోట్లు వరకు) 50 శాతం వాటా. ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రవేశాలకు హక్కు. భూమిలేని కుటుంబాలకు పట్టణాల్లో 3 డెసిమల్, గ్రామీణ ప్రాంతాల్లో 5 డెసిమల్ భూమి కేటాయింపు' అని రాహుల్ గాంధీ తెలిపారు.బిహార్‌లో తమ కూటమి అధికారంలోకి వస్తే వారి సమాజంపై జరిగే దాడులకు వ్యతిరేకంగా కొత్త చట్టం తెస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో అధిక రిజర్వేషన్లు, విద్య, గృహనిర్మాణం, ప్రభుత్వ కాంట్రాక్టులలో ప్రత్యేక ప్రయోజనాలు వంటి చర్యలను హామీ ఇచ్చిందని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఇటీవల ఓట్ల చోరీ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత ఎన్నికల సంఘంపై దాడిని మరింత పెంచారు. ఈసీని ఎన్నికల కాపలాదారునిగా అభివర్ణించారు. తెల్లవారుజామున నిద్రలేచి ఓట్లచోరీకి పాల్పడుతున్నారని, దొంగలను రక్షిస్తుందని ఆరోపించారు.

## కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు నేటి నుంచి

పేర్కొంది. ఇక అక్టోబర్ 23వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించనున్నారు. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు అంటే రెండేళ్ల కాలానికి అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలుగా నిర్ధారించారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయని వారు దుకాణాలు పొందేందుకు అనర్హులు. ఇక మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేశారు అధికారులు.

## సృష్టి ఫెర్టిలిటీ కేసులో రంగంలోకి ఈడీ

హైదరాబాద్(జనంసాక్షి):సరోగసి పేరుతో పిల్లల ట్రాఫికింగ్‌కు పాల్పడిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రవేశించింది. హైదరాబాద్ పోలీసులు నమోదుచేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు ఫైల్ చేసింది. సంతానం లేని దంపతుల నుంచి సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత భారీగా నగదు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి ఆస్తుల్ని అనుభవించే హక్కులేదు

చెందిన 80 ఏళ్ల వృద్ధ జంట సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ తీర్పు వెలువడింది.2023లో ఈ వృద్ధ జంట కుమారుడి నుంచి పోషణ ఖర్చులు, అలాగే తమ ఆస్తులు తమకు చెందేలా చూడాలని కోరుతూ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిశీలించిన ట్రైబ్యునల్.. నెలకు రూ.3000 ఇవ్వాలని, అలాగే ముంబయిలోని వారి ఇంటిని ఖాళీ చేయాలని తీర్పునిచ్చింది. అయితే ముంబయి హైకోర్టు ఆ తీర్పును తోసిపుచ్చింది. 2007 చట్టం ప్రకారం ఆ కుమారుడు కూడా సీనియర్ సిటిజన్ కావడంతో అతడిని ఇంటి నుంచి వెళ్లగొట్టేలా ఆదేశాలు ఇచ్చే న్యాయపరిధి దానికి లేదని పేర్కొంది. అయితే హైకోర్టు పరిగణనలోకి తీసుకున్న కారణం తప్పని సుప్రీం అభిప్రాయం వ్యక్తంచేసింది. ట్రైబ్యునల్ తీర్పును సమర్థించింది. నవంబర్ 30లోగా ఆ కుమారుడు ఇంటిని ఖాళీ చేయాలని గడువు ఇచ్చింది.గతంలోనూ కోర్టు ఈ తరహా తీర్పునిచ్చింది. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆ బాధ్యతను విస్మరించిన వారికి కన్నవారి ఆస్తిని పొందే హక్కులేదని తేల్చి చెప్పింది. వృద్ధాప్యంలో అమ్మానాన్నల బాగోగులన్నీ చూసుకుంటానని హామీనిచ్చి, వారి నుంచి ఆస్తి పొందిన కుమారుడు మాట తప్పడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన తల్లిదండ్రులు సుప్రీంను ఆశ్రయించారు. ఆ కుమారుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేసి ఆ ఆస్తిపై వృద్ధుల హక్కును పునరుద్ధరించింది. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చట్టం ప్రకారం.. ఏర్పాటైన ట్రైబ్యునళ్లు... కన్నవారిని పట్టించుకోని బిడ్డల విషయంలో సత్వర విచారణ జరుపుతాయని తెలిపింది. ఇలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు బదిలీ చేసిన ఆస్తిపై యాజమాన్య హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రైబ్యునళ్లకు ఉంటుందని ధర్మాసనం స్పష్టంచేసింది.

# తెలంగాణలో జోరు వానలు

నిర్మల్ జిల్లా బాసర వద్ద కూడా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు నదిలో వరద పెరుగుతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పుష్కర ఘాట్ వద్ద మొదటి మెట్టు వరకు వరద ప్రవహిస్తోం ది. మరోవైపు శ్రీ రామ్‌సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2,85,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా 3,56,866 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. 40 ప్రధాన గేట్ల ద్వారా 3,41,000 క్యూసెక్కుల వరదను విడుదల చేస్తుండగా ఎస్కేప్ గేట్ల ద్వారా 2500 క్యూసెక్కులు, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 6214 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4000 క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. లక్ష్మీ కాలువ ద్వారా 2,100 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు కాగా ప్రస్తుతం 1,082 అడుగుల నీరు ఉంది. నీటి నిల్వ 80.5 టీఎంసీలకు గాను 50.706 టీఎంసీలు ఉంది. అయితే ప్రాజెక్టు ఎగువ భాగాన వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో వరద ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, రాగల 24గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడన ప్రభావం తో బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. నేడు, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్షాలు కురుస్తాయని, శుక్రవారం ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాలకు భారీ వానలు పడతాయని వివరించింది.బుధవారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, వరంగల్, మహబూబ్‌బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జనగాం, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముం దని ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వర్ష సూచన ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అధికారులు సూచించారు. అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని తెలిపారు. పిల్లలను ఇళ్ల నుంచి బయటకు పంపొద్దని వర్షం పడే సమయంలో చెట్ల కింద ఉండకూడని, పిడుగు పాటుకు గురయ్యే అవకాశముందని వివరించారు.

## ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి

వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు- ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్‌వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు-, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, హైడ్రాతోపాటు-, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇదిలావుంటే హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షం మొదలైంది. గురువారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, ప్యాట్నీ పారడైజ్, సికింద్రాబాద్, కోఠి, అబిడ్స్, చాదర్ ఘట్, మలక్ పేట్ తదితర ప్రాంతాల్లో వాన పడింది. గత వారం రోజులుగా అకాశమంతా మబ్బులుగా ఉంటూ అక్కడక్కడ వర్షం కురుస్తోంది. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి వర్షాలపై స్పందించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## అన్ని రంగాల్లోనూ స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించాలి

కోరుకుంటున్నామని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ ట్రేడ్ షో-2025ను ప్రధాని మోదీ గ్రేటర్ నోయిడాలో ప్రారంభించారు. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్థ, భారత్-రష్యా బంధం వంటి పలు అంశాలపై మోదీ మాట్లాడారు.దేశీయంగా ఉత్పత్తి అవుతున్న ఉత్పత్తుల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని ప్రధాని మోదీ తెలిపారు. ప్రతి పౌరుడు స్వదేశీ మంత్రాన్ని అవలంభిస్తున్నారని, వ్యాపారులు ఈ మంత్రాన్ని గర్వంగా స్వీకరించాలని కోరారు. స్వదేశీ డిజైన్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితులను సృష్టించాలని అభిప్రాయపడ్డారు. పరిశోధనా రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణలు జరగకపోతే ప్రపంచం ముందుకు సాగదని, అలాగే వ్యాపారాలు ఆగిపోతాయని చెప్పారు. నేడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి అని, ఆయన మనకు అంత్యోదయ మార్గాన్ని చూపించారని కొనియాడారు. అంటే ఆఖరి వరుసలో ఉన్న వారికి అభివృద్ధి ఫలాలు చేరాలని ఉపాధ్యాయ సామాజిక సందేశాన్ని ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ఫిన్ టెక్ రంగంలో తీసుకున్న కొన్ని మైలురాయి కార్యక్రమాల ద్వారా భారత్ పురోగతిని చూస్తోందని అభిప్రాయపడ్డారు.అలాగే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడటంతో ప్రజలపై పన్ను భారం మరింత తగ్గుతుందని ప్రధాని మోదీ తెలిపారు. జీఎస్టీ సంస్కరణల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జీఎస్టీలో ఇటీవలి నిర్మాణాత్మక సంస్కరణలు దేశ వృద్ధికి కొత్త రెక్కలు తొడిగాయని అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశకు ఒక ముఖ్యమైన అడుగుగా 2017లో జీఎస్టీని అమలు చేశామని పేర్కొన్నారు."మేము ఇక్కడితో ఆగబోవడం లేదు. ఆర్థిక వ్యవస్థ మరింత బలపడటంతో పన్ను భారం తగ్గుతూనే ఉంటుంది. దేశ ప్రజల ఆశీర్వాదాలతో జీఎస్టీలో సంస్కరణలు కొనసాగుతాయి. దేశం ఒక శక్తివంతమైన రక్షణ రంగాన్ని అభివృద్ధి చేస్తోంది. భారత్ స్వావలంబన సాధించాలి. పరిశోధన, ఆవిష్కరణలలో పెట్టుబడులను పెంచాలి. " అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలు సెప్టెంబర్ 22నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో నిత్యావసర వస్తువులు, ఔషధాల ధరలు మాత్రమే కాకుండా.. కార్లు, ఎలక్ట్రానిక్స్ ధరలు కూడా తగ్గాయి.ఈ పన్నులు భవిష్యత్తులో మరింత తగ్గుతాయని దేశ ప్రధాని వెల్లడించారు..ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2025కు రష్యా భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో నరేంద్ర మోదీ.. రష్యా, భారత్ బంధం గురించి కూడా ప్రస్తావించారు. స్వదేశీ రక్షణ ఉత్పత్తిని పెంచడంలో ఉత్తరప్రదేశ్ గణనీయమైన పాత్ర పోషిస్తోందని మోదీ పేర్కొన్నారు. రష్యా సహకారంతో ఏర్పాటు చేసిన కర్మాగారంలో ఏకే-203 రైఫిల్స్ ఉత్పత్తి త్వరలో ప్రారంభమవుతుందని అన్నారు.భారతదేశ స్వయం సమృద్ధిలో ఉత్తరప్రదేశ్ పాత్ర చాలా ఉంది.

**CHANGE OF NAME**

**I KESHAVAPATNAM HIMABINDU,** (Old Name) D/O. NARASIMHARAO.H.NO. 15-5-124/2/202/1, Chaitanyanagar, Khammam, Khammam(city) District, Telangana State. I have changed my name and henceforth called as **DASYAPU HIMA BINDU** w/o RAMAKRISHNA. Forall purpose here after my name known as **DASYAPU HIMABINDU** w/oRAMA KRISHNA.

## రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో
# హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ

- బతుకమ్మ కుంట పునరుద్ధరణ శభాష్ అంటూ సురేఖ కితాబు
- ఎండోమెంటు భూముల పరిరక్షణకు హైడ్రా సాయం కావాలన్న మంత్రి
- సీఎం అనుమతితో చర్యలు తీసుకునేందుకు యత్నిస్తామన్న రంగనాథ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో గురువారం సచివాయలంలోని ఫారెస్టు మినిస్టర్ ఛాంబర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ అయ్యారు. బతుకమ్మ కుంట పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంత్రి సురేఖ అభినందించారు. బతుకమ్మ కుంట పునరుద్దరణకు శభాష్ అంటూ కితాబు ఇచ్చారు. అయితే, తన పరిధిలో ఉన్న ఎండోమెంటు శాఖలోని భూముల పరిరక్షణకు హైడ్రా సాయం అవసరమని మంత్రి గుర్తు చేయగా... సీఎం అనుమతితో చర్యలు తీసుకుంటామని రంగనాథ్, మంత్రి సురేఖకు వివరణ ఇచ్చారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిక్షించేందుకు ఇప్పటికే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. అందుకోసం ప్రభుత్వ పరంగా... శాఖ పరంగా కావాల్సిన సాంకేతిక అంశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. హైడ్రా వచ్చాక చేపట్టిన పనుల వివరాలను రంగనాథ్... మంత్రికి సమగ్రంగా వివరించారు. అయితే, మంచి పనులు చేసే సందర్భంగా కొన్ని ఇబ్బందులు ఎదరవుతాయని... కానీ, సామూహిక ప్రయోజనంలో భాగంగా చేశారని మంత్రి సురేఖ కొనియాడారు. హైడ్రా చేస్తున్న పనులు రానున్న కాలంలో అందరికీ తెలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వరంగల్ నాలాల ఆక్రమణలను కూడా రంగనాథ్‌తో చర్చించారు. వాటిని పరిష్కరించేందుకు తమకు సహకరించాలని అన్నారు. అందుకు ఆయన సుముఖత తెలిపారు. కాగా, బతుకమ్మ కుంట వేడకులకు మంత్రి సురేఖను, రంగనాథ్ ఆహ్వానించారు.

## మాతృభాష, సంస్కృతికి
# విద్యార్థి దశ నుంచే బీజం పడాలి

- మాతృ భాషను కాపాడుకోవాలి
- శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- 'తెలంగాణ భాష - సమగ్ర పరిశీలన' గ్రంథాన్ని ఆవిష్కరించిన ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మాతృభాష, సంస్కృతికి విద్యార్థి దశ నుంచే బీజం పడాలని, కానీ ప్రస్తుత సమకాలీన పరిస్థితులు అందుకు భిన్నంగా మారుతున్నాయని రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువారం అబిడ్స్ బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య గంటా జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 'తెలంగాణ భాష – సమగ్ర పరిశీలన' గ్రంథాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ఆవిష్కరించగా ఆ గ్రంథాన్ని గుత్తా సురేందర్ రెడ్డికి అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ చిన్న నాటి నుంచే పిల్లలకు మాతృభాష దూరమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాతృభాష తెలుగులో మాట్లాడాలని పిల్లలను గద్దించి చెప్పే పరిస్థితులు గుత్తా అభిప్రాయపడ్డారు. పాఠశాలల ప్రాంగణాల్లో, ఉపాధ్యాయులతోనే మాతృభాష పరిరక్షణ సాధ్యమవుతుందని ఆయన అన్నారు. భాషా, సంస్కృతి లేనప్పుడు గురు శిష్యులు, తల్లిదండ్రులు పిల్లల మధ్య కూడా బంధాలు కృత్రిమంగా మారుతున్నాయని గుత్తా సుఖేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మాతృభాష తెలుగులో పరిరక్షించాల్సిన ఆవశ్యక ఆవశ్యకత ఉందని గుత్తా అన్నారు. మాతృభాష పరిరక్షణ ప్రభుత్వ పాఠశాలల్లోనే అమలు అవుతోందని అన్నారు. రాష్ట్రంలో 18 లక్షల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 36 లక్షలు ఉన్నాయని, దీన్ని బట్టి మాతృభాష పరిరక్షణ పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష తెలంగాణ ప్రాంతంలోనే పుట్టిందని, ఆంధ్రప్రదేశ్ లో కాదని అన్నారు. శాతవాహనుల కాలం నుంచి చివరి నిజాం వరకు తెలుగు భాష ఉందని, అయితే తెలంగాణ ప్రాంతంలో ఉర్దూ ప్రభావం ఉండడం వల్ల యాస మారిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతం ముఖ్యంగా హైదరాబాద్ మినీ ఇండియా వంటిదని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ భాషను అపహాస్యం చేశారని అన్నారు. ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ వస్త్రాలనే వాడండి : ఎంపీ లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** దేశం అన్ని రంగాల్లో మరింతగా రాణించాలంటే స్వదేశీ వస్త్రాలనే ఉపయోగించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. దిన్ దయాళ్ ఉపాధ్యయ జయంతి సందర్భంగా లక్ష్మణ్ నివాళులర్పించారు. గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. దిన్ దయాళ్ ఉపాధ్యాయ ఇచ్చిన సందేశాన్ని మోదీ సాకారం చేస్తున్నారని తెలిపారు. ప్రధాని జన్ ధన్ ఖాతాలు తెరిపించి బ్యాంకులకు చేరువ చేశారని.. దిక్కు లేని వారికి మోదీ దిక్కయ్యారని చెప్పుకొచ్చారు. 4 కోట్ల మందికి ఆవాసం నిర్మించారన్నారు. మరుగుదొడ్ల నిర్మించడంతో పాటు.. అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని ఎంపీ పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకూడదని స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని పిలుపు ఇచ్చారన్నారు. అక్టోబర్ 2న చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి.. చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో భారతదేశాన్ని అభివృద్ధిలో 4వ స్థానానికి మోదీ తీసుకువచ్చారని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ తగ్గించారని.. గొప్ప సంస్కరణ తీసుకువచ్చారని కొనియాడారు. అమెరికా లాంటి దేశాలు టారిఫ్ పేరిట ఇబ్బందులు పెడుతున్నా.. దేశంలో అనేక స్టార్టప్ సంస్థలు తీసుకువస్తున్నారని అన్నారు. సేవ పక్వడలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2047 వరకు దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వదేశీ వస్త్రాలు ఉపయోగించాలని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# మన సంస్కృతి.. మన గౌరవం.. మన బతుకమ్మ..

- బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఉప్పల స్వప్న



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సచివాలయంలో సచివాలయం ఉద్యోగుల సంఘం కార్యదర్శి నాగమణి పిలుపు మేరకు శాసనమండలి ఉద్యోగుల బతుకమ్మ సంబరాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త సతీమణి ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. ఆడబిడ్డలంతా ఓచోట చేరి ఆట పాటలతో, కోలాటాలతో తొమ్మిది రోజుల పాటు ఆనందంగా జరుపుకొనే తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ మహిళ ప్రెసిడెంట్ భాగ్య లక్ష్మి, మనిమాల, నళిని తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన మోమిన్ పేట వ్యవసాయాధికారి

**వికారాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** మోమిన్ పేట్ మండల వ్యవసాయ శాఖ అధికారి భూపతి జయశంకర్, ఫర్టిలైజర్ షాప్ అనుమతుల కోసం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక ఫర్టిలైజర్ షాప్ లైసెన్స్ కోసం జయశంకర్ లంచం డిమాండ్ చేశారు. మొదటగా రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయగా, చివరికి రూ. 75 వేలకు అంగీకరించారు. లైసెన్స్ అనుమతులు ఇచ్చిన తర్వాత, మొదటి విడతగా రూ. 50 వేలు లంచం తీసుకుంటు–న్న సమయంలో ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకున్నారు. వికారాబాద్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. అవినీతికి వ్యతిరేకంగా ఏసీబీ అధికారులు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో జయశంకర్‌ను అరెస్టు చేసి తదుపరి చర్యల కోసం తరలించారు. ప్రభుత్వ శాఖలలో లంచం తీసుకోవడం నేరం అని, అటు–వంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు హెచ్చరించారు.

## ఆగివున్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

**నిజామాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం సుద్దపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44 వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. లారీని ఢీకొట్టిన తర్వాత డివైడర్ పైకి ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లింది. ఈ సకనమాదం పది మంది గాయడడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు యూ–టర్న్ తీసుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అంగన్‌వాడీలకు దసరా సెలవులు

- తొలిసారి 8 రోజుల పాటు మంజూరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు ఎనిమిది రోజుల పాటు–దసరా సెలవులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల చరిత్రలో తొలిసారిగా దసరా సెలవులు ఇవ్వడం ఇదే ప్రథమం. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే దసరా, బతుకమ్మ పండగలు జరుపుకునే విధంగా దసరా సెలవులు మంజూరు చేయాలని ఐఎన్టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి.అన్నపూర్ణ, ఇతర ప్రతినిధుల బృందం మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కలిసి ఇటీ–వల విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సీతక్క సెలవులు మంజూరు చేయించారు. ఈ మేరకు 27 నుంచి అక్టోబర్ 4 వరకు దసరా సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు యధావిధిగా పోషకాహారాన్ని అందజేయాలని సూచించారు. అంగన్వాడీలకు సెలవులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు అంగన్వాడీ టీ–చర్లు, హెల్పర్లు కృతజ్ఞతలు తెలిపారు. 8 రోజుల పాటు– అంగన్‌వాడీ కేంద్రాలు మూసి ఉండనున్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలంటే కాంగ్రెస్‌కు జంకు

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలంటే కాంగ్రెస్ పార్టీ జంకుతుందని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. 20నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏం చేయాలో అర్థం కానీ కన్ఫ్యూజన్‌లో ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసమర్థతను, అవినీతిని, కుటుంబ పాలనను ఎండగడుతామని కాంగ్రెస్ చెప్పి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఏం చేస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. లక్ష కోట్లు కేసీఆర్ కుటుంబం నుంచి కక్కించి పేద ప్రజలకు అందిస్తామని కాంగ్రెస్ చెప్పలేదా అని ప్రశ్నించారు. నేడు డబ్బులు లేవని సంక్షేమ పథకాలు ఇవ్వలేని దుస్థితికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేరిందని ఆరోపించారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో దోసుకున్న సొమ్ముతో కొందరు ఆగడం లేదని మండిపడ్డారు ఎంపీ రఘునందన్ రావు. బీఆర్ఎస్ నేతలు మీడియాను మేనేజ్ చేసి నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గురువారం సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో రఘునందన్ రావు మాట్లాడారు. వర్షాలు బాగా కురిశాయని.. ఒక దశలో వానలు ఆగాలని అన్నదాతలు కోరుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రకృతి, పర్యావరణం ప్రకోపిస్తోందని తెలిపారు. మనుషుల ప్రవర్తన మారి మంచి బుద్ధి ప్రసాదించాలని నవరాత్రుల సందర్భంగా కనక దుర్గమ్మను కోరుకున్నానని పేర్కొన్నారు. దేశంలో జాతీయ రహదారులు తప్పా మిగతా రహదారులపై కనీసం కారు వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు ఎంపీ రఘునందన్ రావు. నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రోడ్లు గుంతల మయంగా మారాయని వెల్లడించారు. దసరా సెలవులను ఉపాధ్యాయులు రద్దు చేసుకొని ఉద్యోగం చేయాలనే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి చేస్తోందని ప్రశ్నించారు. దసరా సెలవుల కోసం ఊరు వెళ్లిన ఉపాధ్యాయులను ఉద్యోగం చేయాలని ఎందుకు అధికారులు కోరుతున్నారని నిలదీశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని.. ఇప్పటికీ కూడా అందుకు సంబంధించిన జీవో ఎందుకు పాస్ చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ జీవోపై ఎవరూ కోర్టుకి వెళ్తారో తెల్వని పరిస్థితిలో ఉద్యోగులను దసరా సెలవుల్లో కూడా పని చేయించడం సరికాదని చెప్పుకొచ్చారు. దసరా సెలవుల్లో కూడా ఉద్యోగులతో ప్రభుత్వం పని చేయిస్తోందని.. ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. తెలంగాణలో ఆడబిడ్డలకు ఎంతో ఇష్టమైన పెద్ద పండగ బతుకమ్మ, టీచర్లలో ఎక్కువ మంది మహిళలు ఉంటారని చెప్పుకొచ్చారు. దసరా సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు పనిచేసే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఆలోచనను మరోసారి పునరాలోచన చేయాలని రఘునందన్ రావు సూచించారు.

# అంగన్‌వాడీలపై ప్రభుత్వం దాష్టీకం

- ఇదేనా మహిళలను కోటీశ్వరులను చేయడం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** అంగన్‌వాడీ టీచర్లపై రేవంత్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించడాన్ని ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడిక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటు– అని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఉద్యోగులకు గౌరవం లేదా... గుర్తింపు లేదా..? అని ప్రశ్నించారు. ప్రజా పాలన అని రాక్షస పాలన కొనసాగిస్తారా..? అని నిలదీశారు. ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ సంబురం లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారి ఉసురు తగులుతుందని అన్నారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కెసిఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్‌వాడీ టీ–చర్లు అని పోస్టును ఉన్నతీకరించి వారి గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీ–చర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేదని, కానీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీ–చర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్ వాడీ టీ–చర్ల వేతనాన్ని రూ.7,800లకు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారని చెప్పారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఇపిఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి, 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీ లేదు, గతీ లేదని విమర్శించారు. మహాలక్ష్మి పేరిట సిఎం అమలు చేస్తున్న ఉచిత బస్సుల్లోనే జిల్లాల నుంచి సచివాలయం వద్దకు వచ్చి మిమ్మల్ని నిలదీస్తున్నారని, రేవంత్‌రెడ్డి మోసపూరిత వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అరెస్టులు చేసిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీష్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## కొంపెల్లి వెంకట్‌గౌడ్ మృతి పట్ల
# కేసీఆర్ సంతాపం



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ సామాజిక చారిత్రక సాహితీవేత్త, ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణం సాహితి లోకానికి ఎంతో తీరని లోటని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన సంతాపం ప్రకటించారు. ప్రొఫెసర్ జయశంకర్‌తో సంభాషణ, వొడువని ముచ్చట, పుస్తకం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనుసరించాల్సిన రాజకీయ భావజాలాన్ని వ్యాప్తిచేసిన ఉద్యమ రచయిత కొంపెల్లి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను రికార్డుచేసి వెలుగులోకి తెచ్చి, బీసీల రాజకీయ చైతన్యం కోసం పాటుపడిన ఘనత కొంపెల్లిదేనని.. వారితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణవాదిగా, బహుజన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ పలు రచనలు చేసిన వెంకట్ గౌడ్ అకాల మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. వారి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులు మిత్రులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# శ్రీశైలం, సాగర్‌లకు పెరుగుతున్న పర్యాటకులు

- పూర్తిస్థాయికి రెండు జలాశయాలు
- ఆయకట్టు రైతుల్లో ఆనందం



**నాగార్జునసాగర్, సెప్టెంబర్25 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనిమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాటకుల రాక పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులలు కాగా 587 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నారు. దీంతో నిండుకుండ ను తలపిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. శ్రీశైలం జలాశయం కూడా నిండుకుండలా మారింది. ఎగువన వర్షాలతో మరింతగా వరదవచ్చి చేరుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపించింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్స్‌లు జారీచేసి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నాగార్జున



**హైదరాబాద్, సెప్టెంబర్25 (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీ హైకోర్టును టాలీవుడ్ ప్రముఖ నటుడు, హీరో అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా.. తన ఫోటోతోపాటు తన పేరును వాడుకోకుండ నిషేధం విధించాలంటూ ఢిల్లీ హైకోర్టులో హీరో నాగార్జున పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ తేజస్ కారియా విచారించారు. పర్సనాల్టీ రైట్స్ కోసం గతంలో బాలీవుడ్ హీరోహీరోయిన్లు అమితాబ్ బచ్చన్, ఐశ్వర్య, అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్ తదితరులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సినీనటుల అనుమతి లేకుండా వారి పేరును వాడుకోవద్దంటూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హీరో నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

జనంసాక్షి www.janamsakshi.org
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

# తగ్గించిన "జీఎస్టీ" రేట్లు అమలు ఎప్పుడు?




వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) 2017లో ప్రవేశపెట్టారు. మోదీ ప్రభుత్వం దీన్ని మంచి సరళమైన పన్ను గా చెప్పింది. "ఒక దేశం ఒక పన్ను" అని ప్రచారం చేసింది. కానీ, గత ఎనిమిది సంవత్సరాలలో ఇది ప్రజలకు ఎంతో భారం అయింది. వ్యాపా రులు, వినియోగదారులు దీనితో చాలా ఇబ్బంది పడుతున్నారు. వార్తా సంస్థలలో దీని పై అనేక విమర్శలు వచ్చాయి. ఈ "జీఎస్టీ" ని రద్దు చేయాలనీ,లేదా కనీసం తగ్గించాలని ప్రజల నుండి ,వ్యాపారస్తుల నుండి గత ఎనిమిదేళ్ళుగా ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వం పటించుకో లేదు. కానీ, ఇప్పుడు గుజరాత్ ఎన్నికల ముందు ప్రజలు ఆగ్రహాన్ని కొంత మేరకు అయినా చల్లార్చటం కోసం 2025 సెప్టెంబర్‌లో జీఎస్ టీ రేట్లు తగ్గించారు..కానీ మార్కెట్ (బజారు)లో వ్యాపారులు గత 3 రోజులుగా పాత ధరల్లో మార్పు లేదు. ఎవరూ మోదీ ప్రభుత్వం మాటలను ఖాతరు చేయటంలేదు. ఇది ఎన్నికల ముందు మోసమని ప్రజలు అనుకుంటున్నారు.

ఈ వస్తు మరియు సేవల పన్ను (జీఎస్ టీ) ప్రవేశపెట్టినప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేశారు.దీనితో గతంలో కంటే పన్నులు తగ్గుతాయి అన్నారు. వ్యాపారం సులభతరం అవుతుంది అన్నారు. కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది.దీనితో బహుళ స్థాయిల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయి. వినియోగదార్లకు లాభం శూన్యం. ఈ జీఎస్టీ– జీరో(0) శాతం, 5 శాతం, 12 శాతం,18 శాతం,28 శాతం రేట్లుగా ఈ వస్తు,సేవల పై పన్ను పెంచారు.ఇది కాకుండా అదనపు(సెస్) పన్ను కూడా ఉంది. ఇది సరళమైన పన్ను విధానం కాదు. బహు సంక్లిష్టమైంది.

వార్తా సంస్థలలో "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ఇలా రాసింది. "వస్తు మరియు సేవల పన్ను (జీఎస్టీ ) బహు గందరగోళం" అని. ఇది " భారత ఆర్థిక వ్యవస్థకు ఎంత మాత్రం సరిపోదు" అని రాసింది. పైగా దీనితో "చిన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి అను గుణంగా ఖర్చులు పెరిగాయి" అని పేర్కొంది. గత, ఎనిమిది సంవత్సరాలుగా వస్తు మరియు సేవల పన్ను (జీఎస్టీ) "గబ్బర్ సింగ్ పన్ను"గా మారింది అని కాంగ్రెస్ తరపున ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. " ఇది పేదలను దోచేస్తుంది"అని "ఎకనామిక్ టైమ్స్" రాసింది. మొదట్లో గబ్బర్ సింగ్ పన్ను అని హేళనగా నవ్వుతూ విమర్శలు చేసేవారు. జీఎస్టీతో, గతంలో కంటే, ఇప్పుడు సరళమైన పన్నుగా మారిందా? అని ప్రశ్నలు వేసే వారు. వస్తు మరియు సేవల పన్ను రేట్లుతో, ద్రవ్యోల్బణం తగ్గుతుందా!? అని "హిందూ పత్రికలో" సంపాదకీయం రాశారు.సామాన్య ప్రజలు, దిగువ మధ్యతరగతి ప్రజల ఆదాయానికి నష్టం జరుగుతుందని ఆ పత్రిక కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. వస్తు మరియు సేవల పన్నును అమలు చేయటంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. చిన్న వ్యాపారులు ప్రభుత్వానికి ఎకౌంట్స్ దాఖలు చేయడం కష్టం. వస్తు మరియు సేవల పన్ను ద్వారా అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు మూత పడ్డాయి. ఎక్స్‌లో ఒక పోస్ట్ ఇలా చెప్పింది. "పద్దెనిమిది లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి వ్యాపారాలు మూత పడ్డాయని". మరో పోస్ట్‌లో "సాంకేతిక భారం" అని. "చిన్న వ్యాపారులకు చాలా ఇబ్బంది" అని. "వస్తు మరియు సేవల పన్నులో అస్థిర రేట్లు, అసమర్థతలు ఉన్నాయి అని. రెండుసార్లు పన్ను వసూళ్ల సమస్య ఉంది అని " ఫెయిర్ అబ్జర్వర్" అనే వార్తా సంస్థ రాసింది.

జీఎస్టీతో వినియోగదారులపై ప్రభావం ఎలా ఉంది అని చూస్తే... వస్తు మరియు సేవల పన్ను తర్వాత ధరలు బాగా పెరిగాయి. సేవలపై రేట్లు కూడా ఎక్కువే. భోజన శాలలు, హెూటళ్లు, దూర సంచారం ఖరీదైనవి అయ్యాయి అని బీబీసీ పేర్కొంది. వస్తు, సేవల పన్ను తగ్గింపులు మధ్య తరగతికి మేలు చేస్తాయి అని. కానీ ద్రవ్యోల్బణం ఎక్కువ అవుతుంది అని. "క్లియర్ టాక్స్ సైట్ " లో రాశారు. వస్తు మరియు సేవల పన్ను రాష్ట్ర ఆదాయంపై మంచి, అలాగే చెడు ప్రభావాన్ని కలిగి ఉంది. రాష్ట్రాల ఆదాయం గతంలో కంటే గణనీయంగా పడిపోయింది. కేంద్ర నుండి రావాల్సిన పరిహారం (రాజకీయ కారణాలతో)ఆలస్యమైంది.దానితో రాష్ట్రాలు తమ ఖర్చుల కోసం కేంద్ర పై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. కేంద్రం ఇచ్చే పన్నుల వాటాలో కూడా రాజకీయ కారణాలతో కోతలు విధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దానితో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ పెరిగింది.ఈ జీఎస్టీ రాష్ట్ర పన్నుల ఆదాయాన్ని కొంత మేరకే భర్తీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయాయి. ఎక్స్ పోస్ట్‌లో ఇలా ఉంది. రాష్ట్రాల ఆదాయం బాగా తగ్గింది అని. కేంద్రం విశ్వాసం భంగం చేసింది అని. వార్తా సంస్థలలో ది వైర్ రాసింది. వస్తు మరియు సేవల పన్ను 2.0 శీర్షికలు చేస్తుంది. కానీ నిజమైన సంస్కరణలుగా లేవు అని. విపక్ష పాలిత రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం పై ఎక్కువ కోపంగా ఉన్నాయి. ఈ జీఎస్టీ లాభాలు అధికార పక్షం (బీజేపీ) ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు, మిగతా వాటికి వివక్షలతో కూడిన నిధుల కేటాయింపులు జరిగాయి.

ఎట్టకేలకు ఇప్పుడు కేంద్రం ప్రభుత్వం 2025 సెప్టెంబర్ లో జీఎస్టీ రేట్లు తగ్గించారు. వస్తువులపై 5 శాతం, 18 శాతం రెండు స్థాయిలు గా తగ్గించారు అని "టైమ్స్ ఆఫ్ ఇండియా" లో రాశారు." కొత్త జీఎస్టీ" రేట్లు ప్రభావ వంతమైనవి కావనే విమర్శలు వచ్చాయి. ఇది ఎన్నికల ముందు ఓటర్లను ఏమార్చటం అనే విమర్శలు వచ్చాయి."బిహార్ ఎన్నికల కోసమా!" అని. చిదంబరం ట్వీట్ చేశారు. " "ఇప్పటికైనా జీఎస్టీ రేట్లలో మార్పులు చేసినందుకు స్వాగతం. కానీ, చాలా ఆలస్యం అయింది అని" మమతా బెనర్జీ విమర్శించారు. రాష్ట్రాల ఆదాయ నష్టం రూ.20 వేల, కోట్లు అని. ఇది కేంద్రం–రాష్ట్రాల మధ్య పోటీ అని వార్తా సంస్థలు రాశాయి.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన తర్వాత బజారులో జీఎస్ టీ అమలు ఎలా ఉంది?. 4 రోజులు గడిచినా వ్యాపారులు ధరలు తగ్గించట్లేదు. వినియోగదార్లకు రసీదులు ఇవ్వట్లేదు. పాల ప్యాకెట్ల పై, ఇతర వంట నూనె ప్యాకెట్ల పై ముద్రించిన పాత (ఎం.ఆర్.పీ) రేట్లకే సరుకులు అమ్ముతు న్నారు. గతంలో ఏ వస్తువు పై ధరలు పెంచినా వార్త వెలువడిన తక్షణమే పాత సరుకు (ఎం.ఆర్.పీ.) రేట్ల ముద్రణతో నిమిత్తం లేకుండా అమలులోకి వచ్చేవి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం జీఎస్టీ రేట్లు తగ్గించినట్లుగా డిస్ప్లే బోర్డులు పెట్టడం లేదు. ధరలు తగ్గించి అమ్మటం లేదు. మార్కెట్‌లో వినియోగదార్లకు... దుకాణం యజమానికి ఈ విషయంలో గొడవలు జరుగుతు న్నాయి. జీఎస్టీ అమలు జరుగుతుందా? లేదా అని తనిఖీ చేసే వ్యవస్థ లేదు. ఎక్స్ పోస్ట్‌లో ఇలా ఉంది. వస్తు మరియు సేవల పన్ను తగ్గింపు ఒక మోసం అని. ఆ డిఫెరెన్స్ ఎమౌంట్ మోదీ ప్రభుత్వం జేబులో వేసుకుంటుంది అని సోషల్ మీడియాలో వినియోగదార్లు కోపంతో పోస్టలు పెడుతున్నారు.మరో పోస్ట్‌లో "కొత్త రేట్లు ప్రభావవంతమైనవి అని , కానీ వినియోగదారుల బిల్లులు తగ్గుతాయా అని సందేహం వ్యక్తం చేస్తూ" ఎన్‌డీటీవీ పేర్కొంది.


గత పదకొండు సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో బూటకపు వాగ్దానాలు చేసింది. నోట్ల రద్దు విఫలమైంది. వస్తు మరియు సేవల పన్ను (జీఎస్టీ)అమలు ఘోరమైంది. వార్తా సంస్థలలో జైరాం రమేష్ "గబ్బర్ సింగ్ పన్ను " అని మళ్లీ చెప్పారు. ప్రజలు జీఎస్టీ అమలు కాకపోవడంతో కోపంగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి ఫిర్యాదు చేస్తున్నాయి అని "హిందుస్తాన్ టైమ్స్‌లో రాశారు. పంజాబ్‌లో లాభాలు బదిలీ చేయడం సవాలు అని. ఇది ప్రజలను మోసం చేసే ప్రకటన అని వార్తా సంస్థలు రాశాయి.

జీఎస్టీ పన్నును విశ్లేషణ చేస్తే... " ఇది ప్రభుత్వ వైఫల్యం. ఆదాయం లోటు ఉంది. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంది. పెట్రోల్, మద్యం జీఎస్టీ బయట ఉన్నాయి. ఎగుమతి దారులకు తిరిగి చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి " అని, " టైమ్స్ ఆఫ్ ఇండియా" రాసింది. వస్తు మరియు సేవల పన్నును మళ్లీ రూపొందించాలి అని. ఇంకా ఈ నూతన జీఎస్టీ రేట్లు అమలు చేయటం ఆలస్యం అయితే ప్రజల ఆగ్రహం పెరగవచ్చు. మోదీ మాటలు నమ్మదగినవి కావు. ఇది ఆర్థిక మోసం. భవిష్యత్తులో నిజమైన సంస్కరణలు అవసరం.అని ప్రజలు సోషల్ మీడియా లో డిమాండ్ చేస్తున్నారు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# దొరల పెత్తనాన్ని ఎదురించిన ధీశాలి!



ఉమ్మడి రాష్ట్రంలో మరుగునపడిన తెలంగాణ వైతాళికులు, పోరాట యోధులకు స్వరాష్ట్రంలో సముచిత గౌరవం లభిస్తున్నది. ఇప్పటికే అనేకమంది కవులు, పోరాట యోధుల జయంతి, వర్ధంతులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా తెలంగాణ సాయుధ పోరాటంలో వీర వనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ జయంతి, వర్ధంతిని అధికారికం గా నిర్వహించాలని గతేడాది తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం తెలంగాణ వాషర్‌మ్యాన్ కో–ఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.15 లక్షల నిధులు మంజూరు చేసింది. బీసీ సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఐలమ్మ పోరాటం గురించి గానీ, ఆమెపై దొరలు చేసిన పాశవిక దాడుల గురించి గానీ నేటి యువతరానికి అంతగా తెలియదు. ఆమె గురించి ఉమ్మడి రాష్ట్రంలో పాఠ్య పుస్తకాల్లో ఎక్కడా ప్రస్తావన లేదు. నిస్వార్థ త్యాగానికి ప్రతీకైన ఆమె ప్రతిమకు టాంక్ బండ్‌పై స్థానం దక్కలేదు. భారత దేశానికి పర పీడన పాలన నుంచి విముక్తి కోసం సాగిన స్వాతంత్ర్య పోరాటం, నిజాం పాలనలో రజాకార్ల బాధలను అంతమొందించేందుకు సాగిన మహెూజ్వల వీర తెలంగాణ సాయుధ పోరాటం ఒకే కోవకు చెందినవి. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందేందుకు సాగిన వీరోచిత పోరాటంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతోమంది పాల్గొని అమరులయ్యారు. 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో హైదరాబాద్ సంస్థానంలో సంస్కరణ ఉద్యమాలు మొదలయ్యాయి. ఆంధ్ర జనసంఘం ఆధ్వర్యంలో 1921 నుంచి ఉద్యమాలు మొదలయ్యాయి. ఆ సంఘమే ఆ తర్వాత ఆంధ్ర మహాసభగా మా ర్పు చెందింది. కౌలు రైతులను వెళ్లగొట్టే బేదఖల్‌ను భూస్వాములు మొదలుపెడితే జనం ప్రతిఘటించారు. ఆంధ్ర మహాసభ 'సంఘం' పేరు తో కార్యక్రమాలు నిర్వహించింది.

నాటి నల్లగొండ జిల్లా పాలకుర్తిలో ఆంధ్ర మహాసభ కార్యదర్శి ఆరుట్ల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో జనం విసునూరు దొర గూండాలను అడ్డుకున్నారు. గూండాలను అడ్డుకున్న వారిలో చాకలి ఐలమ్మ, ఆమె భర్త నర్సయ్య, ఇద్దరు కొడుకులు లచ్చయ్య, సోమయ్య కూడా ఉన్నారు. తన గూండాలను అడ్డుకొన్నారన్న కోపంతో విసునూరు దొర రామచంద్రారెడ్డి ఐలమ్మ ఇంటి మీద దాడులు చేయించాడు. రజాకార్లు కూడా ఐలమ్మ ఇంటి మీద దాడులు చేశారు. అయినా ఐలమ్మ ధైర్యంగా వారికి ఎదురు నిలబడింది. ఈ పోరాటంలో ఐలమ్మ భర్త చనిపోయారు. ఐలమ్మ కుటుం బం సర్వస్వం కోల్పోయింది. 40 ఊళ్ల మీద పెత్తనం చేసే విసునూరు దొరను ఎదిరించిన ఐలమ్మ పోరాటం ప్రజలకు ప్రేరణ కలిగించింది. తెలంగాణ గడ్డ మీద నడిచిన ఇంతటి ఉజ్వల పోరాటాన్ని ఆంధ్రా కమ్యూనిస్టులు హైజాక్ చేశా రు! ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొనని ఆంధ్రా నాయకులు సైతం అనుభవాల పేరుతో కట్టల కొద్దీ పుస్తకాలు రాశారు.

ఐలమ్మ జీవితమంతా పోరాటమే. తొలి రోజుల్లో ఆమె భూమి కోసం పోరాడారు. కడుపు నిండా తినలేదు. కంటి నిండా నిద్రపోలేదు. ఆమె కుటుంబం చెట్టుపుట్టల పాలైంది. ఐలమ్మకు స్వాతంత్ర్య సమరయోధుల పింఛను రాలేదు. పోరాటయోధురాలిగా గుర్తింపు దక్కలేదు. కౌలుకు చేసిన భూమి దక్కలేదు.కానీ నాడు కెసిఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశం గా చేర్చింది. రేవంత్ ప్రభుత్వం బడుగులను గౌరవించే విధంగా మహిళా విశ్వవిద్యాలయా నికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి సత్కరించింది.తెలంగాణలో తొలి భూపోరాటానికి నాంది పలికిన వీర వనిత చాకలి ఐలమ్మ. విసునూరు దొరను ధైర్యంగా ప్రతిఘటించి ప్రజలను ఉద్యమ బాట పట్టించిన చైతన్య దీప్తి ఆమె. దొర దాడిలో అయినవాళ్లను, ఆస్తులను పోగొట్టుకున్నా వెనకడుగు వేయకుండా పోరాటం సాగించిన యోధురాలు ఐలమ్మ. ఆమె జీవితమంతా పోరాటమే.1895 సెప్టెంబర్ 26 వరంగల్ జిల్లా రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో జన్మించింది. కనీసం కమ్యూనిస్ట్ పార్టీల నాయకుల పలకరింపునకు కూడా ఆమె నోచుకోలేదు. అవసాన దశలో ఆమె పేదరికంతో బాధ పడ్డారు. పట్టించుకునే నాథుడు లేక అష్టకష్టాలు పడి చివరికి 1985, సెప్టెంబర్ 10న తుదిశ్వాస విడిచారు. అలాంటి ఆదర్శమూర్తి జయంతి, వర్ధంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ సముచిత గౌరవం ఇస్తుండటం అభినందనీయం.

**(సెప్టెంబర్ 26, చాకలి ఐలమ్మ జయంతి)**



డాక్టర్ సంగని మల్లేశ్వర్
జర్నలిజం విభాగాధిపతి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
సెల్– 9866255355

జనంసాక్షి

# అయిలవ్వకు అరుణాంజలి

దొర బాంచన్ నీ కాళ్లు మొక్తా' అనే రోజుల్లో జీవన్మరణ సంగ్రామంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో ముందునిలిచి దేశముఖ్ దుర్మార్గాలకు ఎదురొడ్డిన ధీరనారి చాకలి అయిలమ్మ. ఆమె రగిలించిన ఉద్యమం తెలంగాణ సాయుధ పోరాటానికి వేదికగా మారింది. ఆమె వీరోచిత చరిత్ర శరీరంలో రోమాంచం కలిగిస్తుంది. నమ్మిన ఆశయం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా ఎర్రజెండాను వీడని గుండె దిటవు ఆమెది. నిరాడంబరత్వానికి నిలువెత్తు నిదర్శనం అయిలమ్మ. స్వాతంత్ర్యానికి ముందు అసఫ్ జాహీ పాలనలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులు కాలరాయబడ్డాయి. సంస్థానాధీశులు బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా మారి, భూస్వా మ్య నియంతృత్వ పాలనను సాగించారు. హైదరాబాద్ సంస్థానంలో ఖాసింరజ్వీలకు అధికారం, అహంకారం పెనవేసుకున్నాయి. విలాస జీవితం గడుపుతూ, హత్యలు, మానభంగాలు, గృహదహనాల వంటి అకృత్యాలకు పాల్పడ్డారు. ఈ మోడు బారిన జీవితాలకు ఆంధ్రమహాసభ ఆశాకిరణంగా నిలిచింది. దేశముఖ్ అనుచరులను తరిమికొట్టి, తొలి భూపోరాటానికి నాంది పలికిన అగ్నికణం అయిలమ్మ. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం క్రిష్టపురంలో 1895లో సద్దుల బతుకమ్మ పండుగ రోజు న ఓరుగంటి మల్లమ్మ, సాయిలు దంపతులకు జన్మించింది. ఆరుగురు కుమార్తెలు, నలుగురు కుమారులలో నాల్గవ సంతానం ఆమె. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కారణంగా చిన్ననాటి నుంచే కష్టాలు ఎదురయ్యాయి. కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగించారు. పద్నాలుగో ఏట పాలకుర్తి గ్రామ నివాసి చిట్యాల నర్సయ్యతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. పాలకుర్తి, అప్పట్లో నల్గొండ జిల్లా పరిధిలో ఉండేది, తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేరింది. పాలకుర్తికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న విసునూరు గ్రామంలో నరహంతక పాలన సాగించిన విసునూరు దేశముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, నిజాం నవాబు నమ్మిన బంటు, 40 వేల ఎకరాల భూస్వామి, 60 గ్రామాలకు అధిపతి. రజాకార్ల ఉపసేనాధిపతిగా ఉంటూ వెట్టిచాకిరి, వేధింపులకు పాల్పడేవాడు. 1940 దశకంలో రెండు లక్షలకు పైగా ఖర్చుతో భవనం నిర్మించి, కూలీలకు ప్రతిఫలం ఇవ్వలేదు. మోత్కూరు మండలంలోని నడిశాల వెంకటరెడ్డిని కాల్చి చంపించాడు. లక్ష రూపాయలు ఖర్చు చేసి నేరం నుంచి తప్పించుకున్నాడు. అయిలమ్మ కుటుంబం, కులవృత్తిలో నిలదొక్కుకోలేక, మల్లంపల్లి భూస్వామి ఉత్తంరాజు కొండల్ రావు తల్లి జయప్రద దేవి వద్ద 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు ప్రారంభించింది. భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్రమహాసభ స్ఫూర్తితో అయిలమ్మ, నర్సయ్య దంపతులు పాలకుర్తిలో సంఘం సభ్యులయ్యారు. దీంతో కమ్యూనిస్టులకు ఆశ్రయమిస్తోందని దేశముఖ్కు ఫిర్యాదు చేశాడు. సంఘాన్ని రూపుమాపాలనే ఉద్దేశంతో అయిలమ్మ ఇంటిని దోపిడీ చేయించాడు. సజ్జలు, జొన్నలు, ధాన్యం దోచుకున్నారు. అయినా అయిలమ్మ కుటుంబం చలించలేదు. భూస్వామ్య, నిజాం వ్యతిరేక కార్యకలాపాలకు తన ఇంటిని కేంద్రంగా మార్చి, కమ్యూనిస్టులకు ఆతిథ్యమిచ్చింది. 1945 శివరాత్రి సందర్భంగా బహిరంగ సభకు సన్నద్ధం అవుతుండగా, విసునూరు దేశముఖ్ గుండాలు ఆరుట్ల రాంచంద్రారెడ్డిని హత్య చేస్తామని బెదిరించారు. పోలీసు సబ్–ఇన్స్పెక్టర్ ఫక్రుద్దీన్ రక్షణ ఇవ్వలేదు. నాయకులు చర్చిస్తుండగా దేశముఖ్ అనుచరులు హత్యాయత్నం చేశారు. నలభై మంది యువకులు వారిని తరిమికొట్టారు. దీంతో దేశముఖ్ కేసు పెట్టించాడు. ఆరుట్ల రాంచంద్రారెడ్డి, సుబ్బారావు, గంగుల సాయిరెడ్డి, మనోహర్ రావు, అయిలమ్మ కుమారులు లచ్చయ్య, సోమయ్య, భర్త నర్సయ్య తదితరులపై కేసు నమోదై, హైదరాబాద్ జైలుకు పంపారు. మెదక్ సెషన్స్ కోర్టులో విచారణ జరిగి, నిర్దోషులుగా విడుదలయ్యారు. 1945 నవంబర్‌లో అయిలమ్మ భర్త, కుమారులు జైలులో ఉన్నప్పటికీ, దేశముఖ్ ఆమె సాగు భూమిని ధ్వంసం చేయాలని కుట్రపన్నాడు. నల్గొండ నాయకత్వం సవాలుగా తీసుకొని, ప్రజల్లో విశ్వాసం నింపింది. దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీంరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు అయిలమ్మ పొలాన్ని కాపాడారు. దేశముఖ్ నౌకర్లను కొడవళ్ళు, కర్రలతో అడ్డుకున్నారు. ఆంధ్రమహాసభకు జై, దేశముఖ్ దౌర్జన్యాలు నశించాలని నినాదాలిచ్చారు. గుండాలు పారిపోయారు. అయిలమ్మ పంటను సురక్షితంగా ఇంటికి చేర్చారు. ఈ సంఘటన దేశముఖ్‌ను కేసు పెట్టించినా, నాయకులు చిత్రహింసలను ఎదుర్కొని మనోధైర్యం కోల్పోలేదు. పాలకుర్తి భూస్వామి ఇంటిని ప్రజలు కూల్చి, మొక్కజొన్న విత్తారు. ఈ పోరాటం 10 లక్షల ఎకరాల భూపంపిణీకి దారితీసింది. మూడు వేల గ్రామాల్లో స్వరాజ్యాలు ఏర్పడ్డాయి. నాలుగు వేల మంది అమరులయ్యారు. అయిలమ్మ కూతురు సోమ నర్సమ్మపై అత్యాచారం, హత్యలు, గృహదహనాలు జరిగాయి. అయినా ఆమె చలించలేదు. పాలకుర్తి ప్రజలు ఆమెను బాల నాగమ్మగా కీర్తించారు. 1985 సెప్టెంబర్ 10న అనారోగ్యంతో అయిలమ్మ మరణించింది. ఆమె ఆశయాలు నెరవేరలేదు. మతతత్వ శక్తులు చరిత్రను వక్రీకరిస్తున్నాయి. ప్రజలను మేల్కొల్పి, అయిలమ్మ ఆశయాలను సాధించడమే ఆమెకు నిజమైన నివాళి.

**- మామిండ్ల రమేష్ రాజా**
రచయిత: సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, విప్లవ మూర్తి అయిలమ్మ పుస్తక రచయిత.
7893230218

తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం, నిలువెత్తు నిదర్శనం.. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబం మన బతుకమ్మ పండుగ వాతావరణం.. బతుకమ్మ కవిత రచనలు..

## 'బతుకమ్మ'ను బతికించు!?

తెలంగాణలో పురుడోసుకున్న బతుకమ్మ
పల్లె జనుల ఆట పాట సొగసులు ప్రబలం
ఆనందానికి ఉత్సాహానికి ఆధారం బతుకమ్మ
అలాయి బలాయి అందమే నా తల్లి
గున్న పువ్వుల్లోన గోరంట పువ్వుల్ల
బతుకునిచ్చే బతుకమ్మ పాటల్ల
తీరైన పువ్వుల్ల కొలువైన తల్లి బతుకమ్మ
ఆనాటి సంబురాలు మాయమయ్యేనా!
అక్కాచెల్లెల్ల ముందస్తు ముచ్చట్ల
సంబురాలు కానరావే?
పల్లెల్లో కనిపించే గున్క పువ్వు జాడెక్కడ?
పువ్వులతో అలంకరించిన అందమైన బతుకమ్మ!
అంతా ప్లాస్టిక్ పూల మాయేనా
అక్కాచెల్లెళ్ల గాజుల సవ్వడుల మోతలేమాయే?
ఇటవెలసిన మన సంస్కృతి
ఉన్నతమా, మహెూన్నతమా?
మారిన సంస్కృతిలో డీజేల బడాయే ఎక్కువాయే
బుడుబుంగలా మాయమమైన తీరులా?
నా తెలంగాణ ఇప్పుడు నెర్రెలిడిసినా నేలల
ఆనాటి పెద్దల పాటలు ఏమాయే?
రంగు రంగుల లైటింగ్స్ డీజేలా బడాయేనా
భాషను వికృతం చేస్తున్న కొలవెర్రిని వదిలి
కోకిలల కంఠరవాన దాగిన
మత్తెన తెలుగు పాటను వినమంటున్నాయి
సంస్కృతి రక్షణే మన కర్తవ్యం
మరవకు మన ఆచారాలు..!

రైటర్ రాజు
(యువ కవి – అరుణ రైటింగ్స్)
తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.




# నదులే జీవనాడులు–భవిష్యత్ తరాలకు భాగ్యరేఖలు

శిశువు ప్రస్థానం తల్లి గర్భంలో నీటిలో (అమ్నియోటిక్ ఫ్లూయిడ్)నే ప్రారంభమ వుతుంది. పంచభూతాలకు నిలయమైన మనిషి దేహమంతా నీటితో నిండిందే. జీవ క్రియలకు, మానవ మనుగడకు నీరే ఆధారం. ఈ భూమి పై తొలి ఏకకణ జీవి ఆవిర్భావం నీటిలో జరిగిందే. ఆదిమ మానవుని నుంచి నాగరికునిగా మనిషి పరిణామం, ఆ తర్వాత క్రమం అంతా నీటితో ముడిపడి వున్నదే. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాగరికతలకు నదులే(నీరు) కేంద్రంగా వున్నాయి. నదుల ఒడ్డున వెలిసిన ఎన్నో నాగరికతలు నదుల ప్రాధాన్యతను చెప్పకనే చెబుతాయి. ప్రసిద్ధి పొందిన మెసపటోమియా (ఇరాక్) నాగరికత టైగ్రిస్, యూఫ్రటీస్ నదుల మధ్యన, ప్రపంచంలోనే అతి పొడవైన నైలు నది ఒడ్డున ఈజిప్టు నాగరికత, సింధూనది ఒడ్డున సింధులోయ నాగరికత, ఎల్లో నది ఒడ్డున చైనా నాగరికత వర్ధిల్లినట్లు మనం చదువుకున్నాం.

రెండు హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్సిజన్ పరమాణువుతో కూడిన అణువే నీరు. ఈ భూగోళం పై 71 శాతం నీరే విస్తరించి వున్నది. ఘన(హిమం), ద్రవ(నీరు), వాయు(ఆవిరి) రూపాల్లో ఇది ఎన్నో జీవుల మనుగడకు ప్రధాన వనరు. జీవజాలానికి కారణభూతమైన నీటి వనరులు కలిగిన ఏకైక గ్రహం భూగ్రహమే కావడం భూగ్రహ ప్రత్యేకతను చాటుతున్నది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 28 (నాలుగవ ఆదివారం) ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ఈ రోజు నదులతో, మానవాళి సంబంధాన్ని నెమరువేసుకునే ప్రత్యేక సందర్భం. మన సమాజంలో జలప్రవాహాలు (%ఔఖ్వతీఝుఎం అఅ శీబతీ షశీఎబఅఖ్వ%) అనే నేపథ్యంతో ఈ యేడాది 'ప్రపంచ నదుల దినోత్సవాన్ని' ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు జరుపుకుంటున్నాయి.

భారతదేశంలో నదులకున్న స్థానం ప్రత్యేకమైనది. ప్రపంచం భారతదేశాన్ని నదుల దేశంగా గుర్తిస్తుంది. మన దేశంలో పేర్లతో గుర్తించదగిన దాదాపు 400–500 వరకు నదులు ప్రవహిస్తుండగా, చిన్న చిన్న నదులు లెక్కకు మించి వున్నాయి. వీటిలో కొన్ని ఆయా రాష్ట్రాల మధ్యగా ప్రవహిస్తే, మరికొన్ని ఆయా రాష్ట్రాల మధ్య సహజ సరిహద్దులుగా ప్రవహిస్తున్నాయి. భారతదేశ నైసర్గిక స్వరూపాన్ని విహంగవీక్షణం చేస్తే భారతదేశమనే దేహంలో రక్తనాళాలుగా నదులు ప్రవహిస్తూ వుండడాన్ని మనం గమనించవచ్చు. నదులు జీవనాడులుగా ప్రవహిస్తూ, మానవావసరాలను తీరుస్తూ, వారి గమనానికి తోడ్పడుతున్నాయి. ఈ నదులు కేవలం నీటి అవసరాలు తీర్చే వనరులుగానే కాకుండా, ఈ దేశ ఆధ్యాత్మికతతో ముడిపడినవి. గంగమ్మ, కృష్ణమ్మ, గోదారమ్మ అంటూ నదుల్లో నీటిని పరమ పవిత్రంగా తమ దోసిళ్ళలోకి తీసుకుని కళ్ళకద్దుకునే సంస్కృతి మనది. గంగానది నీటిని మహిమాన్వితంగా ప్రజలు భావిస్తారు. నీటినే 'గంగా' అనేంతగా గంగానది ప్రజల నమ్మకాల్లో ఇమిడిపోయింది. అస్థికలు గంగానదిలో కలిపితే మరణించిన వారి ఆత్మ శాంతిస్తుందని ప్రగాఢ నమ్ముతారు. గంగా, గోదావరి, కృష్ణ, నర్మద మొదలైన ముఖ్య నదుల్లో పవిత్ర స్నానాలు, పితృ కార్యాలు సర్వ సాధారణం. ప్రజల నమ్మకాలు, ఆచారాలెన్నో నదులతో ముడిపడి వున్నాయి.



ఈ ప్రత్యేక దినోత్సవం రోజున నదులు మానవాళి పై చూపించే పర్యావరణ, సాంస్కృతిక, ఆర్థిక ప్రభావాన్ని, కాలుష్యం, నీటి దుర్వినియోగం, వాతావరణ మార్పుల వల్ల నదులు ఎదుర్కొంటున్న ముప్పును గురించి చర్చించడం ఒక ముఖ్య కార్యక్రమంగా కొనసాగుతూ వస్తున్నది. మానవ సమాజాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వాలు నదుల సంరక్షణకు పర్యావరణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అత్యయిక స్థితిని ప్రపంచ నదుల దినోత్సవం నొక్కి చెపుతుంది. పరిశ్రమల వ్యర్థాలు, రసాయనాలు, ప్లాస్టిక్, మురుగునీరు మొదలైన కాలుష్య కారకాలను శుద్ధీకరణ చేయకుండా నేరుగా నదుల్లోకి వదులుతుండటంతో, నీరు విషంగా మారి జీవవైవిధ్యం నానాటికీ కుంటుపడుతున్నది. సాగునీటికి, పరిశ్రమలకు అవసరానికి మించి నీటి వనరులను వాడుకుంటుడటం వలన తాగునీటికి చాలా ప్రాంతాల్లో కొరత ఏర్పడుతున్నది. పరిమితికి మించి ఇసుక తవ్వకాలు, అడవుల నరికివేత వంటి చర్యలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నదుల సహజ స్థితిగతులను దెబ్బతీస్తున్నాయి. భూమి పై 2.5 శాతం మాత్రమే వున్న మంచినీటి లభ్యతను ఇలాంటి చర్యలు మరింతగా దిగజారుస్తున్నాయి. మనిషి తన స్వలాభం కోసం చేస్తున్న పనులతో నదులు తీవ్రంగా కలుషితమవుతూ త్రాగేనీరు విషతుల్యమవుతుండటంతో జలచరాలకు తీవ్ర హాని జరుగుతున్నది. నదుల సంరక్షణ, శుద్ధికి ప్రభుత్వాలు, పలు ఎన్జీవోలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయి. గుజరాత్ లో 'సబర్మతీ రివర్ ఫ్రంట్', కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన 'నమామి గంగే' ఈ తరహా కార్యక్రమాలే. సీఎం రేవంత్ రెడ్డి గారి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుతో కాలుష్య కాసారమైన మూసీ నదిని పునరుజ్జీవింపచేసేందుకు కార్యాచరణను ప్రారంభించింది. చెరువులు, కుంటలు మొదలైన నీటి వనరుల పునరుద్ధరణే లక్ష్యంగా హైడ్రాను తీసుకొచ్చింది. రాబోయే తరాల నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి వనరుల పునరుజ్జీవన కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించే కార్యాచరణను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలకు తోడు ప్రతి వ్యక్తి నదుల పరిరక్షణ పై అవగాహన కలిగి వుండి, వాటి పరిరక్షణకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అత్యయిక పరిస్థితి ప్రస్తుతం నెలకొంది.

నిత్యజీవితంలో నది మనకు ఎన్నో విషయాల్లో స్ఫూర్తినిస్తుంది. సముద్రునిలో సంగమించేందుకు కొండలు, కోనలు ఎక్కుతూ, లోయల నుండి జాలువారుతూ, రాళ్ళు రప్పల్లో నిత్యోత్తేజంతో ప్రవహిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది. లోటుపాట్లు, ఆటంకాలు ఎన్ని ఎదురైనా జీవితాన్ని నిత్య ప్రవాహంగా కొనసాగించాలనే ప్రేరణను కలిగిస్తుంది. సాగరమే అంతిమ లక్ష్యంగా సాగే జీవనదిలా, ప్రకృతి ప్రసాదించిన ఈ జీవితాన్ని తుది వరకు స్థితప్రజ్ఞతో ఆచరించడమే మనిషి లక్ష్యం కావాలనే జీవన తత్వాన్ని నది మనకు నేర్పుతుంది.

(ప్రపంచ నదుల దినోత్సవం సెప్టెంబర్ 28 సందర్భంగా)

**బిల్లా అజయ్ కుమార్,**
సీనియర్ జర్నలిస్ట్,
7835079439.

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం చేసే తగిన గుణపాఠం చెప్పాలని విద్యార్థుల సమస్యలను పరిష్కారానికి నిరంతరం పిడిఎస్ యు పోరాడుతుందని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎస్వీ శ్రీకాంత్ పొడ పంగి నాగరాజులు అన్నారు, గురువారం సంగారెడ్డి పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీ.డీ.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి. శ్రీకాంత్ పొడపంగి నాగరాజు హాజరై, సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోస్తే విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం అని అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు 20 నెలల కాలం పూర్తయితున్నప్పటికీ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో పూర్తిగా విఫ్లమైందన్నారు.ప్రభుత్వ విద్యారంగాన్ని ధ్వంసం చేస్తూ కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇచ్చే కాసులకు అలవాటు పడిన ప్రభుత్వం మరియు విద్యాధికారులు పర్యవేక్షణ జరపకుండా గాలికి వదిలేశారు ఈ విద్యాసంస్థల్లో లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చి పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పి ఇంతవరకు




ఆచరణలో అమలు జరగలేదు వలన విద్య పేద,బడుగు, బలహీన వర్గాలకు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారింది. రాజకీయ నాయకుల అండతో నడుస్తున్న అనుమతి లేకుండా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాంతం నిధులు కేటాయిస్తామని ప్రకటించి ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది.విద్యారంగంలో నెలకొన్న సమస్యలను చెప్పుకోవడానికి కనీసం ప్రత్యేక విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకుండా తన యొక్క నియంత పాలనను కొనసాగిస్తున్నారు.విద్యార్థులకు రావలసిన ఉపకార వేతనాలు సుమారు 8000 కోట్ల రూపాయలు విడుదల చేయకుండా పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. పెండింగ్ లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు, ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేయాలి,సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి హాస్టల్ కు సొంత భవనాన్ని నిర్మించాలి,ఖాళీగా ఉన్న డీఈవో,ఎంఈఓ,టీచర్ పోస్టులను భర్తీ చేయాలని,గురుకుల లో ఫుడ్ పాయిజన్ జరిగి మరణించిన విద్యార్థుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు పై సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తాంఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ జాతీయ నాయకులు పి.మహేష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోవనగిరి మధు, జన్నారపు రాజేశ్వర్, డి.శ్రీకాంత్, మంద నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు గౌతమ్ కుమార్, గోకినపల్లి మస్తాన్, గుర్రం అజయ్, డి.ప్రణయ్ కే.శ్రీనివాస్ కోశాధికారి రాణా ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్, మాదారపు నాగరాజు, ప్రిన్స్, తీగల శ్యామ్, దీపాలక్ష్మి, ఎస్.కె అసిఫ్, గడ్డం గౌతం, హలీం పాషా, వెంకటేష్, రాజేష్, మర్రి మహేష్, శ్రీను, కార్తిక్, మునగాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధుల నిర్మూలన

- శంషాబాద్ కమీషనర్ బి. సుమన్ రావు




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత తోనే అంటువ్యాధులను నిర్మూలించవచ్చని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి. సుమన్ రావు పేర్కొన్నారు.గురువారం శంషాబాద్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అనీల్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ 2025 లో, ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్ సాథ్ ప్రోగ్రాం లో భాగంగా శంషాబాద్ ఆర్టీసి బస్టాండ్ ఏరియా లో ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి సామూహిక క్లీనింగ్ డ్రైవ్ చేపట్టారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ఎండీ. షరీఫ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, బి.రాములు జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్లు, నగర దీపికలు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బతుకమ్మ వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా



**చేర్యాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే క్వార్టర్స్ లో జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా గురువారం బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ ఆద్వర్యంలో బతుకమ్మ వాల్ పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ-దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు శ్రీశైలం, తాండ్ర ఆంజనేయులు, ఎర్రోళ్ల యాదగిరి, తాండ్ర సాగర్, బంగారి గల్ల కిరణ్ కుమార్, గోనేపల్లిమహేష్, కొలిపాక శ్రీనివాస్,రవి,నరేష్, హరి,శీను, వినోద్,మహిపాల్ పాల్గొన్నారు.

## వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

- పాఠశాలల అభివృద్ధి పనులు పక్కా ప్రణాళిక ద్వారా పటిష్ట చర్యలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాలు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం టేక్మాల్ మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోడల్ స్కూల్ కేజీబీవీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి.హెచ్.సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీ.హెచ్.సీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు, ఇతర స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉన్నారా అని పరిశీలించారు. ఈ శిబిరంలో పిల్లల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సేవలు అందించడం జరుగుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ శిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ల గురించి ముందుగానే అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. మొబిలైజేషన్ ద్వారా లబ్ధిదారులను గుర్తించి, ప్రత్యేక వైద్యులు పాల్గొనే ఈ శిబిరాలకు తరలించాలని అన్నారు. లబ్ధిదారులకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవల గురించి వివరించి వారి అవసరానికి అనుగుణంగా మొబిలైజ్ చేయాలన్నారు. మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అవసరం ఉన్న వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్ కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని పరిశీలించి పాఠశాల అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికల తయారుచేసిన సందర్భంలో మౌలిక వసతులపై ఆరా తీశారు. మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించే దిశగా ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తులసిరామ్, ఆర్ఎస్ శ్రీకాంత్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి



**యాచారం, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మండల పరిధిలోని గడ్డ మల్లయ్య గూడ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఓ శ్రీలత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతలో మొక్కల పెంపకం ప్రధానమని, ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని, పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాధాన్యత కీలకమన్నారు. రోజువారి జీవితంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. పేరుకు పోయిన వ్యర్థ పదార్థాల వల్ల రోగాల పై ప్రజలకు అవగాహన కలిపించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో భాగంగ హార్టికల్చర్ ప్లాంటేషన్, మానవహారం, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించి, సెల్ఫీ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాధా రాణి, యం జీ ఎన్ ఆర్ ఈ జీ ఎస్ అధికారులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట జిల్లా న్యాయసేవ లీగల్ సర్వీ సెస్ కార్య దర్శి,సీనియర్ సివిల్ జడ్జి విండ్యా నాయక్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ ఆదేశాలమేరకు లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ వరల్డ్ బీఫ్ డే విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వింధ్య నాయక్ మాట్లాడుతూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలనిఅన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించడం ద్వారా, చెవిటి వారికి వారి జీవనశైలిని మార్చడానికి, మెరుగుపరచడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు.చెవిటి, మూగవాళ్లకు సంబందించిన డాక్టర్స్ ను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ బధిరుల హక్కులను, సంకేత భాష ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. వ్యాధుల పట్ల అవగాహనా, సామాన్య ప్రజలు ఏవిదంగా న్యాయం పొందాలి పలు చట్టాల గురించి తెలిపారు. కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ సంపత్ కుమార్ డాక్టర్లు ఆదిత్య అమృత్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ లక్ష్మిపతి గౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ నాగేశ్వరి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

- కలెక్టర్ పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈవీఎం లు భద్రపరిచిన గోదాము కట్టు దిట్టమైన భద్రత మధ్య ఉందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా యక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ ముందు గల ఈవీఎం గోదాములోని ఈవీఎంలను త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని కల సంఘం మార్గ నిర్దేశాల ప్రకారం ఎప్పటికప్పుడు ఈ వీ ఎం, వీవీ ప్యాట్ ల గోదాము ను తనిఖీ చేసి సమగ్ర నివేది కను పంపిస్తున్నట్లు ఆమె వెల్ల డించారు. అందులో భాగంగా నే గురువారం ఈవిఎం గోదా మును త్రైమాసిక తనిఖీ చేయడం జరిగిందన్నారు. గోదాములో ఏర్పాటు చేసిన కార్బన్ డై ఆక్సైడ్ ఎక్స్ టింగ్ షర్స్ కాల పరిమితి ముగిసి నట్లు గుర్తించిన కలెక్టర్ వాటి స్థానంలో కొత్త వాటిని అప్పటి కప్పుడే తెప్పించి



గోదాములో పెట్టించారు. గోదాము ప్రహరీ గోడ కింది భాగం రంధ్రాలు పడటం గమనించిన కలెక్టర్ వెంటనే ఆర్ అండ్ బీ డీఈ ని పిలిపించి మరమ్మతు చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు అఖిల ప్రసన్న, రాణి దేవి, బీ ఆర్ ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం, బిజెవైఎం నగర అధ్యక్షుడు జాజాపూర్ మణి శంకర్, టీడీపీ నాయకుడు రాఘవ చౌదరి, బిఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి బస్తీ బాట..



**కాప్రా, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** టీజీఎస్పీడీసీఎల్ ఆదేశానుసారం బస్తి బాట ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. బస్తి బాట కార్యక్రమంలో భాగంగా సబ్ స్టేషన్ పరిధిలోని జై జవాన్ కాలనీలో సిబ్బందితో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సింగిల్ ఫేస్ లైన్ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి త్రీఫేస్ లైన్లు వెంటనే ఏర్పాటు చేస్తున్నామన్నారు. సబ్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్యలు ఉన్న పరిష్కరించే క్రమంలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్తు సౌకర్యాలను అందించడానికి ఉన్నతాధికారుల ఆదేశానుసారం తాము అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి, పత్రి శ్రీనాథ్, శ్రీహరి, ఉపేందర్ రెడ్డి, ఎస్ఎం సాహెబ్, సలీం, రంగస్వామి, దుబాయ్ రావు సత్యనారాయణ సిబ్బంది పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతును అరెస్టులతో నొక్కలేరు



**వీపనగండ్ల, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రం నుండి చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీ ఉపాధ్యాయులను, ఆయాలను స్థానిక ఎస్సై కే.రాణి, పోలీసు బృందం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా సిఐటియు మండల కో కన్వీనర్ జక్కుల ఆశన్న మాట్లాడుతూ అంగన్వాడి ఉపాధ్యాయులు ఆయాలు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకొని అరెస్టు చేయడం తగదని అన్నారు.అరెస్టులతో ప్రశ్నించే గొంతును నొక్కలేరని ఉద్యమాన్ని సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు ఉధృతం చేస్తామని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు.


## రైతు సంఘం ఆధ్వర్యంలో యాచారంలో ధర్నా



**యాచారం, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** యూరియా కొరతతో ఒక వైపు వేసిన పంటలు ఎండున్నాయి, మరోవైపు యూరియా కోసం రైతులు పస్తులు ఉండి వేచి చూడాల్సిన దయనీయమైన దుస్థితి నెలకొందని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ప్రభుత్వం పై మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసిల్దార్ కార్యాలయం రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించి, తహసీల్దార్ అయ్యప్పకు, ఎంపీడీఓ రాధారాణి కి మెమో రండం ఇచ్చారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ... గత నెల రోజులుగా యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుంటే ప్రభుత్వం, సంబంధిత అధికారులు యూరియా కొరత పై స్పందించకపోవడం బాధాకరమన్నారు. అందరి కడుపు నింపే రైతు పస్తులుండి మరీ యూరియా కోసం వేచి చూడాల్సిన దయనీయ పరిస్థితి నేడు నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండి పాడైపోయాక యూరియా ఇస్తే లాభమేంటని, ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి యూరియా కొరత తీర్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్ల నారాయణ రెడ్డి,నాయకులు జగన్మోహన్ రెడ్డి, కే శ్రీకాంత్,వి విజయ, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు యం డీ అలిముద్దీన్,జిల్లా కార్యవర్గ సభ్యులు పోచమని నీలమ్మ, ఆర్ అండాలు,కే యాదగిరి,ఎల్ అనంతరెడ్డి, పి యాదయ్య,ఇబ్రహీంపట్నం సిపిఐ మండల కార్యదర్శి కావాలి సురేష్, ఎన్ పద్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనకు దేశవ్యాప్తంగా 'పింకాథాన్' కార్యక్రమం

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** దేశ వ్యాప్తంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేం దుకు 'జైడస్-పింకాథాన్' భాగస్వామ్యంతో డిసెం బర్ 21న ముంబై పింకాథాన్ దేశ వ్యాప్తంగా జరగ నుందని జైడస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శర్విల్ పటేల్, పింకాథాన్ ఫౌండర్ మిలింద్ సోమన్ గురు వారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ బీకేసీ, ఎంఎం ఆర్‌డిఏ గ్రౌండ్స్‌లో జరగబోయే ఈ రన్‌లో వేలాది మహిళలు పాల్గొననున్నట్లు చెప్పారు. మహిళల ఆరోగ్య చైతన్యం కోసం ఈ కార్యక్రమాన్ని జైడస్ లైఫ్‌సైన్సెస్, మహిళల అతిపెద్ద రన్‌గా పేరుగాం చిన పింకాథాన్‌తో కలసి చేపడుతోందన్నారు. 2025-26లో ముంబైతో పాటు బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై నగరాల్లో ఈ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 30 వేల మందికి పైగా మహిళలు పాల్గొనే అవకాశం ఉంద న్నారు. ముంబై



ఎడిషన్‌లో 3కిమీ, 5కిమీ, 10కిమీ తో పాటు 50కిమీ, 75కిమీ, 100కిమీ అల్ట్రా రన్స్, రీలే రన్‌లను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల మూడు నిమిషాల సెల్ఫ్ బ్రెస్ట్ ఎగ్జామ్ మహిళల ప్రాణాలను కాపాడగలదని, పింకాథా న్‌తో కలసి ఎక్కువమందిని చైతన్య పరచడమే తమ లక్ష్యం అన్నారు. మహిళలు తమ ఆరోగ్యా న్ని ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. ఈ భాగస్వా మ్యంతో మరింత పెద్ద స్థాయిలో అవగాహన కలి గించ గలుగుతున్నాం అన్నారు. భారత దేశంలో ప్రతి సంవత్సరం రెండు లక్షలకుపైగా మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మహిళ మరణి స్తోందని గణాంకాలు చెబుతున్నాయని అన్నారు. ఆరంభ దశలో గుర్తిస్తే చికిత్స సాధ్యమని నిపుణు లు స్పష్టం చేస్తున్నారని తెలిపారు. అక్టోబర్ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసంలో భాగంగా 'ఈజి యెస్ట్ ఎగ్జామ్' రెండో ఎడిషన్‌ను ప్రారంభించను న్నట్లు తెలిపారు. 'రెండు చేతులు, మూడు నిమి షాలు, ఒక సులభ పరీక్ష' అనే సందేశంతో ఈ ప్రచారం కొనసాగుతుందని తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 26 సెప్టెంబర్ 2025

# భూభారతి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**• ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష**




**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంట, వెంట ఆర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని ఆర్డిఓలు, తహశీల్దార్లతో కలెక్టరేట్ సమావేశమందిరంలో భూభారతి అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడాతూ... రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు నిర్ణీత ప్రొఫార్మాలో అవసరమైన పూర్తి వివరాలు జత చేసి తాసిల్దార్ కార్యాలయం నుండి ఆర్డిఓ కార్యాలయానికి ఆర్డిఓ కార్యాలయం నుండి కలెక్టరేట్‌కు పంపించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి సంబంధిత స్థలాలను పరిశీలించి విచారణ జరపాలని అధికారులకు సూచించారు. వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ, జీఐఎస్ ఆధారిత సర్వే డిజిటైజేషన్ వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి, భూ రికార్డులను పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాదా బైనామాలు కు సంబంధించి పూర్తి వివరాలతో వచ్చిన దరఖాస్తు అన్నిటికి సంబంధించిన ఫైళ్లను అన్ని సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ వచ్చిన ఫైళ్లను కలెక్టరేట్‌కు సంబంధించి సెక్షన్ అధికారులు క్షుణ్ణంగా సెక్షన్ అధికారులు వచ్చిన ఫైల్ కు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన ఫైల్ నోట్లు రాసి సిద్ధం చేయాలన్నారు. ఒకవేళ ఫైల్ రిజెక్షన్ అయితే ఎందుకు రిజెక్షన్ చేశాము, అన్న వివరాలు సైతం నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాసిల్దార్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయాల నుండి వచ్చిన ఫైళ్లను జిల్లా స్థాయిలో రూపొందించిన నిర్ణీత ప్రొఫార్మ ప్రకారం సంబంధిత ఫైల్స్ రానున్న 15 రోజుల్లో భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, అందోల్ ఆర్డీఓ పాండు, సంగారెడ్డి, జి.రాజేందర్, జిల్లా లోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

## జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.12.5 కోట్లు

**• నిధులతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం**
**• ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.12.5 కోట్లు మంజూరు చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్.టీ నెంబర్ 541 ను జారీ చేసినట్లు తెలిపారు. పట్టణంలో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధి పనుల కోసం పంపిన ప్రతిపాదనల్లో భాగంగా ప్రస్తుతం రూ.12.5 కోట్లు మంజూరు అయ్యాయని గురువారం మీడియాకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఇది కాకుండా పట్టణ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడానికి మరో రూ.12.5 కోట్ల ప్రతిపాదనలు కూడా పంపడం జరిగిందని ఈ నిధులు కూడా మంజూరు చేయించడానికి కృషి చేస్తున్నామని, మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కోసం రూ.70 కోట్లు మంజూరు చేయాలని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరడం జరిగిందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని వివరించారు. ఈ నిధులన్నీ మంజూరైతే జడ్చర్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం మంజూరైన రూ.12.5 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో జడ్చర్ల పాత బజార్ ప్రాంతానికి అధిక ప్రాధాన్యతనిస్తామని, ఈ ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పుడు ఆయా ప్రాంతాలను కూడా అభివృద్ధి చేసే భారం తమపైనే పడిందని వాపోయారు. ముందుగా పట్టణంలోని పాత బజారుతో సహా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి కొత్త లేఅవుట్లలో అభివృద్ధి చెందిన నివాసిత ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

## ఫుట్‌బాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకువస్తా..

**• మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ఫుట్ బాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకువస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్ షిప్ 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ పురుషుల ఫుట్ బాల్ టౌర్నమెంట్ ను ప్రారంభించారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని ఫుట్ బాల్ టౌర్నమెంట్ ను ప్రారంభించారు. క్రీడలు దైనందిన జీవితంలో మనకు భాగం కావాలని, క్రీడాకారులు అందరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని.. వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందిస్తామని హామి ఇచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 16 కోట్ల రూపాయలను ఇప్పటికే మంజూరు చేసిందన్నారు. గతంలో ఎంతో మంది ఫుట్ బాల్ క్రీడాకారులు మన దేశం తరుపున ఆడి రాణించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్. పి. వెంకటేష్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫల్గున, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల డ్రాప్ అవుట్లపై దృష్టి సారించాలి

**• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థుల డ్రాప్ అవుట్లపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో అపార్ ఐడి క్రియేషన్, విద్యార్థుల డ్రాప్ అవుట్లు సహా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థుల డ్రాప్ అవుట్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల డ్రాప్ అవుట్ల కారణంగా ముఖ్యంగా అమ్మాయిల్లో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉందని కాబట్టి దీనిపై ప్రధానంగా దృష్టి సాదించాలన్నారు. విద్యార్థుల డ్రాప్ అవుట్లను తగ్గించడానికి ప్రతి పాఠశాల, కళాశాల స్థాయిలో క్రమం తప్పని పర్యవేక్షణ ఉండాలని, ఏ విద్యార్థి చదువు మానేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే విద్యార్థుల హాజరు, విద్య నాణ్యత పెంపుదలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు. జిల్లా లో పాఠశాల, కళాశాలల వారీగా డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల్లో ఎవరెవరు ఎక్కడ చేరారు, ఇంకా ఎటు చేరకుండా ఉన్న విద్యార్థులెవరు అనే విషయంపై ఫోకస్ చేయాలన్నారు. తద్వారా అమ్మాయిల బాల్య వివాహాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల డ్రాప్ అవుట్లను తగ్గించి, అడ్మిషన్లు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక అన్ని పాఠశాలల్లో, కళాశాలలో అపార్ ఐడి జనరేషన్ వేగవంతం చేయాలన్నారు. అపార్ జనరేషన్ ప్రక్రియలో విద్యార్థుల ఆధార్ కార్డులో, పదో తరగతి సర్టిఫికెట్లో వివరాల మిస్ మ్యాచ్ కారణంగా పూర్తి చేయలేకపోతున్నామని పలువురు కలెక్టర్ కు నివేదించగా, ఒకరోజు విద్యార్థుల కోసం ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా, యుడైస్ లో విద్యార్థుల వివరాలను అప్డేట్ చేయాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల అటెండెన్స్ శాతం మెరుగుపడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య, ఎంఈఓ లు, ప్రిన్సిపల్స్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు యూనివర్సిటీలో ఎన్‌సిసి ప్రారంభించాలి



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ లో ఎన్ సిసి ప్రారంభించాలని పాలమూరు యూనివర్సిటీ వీసీ రిజిస్టర్ గార్లకు వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ లో ఉన్న యుజి కోర్సులో ఎక్కువ విద్యార్థులు చదువుతున్నారు యునివర్సిటీ ప్రారంభం అయినప్పటి నుంచి నేటి వరకు ఎన్ సిసి లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు దీని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భవిష్యత్తు నిమిత్తం పాలమూరు యూనివర్సిటీ లో ఎన్ సిసిని ప్రారంభించాలని కోరారు. దీని ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, శారీరక దేహ దారుఢ్యం,మానసిక పరిపక్వత, నైతిక విలువలు, సేవాగుణం, అలవారడంతో పాటు దేశం పట్ల అంకిత భావం జాతీయత పెంపొందుతాయి. ఎన్ సిసి క్యాంప్స్ లలో రాష్ట్ర దేశ స్థాయిలో పాల్గొనడం ద్వారా విద్యార్థులతో పాటు పాలమూరు యూనివర్సిటీకి మంచి పేరు మర్యాద,గౌరవం చేకురుతాయి. దాంతో పాటుగా విద్యార్థులకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ సాధన లో ప్రభుత్వ ఉద్యోగం పొందడంలో ప్రత్యేకమైన అర్హత ఉంటుంది కావున వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని పాలమూరు యూనివర్సిటీలో ఎన్‌సిసిని ప్రారంభించాలని పాలమూరు యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి జి ఎన్ శ్రీనివాస్ రిజిస్టర్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర అల్ యూనివర్సిటీ కో కన్వీనర్ కృష్ణ కుమార్ పాలమూరు యూనివర్సిటీ శాఖ కార్యదర్శి రవితేజ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంగీత, నందిని, హరిక్రిష్ణ,గోపి, అర్జున్, సురేందర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో ప్రజల ఆరోగ్యం కోసం అందుబాటులోకి తెస్తున్న ఇండోర్ స్టేడియాన్ని ప్రజలు సద్వినియోగించుకునేలా అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వనపర్తి పట్టణంలో జిల్లా కలెక్టర్ నిధులతో ఇండోర్ స్టేడియంలో చేస్తున్న పునరుద్ధరణ పనులను గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో నూతన బ్యాడ్మింటన్ కోర్ట్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, జిమ్ గదుల్లో కల్పించిన సదుపాయాలను పరిశీలించి, ప్రజల వినియోగానికి అవసరమైన ఏర్పాట్లపై జిల్లా క్రీడల యువజన అధికారి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ కు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్థవంతంగా స్టేడియాన్ని ఉపయోగించుకునేలా అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. ఇండోర్ స్టేడియంలో అందరినీ ఆకట్టుకునే విధంగా భారత క్రీడాకారుల చిత్రాలు ఆటలకు సంబంధించిన చిత్రాలను పెయింటింగ్ వేయించాలన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి, ముఖ్యంగా బ్యాడ్మింటన్‌తో పాటు ఇతర ఇండోర్ గేమ్స్‌కి ప్రోత్సాహం అందించడానికి ఈ స్టేడియం కేంద్ర బిందువుగా మారాలని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారుల సౌకర్యార్థం సరైన మెయింటెనెన్స్, సీటింగ్, లైటింగ్‌తో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు ఇంజినీరింగ్, క్రీడా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వీలైనంత త్వరగా అన్ని అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు బదులిచ్చారు. డివైఎస్వో సుధీర్ రెడ్డి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## నాణ్యమైన ఇంధనాన్ని అందించడమే పోలీసు పెట్రోల్ బంక్ ధ్యేయం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** నాణ్యమైన ఇంధనాన్ని అందించడమే పోలీసు పెట్రోల్ బంక్ ద్యేయమని,పోలీసు పెట్రోల్ బంక్ వాల్ పోస్టర్ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆవిష్కరించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పోలీసు పెట్రోల్ బంక్ ప్రచార గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో నాణ్యత, పరిమాణం ఎక్కడ కూడా తగ్గకుండా ఇందనాన్ని పోలీసు పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డిజిలు 24 గంటలు అందుబాటులో ఉంటుంది కాబట్టి వాహనాలలో నాణ్యమైన, కల్తీ లేని పెట్రోలును లేదా డీజిల్ ను వాడితేనే ఇంజన్ చాలాకాలం నడుస్తుంది. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసి డిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, సిసిఎస్ సీఐ, రవిపాల్, ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు,శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం

**• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** విద్యలో మహబూబ్ నగర్ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేసి సఫలికృతమయ్యామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత 20 నెలలుగా తాము చేసిన కృషి వల్ల జిల్లాకు అనేక విద్యా సంస్థలు మంజూరు అయ్యాయన్నారు. ఇప్పుడు పేద ప్రజలకు వైద్యం అందించేందుకు ప్రణాళికలను రూపొందించి చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్నో ఏళ్ల నుంచి అందుబాటులో లేని ఎంఆర్ఐ క్యాథ్ ల్యాబ్ ఇన్స్టుమెంట్స్ కోసం ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించినట్టు తెలిపారు. అందుకు గాను వాటి ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 18 కోట్ల 76 లక్షల మంజూరు చేస్తూ జిఓను జారి చేసిందన్నారు. విద్య ప్రాధాన్యతపై ప్రజల్లో కూడా అవగాహన కల్పించామని.. ఇక వైద్యం దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే పేద ప్రజలకు నిజాయితీ, చిత్తశుద్ధితో నాణ్యమైన వైద్యం అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

**మహబూబ్ నగర్ పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు..**

రెండు రోజుల క్రితం గౌరవ మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణతో కలిసి డిల్లీలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నని కలిసి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరామన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మూడు లక్షల జనాభా దాటిందని, నగరంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడం వల్ల నగరంలో ట్రాఫిక్ రద్దీగా ఉందని దానివలన అన్ని రంగాల్లో ఉండే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకుపోగా మహబూబ్ నగర్ నగరం లోని టిడి గుట్ట, తిమ్మసాన్ పల్లి, బోయపల్లి గేట్ రైల్వే గేటు వద్ద రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలను 100% కేంద్ర ప్రభుత్వ నిధులతో త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. రాజకీయ నాయకులు అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారుల పైన ఎవరైనా దౌర్జన్యం చేసినా, దుర్భాషలాడిన సహించేది లేదని హెచ్చరించారు. ఇది మన మహబూబ్ నగర్ సంస్కృతి కాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపైన తీవ్రమైన




పరిణామాలు ఉంటాయన్నారు. శాంతి యుతంగా ఉన్న మహబూబ్ నగర్ నగరంలో శాంతికి విచ్ఛిన్నం కలిగించే వ్యక్తులు ఎవరైనా నిర్దాక్షిణ్యంగా చట్టం తన పని తాను చేసుకోబోతుందని అన్నారు. ఇలాంటి విషయాలలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెనహర్త తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు తల్లి లాంటి ప్రేమ అందించాలి

**• శిశు గృహను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** శిశుగృహ పిల్లలకు తల్లిలా ప్రేమను పంచాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. కలెక్టర్ విజయేందిర బోయి గురువారం శిశుగృహను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు. పిల్లల హెల్త్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక్కొక్కరికి చిన్నారి హెల్త్ ప్రొఫైల్ పరిశీలించారు. వయస్సు వారిగా పిల్లలని వేరు చేసి వారి గ్రోత్ పై మానిటరింగ్ చేయాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులకు స్పెషల్ డైట్ ఇవ్వాలన్నారు. పిల్లల బట్టల విషయంలో మరింత శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఇంటి వాతావరణంలో పిల్లలను పెంచాలని, ప్రత్యేకగా ఏర్పాటు చేసిన పార్కులో పిల్లలను ఆడించాలని చెప్పారు. శిశుగృహ చిన్నారులకు అవసరమైన సౌకర్యాల కోసం నిధులు సమకూరుస్తానని చెప్పారు. అనంతరం స్టేట్ హెూం ప్రాంగణంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ హెూమ్ భవన నిర్మాణ పనులను, మరమ్మత్తులు చేసిన మీటింగ్ హాల్ పనులను పరిశీలించారు. ప్రాంగణంలో పాతబడిపోయిన అర్బన్, రూరల్ సిడిపిఓ ఆఫీసుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట డిడబ్ల్యుఓ జరీనా బేగం, సీడీపీఓ శైల శ్రీ, డిసిపిఓ నర్మద, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాములు, శిశుగృహ సిబ్బంది ఉన్నారు.

# కేశవపట్నంలో అడుగు పెట్టిన తొలి ఎస్పీ

- చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు
- సన్మార్గంలో నడవాలని సూచన
- 160 మంది పోలీసులతో గ్రామంలో తనిఖీలు
- 82 ద్విచక్ర వాహనాలు, 18 ఆటోలు, మాక్స్ స్వాధీనం
- చదువుకు ఉన్న ప్రాధాన్యతను వివరించిన వైనం



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో ఉన్న కేశవ పట్నం గ్రామంలో మొన్నటి వరకు జిల్లాలో పని చేసిన ఏ ఒక్క ఎస్పీ కూడ ఆ గ్రామంలో అడుగు పెట్టలేకపోయారు. కారణం ఏమో తెలియదు. కానీ ఈ సంవత్సరం జిల్లాకు కొత్తగా వచ్చిన అఖిల్ మహజన్ మాత్రం ఆ గ్రామంలో మొదటిసారిగా అడుగు పెట్టారు. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికిని వర్షం సైతం లెక్క చేయకుండా గ్రామంలో కలియ తిరిగారు. 160 మంది పోలీసు సిబ్బందితో గురువారం ఉదయం ఐదు గంటల నుంచి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్డెన్ అండ్ సర్చ్ ను చేపట్టి సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేనటువంటి 82 ద్విచక్ర వాహనాలు, 18ఆటోలు, ఒక మ్యాక్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా నార్కోటిక్ డాగ్ రోమా జాగిలం సహాయంతో గంజాయి కోసం తనిఖీలు చేయించారు. అంతకు ముందు గ్రామంలో సమావేశంలో ప్రజలతో కలిసి ఎస్పీ విద్యార్థులకు చదువుపై ఉన్న ప్రాధాన్యతను వివరించారు. తల్లితండ్రులు యువతకు చదువుకునేల తగిన ప్రోత్సాహం అందించాలని చదువు కోవడం వల్ల మంచి పేరు భవిష్యత్తు ఉంటుందని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో ఇకనుంచి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. ఒకే గ్రామం నుండి గత ఐదు సంవత్సరాలలో 90 కేసులు నమోదు అయ్యాయని, ఇక నుండి సన్మార్గంలో వెళ్లాలని సూచించారు. గ్రామంలో నమోదైన రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనని వారిపై ఒక సంవత్సరం పాటు పరిశీలించి రౌడీ షీట్లను, సస్పెక్ట్ షీట్లను ఎత్తివేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా అక్రమంగా కలప రవాణాను, చెట్లను నరికి వేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో అనవసరంగా తిరగరాదని, ఈవిటీజింగ్ మరియు మహిళలను వేధించడం లాంటివి నిర్వహించకూడదని, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ఏ ఎస్పీ కాజల్ డీఎస్పీ జీవన్ రెడ్డి ,స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, ఇచ్చోడ సిఐ బండారి రాజు, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఎస్సైలు వి పురుషోత్తం, వి సాయన్న, ఎల్ శ్రీకాంత్, ఇమ్రాన్, డి రాధిక, పూజ, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాలను ప్రోత్సహించాలి

- అత్యధికంగా పంట రుణాలను ఇవ్వాలి
- లబ్ధిదారులకు జాప్యం చేయకుండా అందించాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): ప్రాధాన్యతా రంగాలను ప్రోత్సహించాలని, అత్యధికంగా పంట రుణాలను ఇవ్వాలని, రుణ లక్ష్యసాధనకు సమన్వయం అవసరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో బ్యాంకర్లు, అధికారులతో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణ లక్ష్యం 1221.72 కోట్లు కాగా, అందులో 136.74 కోట్లు రుణ లక్ష్యం సాధించా రన్నారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఈ, హౌసింగ్, ఎడ్యుకేషన్, వ్యవసాయ రుణాలను సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలని అన్నారు. ఆయా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులతో తరుచూ సంప్రదించి రుణ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన పరిచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో రైతు వేదికలు ఉన్నాయని ప్రతినెల సమావేశాలు చేపట్టి రుణ ప్రగతి పెంచేందుకు మండల స్థాయి అధికారులు కృషి చేయాలని అన్నారు. అత్యధికంగా పంట రుణాలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. పట్టణ ప్రాంతంలో వీధి వ్యాపారులకు రుణాలు సకాలములో ఇవ్వాలన్నారు. అదేవిధంగా రుణ లక్ష్యాలను పెంచుతూ ఇదే దిశగా రుణాలను పెంచుతూ అత్యధిక మంది నిరుపేదలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ అధికారులు సహకరించాలన్నారు. విద్యారు ణాలు అధిక మొత్తంలో ఇవ్వాలని విద్యాభి వృద్ధి కృషి చేయాలన్నారు. రికవరీ శాతం పెంచినపుడే బ్యాంకులు రుణాలు ఇచ్చేం దుకు సుముఖత వ్యక్తం చేస్తాయని అధికారులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. మహిళశక్తిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు మోడల్ సి ఎస్ సి సెంటర్స్ ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రుణాలు పొందిన లబ్ధిదారులకు అధికారులు వెన్నంటి ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్.బి.ఐ. ఎల్.డి.ఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ డిజిఎం, టిజిబి ఆర్ ఎం, జిల్లా అధికారులు, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# బ్యాంకులు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 25(జనం సాక్షి) : బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసిక జిల్లా కన్సాలిటేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి బ్యాంకర్లు,అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు.వెనుకబడిన తరగతుల ప్రజలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులు,వీధి వ్యాపారులు, విద్యార్థులకు రుణ మంజూరులో ఆలస్యం చేయకుండా చూడాలని ఆదేశించారు. అర్హులైన దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రుణాలు అందజేయాలని స్పష్టం చేశారు.సైబర్ నేరాలపై ప్రజలకు బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించాలని,విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు.ప్రజలకు ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా అందజేసిన రుణాల వివరాలు,వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకులకు వచ్చే ప్రతి ఒక్కరికీ సమయానుకూలంగా, మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్,నాబార్డు డిడిఎం వీరభద్రుడు, ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్, ఆయా శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# మానుకోటవాసికి జీ తెలుగు అచీవర్స్ అవార్డు



మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 25(జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీఆర్ఐ పంప్స్ డీలర్ ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అధినేత నాళ్ళ వీరన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా హైదరాబాద్‌లో జీ తెలుగు అచీవర్స్ అవార్డ్ అందుకున్నారు. జిల్లా కేంద్రంగా ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ వినియోగదారుల సేవలో నాలుగు దశబ్దాలకు పైగా సేవలు అందించి, వ్యాపారమే కాకుండా ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా జీ తెలుగు ఆధ్వర్యంలో సామాజిక సేవ కింద అచీవర్స్ అవార్డుని అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వీరన్నతో పాటు రచయిత, సినీ నటుడు తనికెళ్ళ భరణి, ఏఐజి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరెడ్డి, మోగా సుధారెడ్డి, సినీ డైరెక్టర్ హరీశ్ శంకర్, గాయని మంగ్లీ, మాలవత్ పూర్ణలు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ మంత్రి, ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాళ్ల వీరన్న మాట్లాడుతూ అచీవర్స్ అవార్డు ప్రకటించిన జీ తెలుగు యాజమాన్యానికి, తమ వ్యాపారంలో సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్న మిత్రులకు, రైతులకు, మెకానిక్ సోదరులకు ధన్యావాదాలు తెలిపారు.

# ప్రజలకు నమ్మకమైన సేవలు అందించండి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 25( జనం సాక్షి) : ప్రజలతో స్నేహపూర్వకంగా మసులుకొంటూ, వారికి నమ్మకమైన సేవలు అందించాలని జిల్లా పోలీసు అధికారి కాంతిలాల్ పాట్రీ అన్నారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని ఇస్గాం పోలీస్ స్టేషన్లో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో నిర్వహణ, నేరాల నమోదు, ప్రజలకు అందుతున్న సేవల గురించి ఎస్సై కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. విజువల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీస్ లు గ్రామాలను సందర్శిస్తూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేకంగా నిలవేసి ఉంచాలని అన్నారు. దయల్ 100 కాల్స్ కి సంబంధించి వెంటనే స్పందించాలని అధికారులను, పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ఎస్పి కాంతిలాల్ పాటిల్ వెంట కాగజ్ నగర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వహియోద్దీన్, రూరల్ సీఐ కుమార్ స్వామిలు పాల్గొన్నారు.

# చోరీలకు పాల్పడిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) : చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని వారిని అరెస్ట్ చేసి నిందితుల నుండి చోరీ సోత్తును స్వాధీనం చేసుకున్నప్పుడే ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం, గౌరవం పెరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయము సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండిరగ్‌లో వున్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండిరగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన చోరీలపై పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ వున్న అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపోందించుకోవాలని, కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్ అధికారులు అలసత్వం వహించోద్దని, నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వ్యామ్యంతో సిసి కెమెరాల ఏర్పాటుకై కృషి చేయడంతో సిసి కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నేర చరిత్ర వున్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో వుండాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి వుంటుందని. పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది రోటేషన్ పద్దతిలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్లలో ఆహ్లదకరమైన వాతవరణం కోసం మొక్కల పెంపకంతో పాటు స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రంగా వుంచాలని ఇందుకోసం వారంలో ఒక రోజు శ్రమదానం చేయాల్సి వుంటుందని సిపి పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్‌కుమార్, వరంగల్ , జనగాం ఏఎస్పీలు శుభం, చేతన్‌నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేష్‌కుమార్,తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# జల్ సంచయ్ జన్ భగీరథి అవార్డుకు మంచిర్యాల జిల్లా ఎంపిక

- మంచిర్యాల జిల్లాకు 2 కోట్ల రూపాయల అవార్డు ప్రకటించిన కేంద్రం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడి



మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : జల్ సంచయ్ జన్ భగీరథి అవార్డుకు మంచిర్యాల జిల్లా ఎంపిక కావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పూర్తి అయిన 84 వేల 549 పనులను కేంద్ర బృందంచే తనిఖీ చేసిన అనంతరం జిల్లాలో భూగర్భ జలాల అభివృద్ధికై ఎంతో లాభం జరిగిందని శాస్త్రజ్ఞులు ఖరారు చేస్తూ భావితరాలకు, వ్యవసాయ ఆధారిత పనులకు ఎంతో లబ్ది చేకూరుతుందని తెలుపుతూ 2 కోట్ల రూపాయల అవార్డు మంచిర్యాల జిల్లాకు కేంద్రం ప్రకటించిందని తెలిపారు.

# నూతన రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

- వరికి బదులుగా ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం
- జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న..



మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు ఇనుగుర్తి తొర్రూరు పెద్దవంగర మండలాల్లోని పలు గ్రామాలు సందర్శించి రైతులకు పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ సాగు చేయాలని మేలైన యాజమాన్య పద్దతులను తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యాన పట్టు పరిశ్రమ జిల్లా అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే ఎకరానికి మొక్కలు బిందు సేద్యం యాజమాన్యం అంతర పంటలకు యాభై వేలు రాయితీ పొంది ఆయిల్ పామ్ తోటలు నాటాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద పొలం చుట్టూ పెరట్లో ఆయిల్ పామ్ పండ్ల తోటలలో అంతర పంటలుగా డాబాల మీద ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు నూతన రకాల సాగు ప్రో ట్రే లో నారు పెంపకం ఎత్తు మడులు మల్చింగ్ బిందు సేద్యం ఫర్టిగేషన్ వేప పిండి ఆముదం పిండి వాడకం వేప నూనె పిచికారి చేయటం పసుపు రంగు అట్టల వాడకం సిఫారసు చేసిన ఎరువులు వాడటం పందిరిపై కూరగాయల సాగు ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి మానస ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారులు వెంకట్ నీరజ రంజిత్ ఉద్యాన విస్తరణ అధికారి యాదయ్య డ్రిప్ ఇరిగేషన్ కోఆర్డినేటింగ్ అధికారులు బి.అశోక్ ప్రసాద్ బాబు రైతులు సోంలా నాయక్ ఎనబోతుల నర్సయ్య సలుగు శ్రీను మరాటి మల్లేశం ఎల్. లక్ష్మణ్ రాము బుగ్గయ్య పులి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదవారి సొంతింటి కల నేర్చటమే ప్రభుత్వ లక్ష్యం

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



కాటారం సెప్టెంబర్ 25 (జనం సాక్షి): పేద వాని సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు రాష్ట్ర, ఐటి పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎం గార్డెన్స్ లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు,మహిళ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణమాసం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించి వారు తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. అనంతరం అర్హులైన 300 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు, గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, అట్టి జాబితా ను గెజిటెడ్ అధికారులతో విచారణ నిర్వహించి నిరుపేదలను ఎంపిక చేసినట్లు తెలిపారు. నియోజక వర్గం వ్యాప్తంగా 3500 ఇళ్ళు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని, ఇల్లు నిర్మాణం ఆగిపోతే ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారుల వేతనాల నుంచి కోత విధిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రభుత్వ అధికారులు గానీ ఇతరులు ఎవరైనా లబ్ధిదారులను డబ్బులు అడిగితే పోలీస్ కేసు నమోదు చేయాలని సూచించారు. మీ ఆశలను నెరవేర్చాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిర ఇల్లు మంజూరు చేసిందని మంజూరైన ప్రతి లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ఇల్లు నిర్మాణంతో సంతోషంగా ఉండాలని, మనం మనం గుర్తుకు రావాలని ఆయన సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. గెజిటెడ్ అధికారులతో విచారణ జరిపి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేశామని తెలిపారు. అధికారుల ద్వారా కూడా విచారణ చేపట్టామని తెలిపారు. లబ్ధిదారులు ఫోటో దిగిన చోట మాత్రమే ఇళ్లు నిర్మాణం చేపట్టాలని,4 విడతలుగా లబ్ధిదారులకు డబ్బు జమ [illegible] జరుగుతుందన్నారు.లబ్ధిదారులు త్వరిత గతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఇబ్బంది ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాలు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణీ లకు సీమంతం, కళ్యాణ్ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీచైర్మన్ తిరుమల సమ్మయ్య,సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, మహిళా, శిశు సంక్షేమ అధికారిణి మల్లీశ్వరి, మిషన్ భగీరథ ఈఈ శ్వేతా, మహాదేవపూర్ సింగిల్ విండో ఛైర్మన్ తిరుపతి రెడ్డి, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కుంటుపడిన పాలన

**ఖమ్మం, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** రాష్ట్రంలో పాలన పూర్తిగా కుంటుపడిపోయిందని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు గొప్పగా అమలు చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు తిరిగి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు చెప్పారు.అధికార పార్టీ నాయకులు ప్రతిపక్షానికి చెందిన వారిని బెదిరించడం,ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తూ "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఖమ్మంలోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసం ఆవరణలో గురువారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారాబట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాలను పట్టుకు తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును పూర్తిగా విస్మరించారన్నారు.యూరియా కోసం రైతన్నలు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తున్నదని,పింఛన్ల మొత్తాన్ని పెంచుతామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని



కామారెడ్డి బహిరంగ సభ నుంచి ఇప్పటిదాకా ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు పెట్టే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజల బాగోగులు,శ్రేయస్సును ఎల్లప్పుడూ కాంక్షించే కేసీఆర్ తెలంగాణ తొలి శాసనసభ సమావేశాలల్లోనే మహిళలు, బీసీలకు చట్టసభల్లో 33 శాతం చొప్పున రిజర్వేషన్స్ అమలు చేయాలని కోరుతూ తీర్మానించి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు.కేసీఆర్ బీసీలు,బడుగు బలహీన వర్గాలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి కలిగిన గొప్ప నాయకుడని ఎంపీ రవిచంద్ర కొనియాడారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి చోట్ల కూడా విద్యుత్ కోతలు నిత్యకృత్యంగా మారాయని, కేసీఆర్ పాలనలో ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు,అజయ్ నేతృత్వంలో కార్యకర్తలు కార్యోన్ముఖులై ఖమ్మం నగరం చుట్టూరా ఉన్న గ్రామాలలో పార్టీని గెలిపించుకుంటూ ముందుకు సాగాలన్నారు.ఆ విధంగా మనమంతా మరింత సంఘటితమై ఈ ఉమ్మడి జిల్లాలోని అత్యధిక అసెంబ్లీ సీట్లను గెలిపించుకుని ఇతర పార్టీ నాయకుల ఆశలను వమ్ము చేసి కేసీఆర్ ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.ఇటీవల అమెరికా పర్యటనను దిగ్విజయంగా పూర్తి చేసుకుని పుట్టినగడ్డకు విచ్చేసిన ఎంపీ రవిచంద్రను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శాలువాతో సత్కరించారు. సమావేశానికి హాజరైన వారికి ఎంపీ వద్దిరాజు బతుకమ్మ,దసరా,దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ,"జై కేసీఆర్ జైజై కేసీఆర్" అంటూ నినాదాలిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, (ఆర్జేసీ), పగడాల నాగరాజు, రాకేష్ రెడ్డి,ఖమర్,నాగచంద్రారెడ్డి,వీరన్న తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## 49 మద్యం షాపులను డ్రా ద్వారా ఎంపిక చేసిన కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ నూతన మద్యం పాలసీ 2025-27లో భాగంగా జిల్లాలో 49 మద్యం షాపుల నిర్వహణకు ఎస్సీ, ఎస్టీ మరియు బిసి గౌడ కులస్తుల రిజర్వేషన్ ఎంపిక కొరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో వీడియోగ్రఫీ మధ్య జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్టీ అభివృద్ధి శాఖ మరియు బీసీ అభివృద్ధి శాఖల అధికారుల సమక్షంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వారు డ్రా నిర్వహించారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో 05 ఎస్సీ సామాజిక వర్గానికి, 02 ఎస్టీ సామజిక వర్గానికి మరియు 07 బిసి గౌడ కులాలకు లాటరీ ద్వారా మద్యం షాపులను ఎంపిక చేసి వాటి ఆమోదానికి రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ హనుమంతరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, జిల్లా ఎస్టీ అభివృద్ధి అధికారి సతీష్ మరియు ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాలే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- చేవెళ్ల కాలే యాదయ్య



**చేవెళ్ల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** అభివృద్ధి, సంక్షేమాలే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. వారం చేవెళ్ల మండలంలో రూ.3 కోట్ల 30 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆయా గ్రామాల ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... మండలాల్లోని అన్ని గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మౌళిక సదుపాయాలను కల్పిస్తానని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి సమపాలల్లో చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల క్రిష్ణా రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, కాలె శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పెంటయ్యగౌడ్, బ్యాగరి రాములు, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు దావల్గారి గోపాల్ రెడ్డి, విజయ నర్సింలు, అనంతరాములుగౌడ్, రాజశేఖర్. రాంరెడ్డి, సురేందర్, నర్సింలు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి. సోషల్ మీడియా నియోజకవర్గం కో- ఆర్టినేటర్ తల్లారం మాణిక్యం, మాజీ ఎం పీటీసీలు గుండాల రాములు, శ్రీశైలం. నరేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తీగ యాదిరెడ్డి, నరేందర్, మల్లేష్, మండల యూత్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, నాయకులు వెంకటేష్బాబు, తరుణ్, పాష, శశివర్ధన్ గౌడ్, మహిపాల్ రెడ్డి, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

- రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కల్లూరు, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తూ తల్లిదండ్రుల కలలను సాకారం చేసే విధంగా ఉపాధ్యాయుల మార్గదర్శకంలో క్రమశిక్షణతో కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కల్లూరు మండలంలోసత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మట్టా దయానంద్ లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు, చేయటంతో పాటు కళాశాల విద్యార్థులకు నోట్ బుక్స్ యూనిఫామ్ దుస్తుల పంపిణీ, అట్టహాసంగా మహిళల ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాకల్లూరు పట్టణంలో మైనారిటీ సంక్షేమ శాఖచే 75 లక్షలతో నిర్మించిన షాదీఖాన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దంపతుల సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాల పంపిణీ



కార్యక్రమంలో మంత్రి పాల్గొని, విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలోమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 3.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం అనే కుగ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబాంలో పుట్టిన తాను, కల్లూరు జూనియర్ కాలేజీలో 1981, 83వ సంవత్సరం వరకు ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపులో కళాశాలలో విద్యార్థిగా చదువుకున్నానని తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పేరువంచ జడ్పీ హైస్కూల్లో 8 నుంచి10వ తరగతి వరకు చదువుకున్నానని. తర్వాత ఇంటర్ లో చదివేందుకు కల్లూరుకు సైకిల్ మీద కళాశాలకు వస్తూ ఇంటర్ పూర్తి చేయడం జరిగిందని అన్నారు. గతంతో పోలిస్తే నేడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాలలో ఉన్న కుటుంబాలలో 90 శాతం వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారై ఉంటారని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య విద్యార్థి జీవితంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, ఇంటర్ లో బాగా చదివితే మంచి ఇంజనీరింగ్, మెడికల్, ఇతర వృత్తి నైపుణ్య కళాశాలలో సీటు లభిస్తుందని , దీని వల్ల విద్యార్థికి మంచి కెరియర్, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ అన్న అంటే నేను ఉన్నా అంటూ అనునిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి మంత్రివర్యులు పొంగులేటి శ్రీనన్నకృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. కల్లూరు జూనియర్ కళాశాలకు హాస్టల్ భవనం, ఫర్నిచర్ మంజూరు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం ప్రజలను చూసి కష్టపడితే బాగుపడతామని ఆలోచన ప్రతి ఒక్కరు తెలుసు కోవాలని అన్నారు. ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని, కష్టపడి సాధన దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, డి ఈ రాంబాబు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజ దేవి, కల్లూరు మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ పులి సాంబశివుడు, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ మాదాభత్తుల రూప, ఎంపిడివో చంద్రశేఖర్, మున్సిపాల్ మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తుపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తోట సుజల రాణి, పసుమర్తి చందర్రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల పనితీరును మెరుగుపర్చాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మరింతగా మెరుగుపడాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీ.హెచ్.సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీ.హెచ్.సీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో స్త్రీ వైద్య నిపుణులు, ఇతర స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉన్నారా అని పరిశీలించారు. ఈ శిబిరంలో మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సేవలు అందించడం జరుగుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. శిబిరాల గురించి ముందుగానే అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. మొబిలైజేషన్ ద్వారా లబ్ధిదారులను గుర్తించి, ప్రత్యేక వైద్యులు పాల్గొనే ఈ శిబిరాలకు తరలించాలని అన్నారు. లబ్ధిదారులకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవల గురించి



వివరించి వారి అవసరానికి అనుగుణంగా మొబిలైజ్ చేయాలన్నారు. మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అవసరం ఉన్న వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరును పరిశీలించారు. 2002 ఓటరు జాబితాతో కొత్త ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని తహసీల్దార్ టి.శాంతకు సూచించారు. తప్పిదాలకు తావు లేకుండా కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్, ఎలక్టోరల్ టేబుల్ మ్యాపింగ్ పూర్తి చేయాలని అన్నారు. నిర్దిష్ట గడువు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## సీతాయిపేట్‌లో అట్టహాసంగా ఇందిరమ్మ గృహ ప్రవేశాలు

- ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలం సీతాయిపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల



గృహ ప్రవేశాల కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. వేద బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా పూజలు జరిపించి, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులైన మానస, స్వరూప, నిశాంత్, సాయిరాం, గంగాధర్ లను వారి కుటుంబ సభ్యులతో కలిసి గృహ ప్రవేశాలు చేయించారు. రూరల్ నియోజకవర్గంలో మొట్టమొదటి ఇందిరమ్మ గృహ ప్రవేశాలు కావడంతో ఎమ్మెల్యే భూపతి రెడ్డి లబ్దిదారులకు తన తరపున స్వయంగా నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ లు లబ్ధిదారులకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో సొంతింటి కల సాకారం చేసుకోగలిగామని లబ్దిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాగా, లబ్దిదారులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందాయా? ఇంటి నిర్మాణం విషయంలో అధికారులు తోడ్పాటును అందించారా? అని కలెక్టర్ లబ్దిదారులను ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్, తాగునీరు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా లబ్దిదారులు కూడా త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఇళ్లను కట్టుకోవాలని, అనవసర ఆర్భాటాలకు పోయి అప్పుల పాలు కాకూడదని కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**తలకొండపల్లి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** దేశీయంగా నూనె గింజల ఉత్పత్తి పెంపు, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి పీఏసిఎస్ గోదాంలో తెలంగాణ ప్రభుత్వం,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం"నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్"పథకం ద్వారా ప్రస్తుత సీజన్ లో రైతులకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,వ్యవసాయ అధికారులతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని,అందుకు అనుగుణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.ఎన్.ఎం.ఈ.ఓ.పథకం ద్వారా మండలంలో సుమారు 2500 ఎకరాల్లో కదిరి లేపాక్షి వేరుశనగ పంట సాగు అవసరమైన విత్తనాలను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రైతులకు సూచించారు.రైతు సంక్షేమమే




లక్ష్యంగా ఏకకాలంలో 2 లక్షలు రైతు రుణమాఫీ,రైతు భరోసా,ఉచిత కరెంటు,సన్నాలకు బోనస్,సబ్సిడీతో వ్యవసాయ యాంత్రిక పనిముట్లు,ఉచితంగా వేరుశనగ విత్తనాలు వంటి అనేకమైన సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నామని అన్నారు.ప్రతి పక్షాలు ప్రభుత్వంపై,నాపై లేనిపోని అబండాలు వేస్తే సహించేది లేదనీ ఎమ్మెల్యే మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మక చేపట్టిన సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ట్రిబుల్ఆర్ అలైన్మెంట్‌తో భూమిని కోల్పోతున్న రైతులకు తాను అండగా ఉండి ప్రభుత్వపరంగా సరైన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు అమాయక రైతులను రెచ్చగొట్టి రాక్షస ఆనందం పొందుతున్నారని విమర్శించారు.అభివృద్ధిని అడ్డుకోవాలని చూసిన,లేనిపోని వాదనలతో ఆటంకాలు సృష్టించిన ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఏడిఏ పద్మజా,ఆమనగల్ ఏడిఏ శోభారాణి,పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,ఏఎంసీ చైర్మన్ యాటగీత నరసింహ,మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రేణుక చక్రవర్తిని,మండల పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,శతాబ్ది ఫౌండేషన్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి,మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రమాదేవి,ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్య గుప్తా,శ్యాంసుందర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,పిఎసిఎస్ డైరెక్టర్లు,ఏఈఓలు,నాయకులు మోహన్ రెడ్డి,ధనుంజయ,పయ్యావుల రమేష్, యాదయ్య, డేవిడ్, రేణురెడ్డి,అజీజ్,కాకి కృష్ణ,ఆవంచ నరసింహారెడ్డి,రవీందర్ యాదవ్,ఆరిఫ్ చెన్నకేశవులు,పెరుమండ్ల రమేష్, పుట్ట పాండు, మీసేవ మల్లేష్,పోతుగంటి గణేష్,రాజేందర్ నాయక్,పవన్ వాల్మీకి,శివ,వివిధ గ్రామాలకు చెందిన రైతులు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి వాటర్ ట్యాంక్‌తో ప్రమాదకరం

- తక్షణ శుభ్రత అవసరం..



**దమ్మపేట, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** దమ్మపేట మండలం మొద్దుల గూడెం గ్రామంలో గల పల్లె దవాఖానాలోనీ మంచినీటి వాటర్ ట్యాంకు నిరుపయోగంగా దర్శనమిస్తుంది. సుమారుగా 80000 రూపాయలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ ను పట్టించుకునే వారే లేక ఇలా వ్యర్థంగా దర్శనమిస్తుంది.సుమారుగా వాటర్ ట్యాంక్ శుభ్రపరిచి రెండు సంవత్సరములు గడుస్తున్నాయని పైగా పల్లె దవాఖానాలో పిచ్చి మొక్కల మధ్య ఈ వాటర్ ట్యాంక్ ను ఇలా ఉంచారని,జబ్బు చేస్తే వెళ్లాల్సిన పల్లె దవాఖానానీ జబ్బులు సృష్టించే దవాఖానాల మారుస్తున్నరని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రంగు మారిన నీరు,దుర్వాసన,బ్యాక్టీరియాతో కూడిన వాటర్ ట్యాంకులోని నీరు తెలియక ఎవరైనా తాగితే ఏదో ఒక రకమైన జబ్బులు వస్తాయని, కనుక సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే వాటర్ ట్యాంక్ న శుభ్రపరిచి భవిష్యత్తులో ప్రమాదాలను నివారించటానికి ఎప్పటికప్పుడు ట్యాంకును శుభ్రపరచాలని,పిచ్చి మొక్కలు లేకుండా పల్లె దవాఖానాను శుభ్రపరచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.






# 24 గంటల్లో 3000 బుకింగ్స్

## ఈ బైక్ గురించి తెలుసా?

అల్ట్రావయోలెట్ ఇటీవల లాంచ్ చేసిన సరికొత్త మోటార్‌సైకిల్ 'ఎక్స్‌-47 క్రాస్‌ఓవర్' అమ్మకాల్లో సరికొత్త రికార్డ్ సృష్టించింది.ధర కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ.. మొదటి 24 గంటల వ్యవధిలోనే 3000 కంటే ఎక్కువ బుకింగ్స్ పొందగలిగింది. దీంతో పరిచయ ధరను 5000 యూనిట్లకు పెంచుతున్నట్లు కంపెనీ వెల్లడించింది.అల్ట్రావయొలెట్ ఎక్స్‌-47 క్రాస్‌ఓవర్ బైక్ పరిచయ ధర రూ. 2.49 లక్షలు (ఎక్స్‌-షోరూమ్). లాంచ్ సమయంలో ఈ ధర కేవలం మొదటి 1000 మందికి మాత్రమే అని కంపెనీ వెల్లడించింది. అయితే డిమాండ్ భారీగా పెరగడంతో ఈ సంఖ్యను 5000కు పెంచింది. అంటే పరిచయ ధర మొదటి 5000 మంది కస్టమర్లకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తరువాత ఈ బైక్ ధర రూ. 2.74 లక్షలకు చేరుతుంది. అల్ట్రావయొలెట్ ఎక్స్‌-47 క్రాస్‌ఓవర్ బైక్ 10.7 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ ద్వారా.. ఛార్జితో 323 కిమీ రేంజ్ అందిస్తుందని సమాచారం. ఇందులోని ఎలక్ట్రిక్ మోటారు 40 హార్స్ పవర్, 610 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ బైక్ 8.1 సెకన్లలో గంటకు 0 నుంచి 100 కిమీ వరకు వేగవంతం అవుతుంది. దీని టాప్ స్పీడ్ 145 కిమీ/గం కావడం గమనార్హం.

## బ్యాంకుల్లో మారిన ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు

పెట్టుబడిదారులకు ఎన్ని మదుపు పథకాలు ఉన్నప్పటికీ, బ్యాంకు డిపాజిట్‌లపై భద్రత ఉండడం వల్ల చాలా మంది బ్యాంకు ఎఫ్‌డీలకే ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు 0.5-1% వరకు అదనపు వడ్డీని ఇస్తున్నాయి. రిస్క్ లేకుండా కచ్చితంగా వడ్డీ రావాలి అనుకునేవారు..ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాలవారు ఇప్పటికీ బ్యాంకు ఎఫ్‌డీలనే ఇష్టపడుతున్నారు. అయితే, డిపాజిట్ చేసే ముందు వడ్డీ రేట్లను తప్పక సరిపోల్చుకోవాలి.

# రూ.3లక్షల కోట్లు ఆవిరి

## ఐదోరోజూ నష్టాల్లోనే సూచీలు..



విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, హెచ్‌-1బీ వీసా రుసుము పెంపుపై ఆందోళనల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదోరోజూ నష్టాల్లో ముగిశాయి.అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలూ ప్రభావం చూపాయి. ఈ క్రమంలోనే నిఫ్టీ 25వేల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.457.4 లక్షల కోట్లకు చేరింది.

**ముంబయి:**
సెన్సెక్స్ ఉదయం 81,574.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,715.63) నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు లాభాల్లోకి వచ్చినా రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 81,092.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 555.95 పాయింట్ల నష్టంతో 81,159.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 166.05 పాయింట్ల నష్టంతో 24,890.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.68గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగిలిన మార్కెట్‌లు నష్టాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్‌లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్లు, బంగారం ఔన్సు 3758 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఆహార రంగంలోకి రిలయన్స్

- రూ.40వేల కోట్లతో ఫుడ్ యూనిట్స్
- కర్నూలులో పరిశ్రమ ఏర్పాటు చేయనున్న సంస్థ




**దిల్లీ:** పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఆహార పరిశ్రమ రంగంలో రూ.40 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వరల్డ్ ఫుడ్ ఇండియా 2025 కార్యక్రమంలో ఈ ఒప్పందం కుదిరింది. ఇందులోభాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఓ పరిశ్రమను నెలకొల్పనుంది.ఇప్పటికే వివిధ వ్యాపారాల్లో నిమగ్నమై ఉన్న రిలయన్స్ సంస్థ వేగంగా విస్తరిస్తున్న కన్జూమర్ ప్రొడక్ట్స్ రంగం పైనా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా ఇటీవల జరిగిన ఏజీఎంలో పెట్టుబడులకు సంబంధించిన ప్రణాళికను బయటపెట్టింది. ఆసియాలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులను నెలకొల్పనున్నట్లు అందులో తెలిపింది. ఈ ప్రణాళికలో భాగంగా కేంద్ర ప్రభుత్వంతో తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన కటోల్‌లో ఫుడ్, బేవరేజెస్ యూనిట్లను రూ.1500 కోట్లతో నెలకొల్పనుంది. కన్జూమర్ వ్యాపార విభాగంలో తనదైన ముద్ర వేసేందుకు రిలయన్స్ దూకుడుగా ముందుకెళ్తోంది. కాంపా, ఇండిపెండెన్స్ పేరుతో కార్బొనేటెడ్ సాఫ్ట్‌డ్రింక్స్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను విక్రయిస్తోంది. ఇతర కన్జూమర్ ప్రొడక్టులను తీసుకొచ్చేందుకు ట్యాగ్జ్ ఫుడ్స్ వంటి బ్రాండ్‌లనూ కొనుగోలు చేసింది. రాబోయే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ వెల్లడించారు. దేశంలోనే అతిపెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీగా అవతరించడంతో పాటు విదేశాలకూ విస్తరించాలను కుంటున్నట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్స్‌తో పాటు ఇతర కన్జూమర్ కేటగిరీల్లో విస్తరణకు బ్లూప్రింట్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.


## జనవరి నుంచి ఏటీఎంల ద్వారా ఈపీఎఫ్‌ఓ నగదు ఉపసంహరణ!

**న్యూఢిల్లీ:** ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) నుంచి చందాదార్లు తమ నిధులు ఉపసంహరించుకుంటే, తొలుత బ్యాంకు ఖాతాలోకి చేరేవి. అక్కడ నుంచి మనకు అనువైన రీతిలో తీసుకునేవారం.ఇకపై చందాదార్లు తమ ఈపీఎఫ్‌ఓ ఖాతాలోని నిధుల్లో కొంతభాగాన్ని, ఏటీఎం ద్వారా నగదు రూపేణ ఉపసంహరించుకునే అవకాశం 2026 జనవరి నుంచి అమల్లోకి తీసుకురావొచ్చని తెలుస్తోంది. వచ్చే నెల రెండో వారంలో జరగబోయే బోర్డు సమావేశంలో ఈపీఎఫ్‌ఓ నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) ఇందుకు ఆమోదముద్ర వేయొచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల వార్తా సంస్థ 'మనీకంట్రోల్' తెలిపింది. ఇందుకు సంబంధించిన ఐటీ మౌలిక వసతులతో ఈపీఎఫ్‌ఓ సిద్ధంగా ఉందని సీబీటీ సభ్యుడొకరు తెలిపినట్లు వివరించింది. ఈపీఎఫ్‌ఓ చందాదార్లకు ఏటీఎం నుంచే నగదు ఉపసంహరణకు వీలు కల్పించడం కోసం బ్యాంకులు, ఆర్‌బీఐతో కార్మిక శాఖ మాట్లాడినట్లు ఆ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఏటీఎం ద్వారా నగదు తీసుకోవడానికి చందాదార్లకు ఈపీఎఫ్‌ఓ ఒక ప్రత్యేక కార్డు జారీ చేసే అవకాశం ఉంది.

'ఒలెక్ట్రా' నూతన ఎండీగా

# మహేష్ బాబు సుబ్రమణియన్

**హైదరాబాద్:** విద్యుత్తు బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మహేష్ బాబు సుబ్రమణియన్ నియమితులయ్యారు. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు.ఈ నియామకాన్ని బుధవారం కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆమోదించారు. బోర్డు డైరెక్టర్‌గా పి.రాజేష్ రెడ్డిని ఎంపిక చేశారు. దీంతో పాటు సీఎఫ్‌ఓగా బి.శరత్‌చంద్ర, కంపెనీ కార్యదర్శిగా పి.హనుమాన్ ప్రసాద్‌లను నియమించారు. ఆడిట్ కమిటీతో పాటు వివిధ ఇతర కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. మహేష్ బాబు ఇటీవల వరకూ అశోకా లేల్యాండ్ గ్రూపు విద్యుత్తు వాహనాల విభాగమైన స్విచ్ మొబిలిటీకి సీఈఓగా పనిచేశారు. అంతకు ముందుమహీంద్రా ఎలక్ట్రిక్ ఎండీ, సీఈఓగా వ్యవహరించారు. వాహన రంగంలో ఆయనకు 3 దశాబ్దాల అనుభవం ఉంది.రెట్టింపు ఉత్పత్తే లక్ష్యం: ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు చేతినిండా ఆర్డర్లు ఉన్నప్పటికీ విద్యుత్తు బస్సుల తయారీ, డెలివరీ నిదానంగా జరుగుతోంది. ఈ సంస్థ ప్రస్తుతం ఒక షిఫ్టులో 10 బస్సులు తయారు చేయగలుగుతోంది. దీన్ని 20 బస్సులకు పెంచుకునే అవకాశం ఉన్నట్లు కంపెనీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2,000 బస్సులు ఉత్పత్తి చేయాలనేది కంపెనీ లక్ష్యం. మొదటి త్రైమాసికంలో 160 బస్సులు డెలివరీ చేసింది. ఈ లెక్కన, ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం పెద్ద సవాలే.




# సోనమ్ వాంగ్‌చుక్‌పై సీబీఐ ఉచ్చు..

## విదేశీ నిధుల సేకరణ, పాకిస్తాన్ పర్యటనపై దర్యాప్తు



**లేహ్:** లడఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పించాలనే డిమాండ్‌తో ఉద్యమించిన ఒక గ్రూపును విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ రెచ్చగొట్టారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సోనమ్ వాంగ్‌చుక్ స్థాపించిన ఒక సంస్థపై నిఘా సారించింది. ఈ సంస్థ విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టాన్ని ఉల్లంఘించిందనే అనుమానం వ్యక్తం చేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం దర్యాప్తు సంస్థ రెండు నెలల క్రితం హిమాలయన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ లడఖ్ (హెచ్ఐఏఎల్) సేకరించిన నిధులపై విచారణను ప్రారంభించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 6న వాంగ్‌చుక్ పాకిస్తాన్ పర్యటనపై కూడా సమీక్షిస్తున్నదని సమాచారం.కాగా లడఖ్ జిల్లాలో కర్ఫ్యూ పరిస్థితుల్లో భద్రతా దళాలు, లడఖ్ ఉద్యమ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగడంతో నలుగురు మృతిచెందారు. 40 మంది పోలీసు సిబ్బందితో సహా 80 మంది గాయపడ్డారు. వాంగ్‌చుక్ తన పక్షం రోజుల నిరాహార దీక్షను ఉపసంహరించుకున్న తరువాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఘర్షణల్లో గాయపడ్డ ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో వారిని ఆస్పత్రికి తరలించిన తర్వాత లేహ్ అపెక్స్ బాడీ యువజన విభాగం నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో కొందరు యువకులు యువకులు గ్రూపులుగా బయలుదేరి భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయాన్ని, హిల్ కౌన్సిల్‌ను లక్ష్యంగా చేసుకుని విధ్వంసకాండకు పాల్పడ్డారు. లడఖ్ పట్టణం అంతటా మోహరించిన పోలీసులు, పారామిలిటరీ దళాలు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు టియర్‌గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించాయి. సామాజిక కార్యకర్త వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రకటనల కారణంగానే హింస చెలరేగిందని కేంద్రం ఆరోపించింది. లద్దాఖ్‌కు తక్షణమే రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగపరమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజధాని లేహ్‌లో ఆందోళనలు చోటుచేసుకున్నాయి.ఈ సందర్భంగా హింస ప్రజ్వరిల్లింది. ఆందోళనకారులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ వ్యాన్ సహా పలు వాహనాలను దహనం చేశారు. వీధుల్లో విధ్వంసం సృష్టించారు. ఇళ్లు, దుకాణాలపై దాడులకు దిగారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీలకు పనిచెప్పారు. ఈ ఘటనలో నలుగురు మరణించారు. 70 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో పదుల సంఖ్యలో పోలీసులు సైతం ఉన్నారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం లద్దాఖ్‌లో కర్ఫ్యూ విధించింది. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడొద్దని ఆదేశించింది. నిరసన ప్రదర్శనలు, ర్యాలీలకు అనుమతి లేదని, జనం ఇళ్ల నుంచి బయటకు రావొద్దని స్పష్టంచేసింది. పోలీసుల కాల్పుల్లో నలుగురు మరణించినట్లు ఆందోళనకారులు ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే వారు కాల్పులు జరిపినట్లు మండిపడ్డారు.

# ట్రంప్ ఓ 'ఇడియట్'

## గూగుల్ ఇమేజెస్




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తోపాటు ఆయన పేరు కూడా ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ట్రంప్ పేరుతో గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఆయనకు సంబంధించి తాజా వార్తావిశేషాలు, తాను తీసుకున్న నిర్ణయాలు, తన పర్యటనలు...ఇలా విభిన్న సమాచారం ప్రత్యక్షం అవుతుంది. అయితే గూగుల్ ఇమేజెస్‌లో ఇటీవల 'ఇడియట్' అని సెర్చ్ చేస్తున్న వ్యూయర్లకు కూడా ట్రంప్ ఫొటోనే దర్శనమివ్వడం పట్ల తీవ్ర దుమారం రేగింది. దాంతో అమెరికా ప్రభుత్వం స్పందించి ఈ వ్యవహారంపై జ్యుడీషియరీ కమిటీ ఏర్పాటు చేసింది. ఇటీవల ఆ కమిటీ ముందు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అలా జరగడానికి కారణాలేంటో వివరించారు. ఇటీవల యూఎస్ హౌస్ జ్యుడీషియరీ కమిటీ గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను గూగుల్ ఇమేజెస్‌లో 'ఇడియట్' అనే పదాన్ని సెర్చ్ చేసినప్పుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలను ఎందుకు చూపించారని ప్రశ్నించింది. ఈ సందర్భంగా గూగుల్ సెర్చ్ అల్గారిథమ్ ఎలా పనిచేస్తుందో వివరించారు. 'మేము కీవర్డ్ తీసుకుంటాం. మా ఇండెక్స్‌లోని బిలియన్లలో ఉన్న పేజీలతో సరిపోలుస్తాం. ఆ సమయంలో ఆ కీవర్డ్‌కు సంబంధించిన, తాజాగా ఉన్న, ప్రజాదరణ పొందిన సమాచారాన్ని యూజర్లకు అందిస్తాం. ఇది పూర్తిగా ఇతర వ్యక్తులు సెర్చ్ చేస్తున్నదానిపై ఆధారపడి ఉంటుంది. దాని ఆధారంగా వాటిని ర్యాంక్ చేస్తాం' అన్నారు. 'ఈ విధానాన్ని 'గూగుల్ బాంబింగ్' అని పిలుస్తారు. ఇది ఒక నిర్దిష్ట పదాన్ని నిర్దిష్ట పేజీకి లింక్ చేయడం వంటి ఆన్‌లైన్ సమన్వయ సెర్చ్ ఫలితాలను ప్రభావితం చేస్తుంది. గూగుల్ మాన్యువల్‌గా ఫలితాలను తారుమారు చేయదు. రాజకీయ పక్షపాతం వహించదు. ఈ అల్గోరిథమ్‌లు వినియోగదారుల ప్రవర్తన, ఇంటర్నెట్ ట్రెండ్స్‌ను ప్రతిబింబిస్తాయి' అని పిచాయ్ నొక్కి చెప్పారు. 'ఇది కొన్నిసార్లు ఊహించని లేదా వివాదాస్పద ఫలితాలను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది' అని చెప్పారు.

## 'స్టీవ్ జాబ్స్, ఒబామా.. నా ముందు దిగదుడుపే'.. సరికొత్త వాదన



**న్యూఢిల్లీ:** పలువురు విద్యార్థినులను లైంగికంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీకి చెందిన స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక గురువు చైతన్యానంద సరస్వతి తనను తాను అర్హత కలిగిన మేనేజ్‌మెంట్ గురువునని, ప్రముఖ రచయితనంటూ చెబుతున్నాడు. పైగా 'స్టీవ్ జాబ్స్, ఒబామా.. తన ముందు జుజుబీ'.. అటూ సరికొత్త వాదన వినిపిస్తున్నాడు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి అతని వ్యక్తిగత జీవితంపై పడింది. అకడమిక్ రీసెర్చ్ షేరింగ్ ప్లాట్‌ఫామ్‌లోని చైతన్యానంద ప్రొఫైల్‌లో అతను చికాగో విశ్వవిద్యాలయం బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుండి ఎంబీఏ, పీహెచ్‌డీ చేసినట్లు చూపిస్తోంది. అలాగే అతను పోస్ట్‌-డాక్టోరల్ డిగ్రీలు, డీలిట్ పూర్తి చేసారని, భారతదేశంతో పాటు విదేశాలలోని పలు విశ్వవిద్యాలయాల నుండి ఏడు గౌరవ డిగ్రీలను కలిగి ఉన్నాడని ఆ సైట్‌లో పేర్కొన్నారు. అయితే ఈ వాదనలు ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్న అతని పుస్తక రచయిత పేజీలలోనూ ఉన్నాయి. అతని విద్యాభ్యాస వివరాలు అనుమానాస్పదంగా ఉన్నాయని, నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర దర్యాప్తు జరుగుతున్నదని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి.తన పుస్తకాలపై చైతన్యానంద తనను తాను 'అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన రచయిత'గా పరిచయం చేసుకుంటాడు. అతని పుస్తకాలలో ఒకటైన 'ఫర్గెట్ క్లాస్‌రూమ్ లెర్నింగ్'లో యాపిల్ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ ముందుమాటను రాసినట్లు ఉంది. పుస్తకం మొదటి పేజీలో ఈ చైతన్యానంద పుస్తకం.. ప్రపంచానికి అపూర్వమైన మార్గదర్శకాల మాన్యువల్' అని జాబ్స్ చెప్పినట్లు ప్రచురితమయ్యింది. మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా చైతన్యానంద పుస్తకం 'ట్రాన్స్‌ఫార్మింగ్ పర్సనాలిటీ'ని పదేపదే ప్రస్తావించారనే అనే విషయం బయటకొచ్చింది. ఈ పుస్తకం 2007లో యూరోపియన్, ఉత్తర అమెరికా మార్కెట్లలో బెస్ట్ సెల్లర్లలో ఒక టిగా నిలిచిందని సమాచారం. ఈ పుస్తకంలో ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్ కీ-మూన్ పేరుతో ప్రశంసా సందేశం కూడా ఉంది. ఆయన ఆ పుస్తకంలో రచయిత గురించి చెబుతూ, ప్రముఖ ప్రొఫెసర్, ప్రముఖ రచయిత, వక్త, విద్యావేత్త, ఆధ్యాత్మిక తత్వవేత్త పరోపకారి, భారతదేశంతో పాటు విదేశాలలో మేనేజ్‌మెంట్ నిపుణునిగా పేర్కొన్నారు. కాగా చైతన్యానంద ఎడ్యుకేషన్ ప్రొఫైల్‌లోని చాలా సమాచారం నకిలీదని పోలీసులు బలంగా నమ్ముతున్నారు. వసంత కుంజ్‌లోని శారదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులను లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, చైతన్యానంద సరస్వతి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. కాగా అతను అతను దేశం విడిచి పారిపోకుండా నిరోధించడానికి పోలీసులు లుకౌట్ నోటీసు జారీ చేశారు. చైతన్యానంద రెండు దశాబ్దాలుగా మహిళలను వేధిస్తున్నాడని దర్యాప్తులో వెల్లడైంది. కాగా జుజుబీ అంటే రేగిపండు.. దీని శాస్త్రీయ నామం జిజిఫస్ జుజుబా రేగిపండు చిన్నగా ఉంటుంది. దేన్నయినా జుజుబితో పోలిస్తే అది 'నా వెంట్రుకతో సమానం' అనే అర్థం వస్తుంది.

## చిక్కుల్లో అందాల భామ 'బేబీ'.. బిగుస్తున్న ఉచ్చు



**బ్యాంకాక్:** థాయ్ బ్యూటీ క్వీన్ సుపన్నీ నోయినోం తాంగ్ అలియాస్ బేబీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అందాల రాణి కిరీటం దక్కిన మరుసటిరోజే ఆమె అశ్లీల వీడియోలు ఇంటర్నెట్‌లో దర్శనమిచ్చాయి. దీంతో నిర్వాహకులు ఆమె కిరీటాన్ని వెనక్కి తీసుకున్నారు. అయితే అందులో ఉంది తానేనని, తాను ఎందుకు చేయాల్సి వచ్చిందో ఆమె తర్వాత వివరణ ఇచ్చుకుంది. థాయ్‌లాండ్‌లో 76 ప్రావిన్స్‌కు విడివిడగా అందాల పోటీలు నిర్వహిస్తారు. ఆ 76 మంది బ్యూటీ క్వీన్లను ఒక దగ్గరికి తీసుకొచ్చి మళ్లీ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. అక్కడ నెగ్గిన వాళ్లను మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీకి పంపిస్తారు. అలా.. 27 ఏళ్ల సుపన్నీ(బేబీగా ఆమెకు పాపులారిటీ దక్కింది) ప్రాచువాప్ ఖిరీ ఖాన్ ప్రావిన్స్ నుంచి అందాల భామ గుర్తింపు దక్కించుకుంది. అయితే సెప్టెంబర్ 20వ తేదీన ఆమెకు కిరీటం దక్కగా.. ఆ వెంటనే ఆమెకు సంబంధించిన నగ్న చిత్రాలు, వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ-సిగరెట్లు తాగుతూ, అశ్లీల నృత్యాలు.. చేష్టలతో ఆ వీడియోలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో.. ఆ మరుసటిరోజే నిర్వాహకులు టైటిల్‌ను వెనక్కి తీసుకుని, ఆమెను డిస్‌క్వాలిఫై అయినట్లు ప్రకటించారు.అయితే.. ఈ పరిణామాలపై ఆమె క్షమాపణలు తెలియజేసింది. ఆ వీడియోలో ఉంది తానేనని ఒప్పుకుంది. ఈ మేరకు నిర్వాహకులను, తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఫేస్‌బుక్‌లో ఓ సుదీర్ఘ పోస్ట్ ఉంచింది.కరోనా టైంలో తన తల్లి జబ్బు చేసి మంచాన పడిందని, ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు అలా అశ్లీల వెబ్‌సైట్‌కు పని చేయాల్సి వచ్చిందని తెలిపింది. అయితే అంత చేసినా తన తల్లిని ఎంతోకాలం బతికించుకోలేకపోయానని, అప్పటి నుంచి మళ్లీ అలాంటి వాటి జోలికి వెళ్లలేదని వివరణ ఇచ్చుకుంది. ఈ ఘటన తనకు విలువైన గుణపాఠం నేర్పిందన్న ఆమె.. జీవితంలో ఎలాంటి తప్పు చేయబోనంటూ వ్యాఖ్యానించింది. తాను బ్యూటీ క్వీన్ కిరీటం గెలిచిన తర్వాతే అవి బయటకు వచ్చాయని.. ఉద్దేశపూర్వకంగానే వాటిని బయట పెట్టిన వాళ్లను కోర్టుకు లాగుతానని ఆమె హెచ్చరించింది.ఈ వివరణ తర్వాత.. పలువురు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు.. నిర్వాహకులను కలిసిన బేబీ తన టైటిల్ విషయంలో విజ్ఞప్తి చేసుకుంది. జాతీయ స్థాయిలో పోటీలకు అనుమతించాలని వేడుకుంది. ఈ తరుణంలో జరిగిన విచారణకు ఆమె హాజరు కాగా.. న్యాయనిపుణులు ఆమెను పలు అంశాలపై ఆరా తీశారు. అందాల పోటీల్లోని పాల్గొనే ముందు ఒప్పందంలోని ఓ క్లాజ్ ప్రకారం.. కంటెస్టెంట్లు అశ్లీల కార్యకలాపాలకు దూరంగా ఉన్నామనే కాలమ్‌పై సంతకం చేయాలి. ఒకవేళ అది అబద్ధమని తేలితే వాళ్లపై క్రిమినల్ చర్యలు ఉంటాయి. బేబీ తెలిసి కూడా ఆ కాలమ్‌పై సంతకం చేయడంతో.. ఆమెకు మూడేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష పడే అవశకాం ఉందని న్యాయనిపుణులు తెలిపారు. దీంతో ఆమె అందరి ముందే లబోదిబోమంది. అయితే టైటిల్ వెనక్కి ఇచ్చే అంశాన్ని పునరాలోచన చేస్తామని నిర్వాహకులు చెప్పడంతో ఆమె సగం సంతోషంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది.

# రూ.62వేల కోట్లతో 97 తేజస్ ఫైటర్‌జెట్లు

29 ట్విన్ సీటర్స్ ఉండనున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. ఈ అత్యాధునిక ఫైటర్ జెట్లలో ఉత్తమ్ రాడార్, స్వయం రక్షా కవచ్ వ్యవస్థలతోపాటు కంట్రోల్ యాక్యుయేటర్‌లు ఉంటాయి. వీటిలో 64శాతానికి పైగా దేశీయ కంటెంట్, 67 దేశీయ ఉత్పత్తులు ఉండనున్నాయని రక్షణశాఖ పేర్కొంది. 2027-28 నుంచి వీటి సేకరణ ప్రారంభమవుతుందని, తద్వారా వాయుసేన సామర్థ్యాలు పెరగడంతోపాటు ఆత్మనిర్భర భారత్, భారత రక్షణ సంసిద్ధతలను మరింత పెంపొందిస్తుందని రక్షణశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టు వచ్చే ఆరేళ్లలో ఏడాదికి 11,750 ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపాయి. అయితే, హెచ్ఏఎల్‌తో ఇది రెండో ఒప్పందం కాగా.. రూ.48వేల కోట్లతో 83 తేజస్ యుద్ధవిమానాల సమీకరణకు రక్షణ శాఖ 2021 ఫిబ్రవరిలో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే.



# కరీంనగర్‌లో స్వచ్ఛతా హీ సేవా, శాతవాహనలో ఎస్టీ హాస్టల్ శంకుస్థాపన

- 'ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్' నినాదంతో పరిశుభ్రత కార్యక్రమం
- మానేరు డ్యామ్ పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు
- ఆదివాసీ విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మాణం
- విద్య, ఆరోగ్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి





**కరీంనగర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** స్వచ్ఛతా హీ సేవా 2025 కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ సమీపంలో 'ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్' నినాదంతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి చీపురు పట్టి మానేరు డ్యామ్ పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను మంత్రి స్వయంగా తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వెలిచాల రాజేందర్ రావు, ఇతర అధికారులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ, అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల సహకారం విజయానికి కీలకమని పేర్కొన్నారు. పోలీసు, ఫారెస్ట్, పరిశుద్ధ సిబ్బంది సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు, ఇది ఒక రోజు కార్యక్రమం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి కాలుష్యం తగ్గించేందుకు పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు.
అదే రోజు, శాతవాహన విశ్వవిద్యాలయం బాలికల హాస్టల్ ప్రాంగణంలో ఆదివాసీ బిడ్డల కోసం ఎస్టీ బాలురు, బాలికల హాస్టల్ నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పేద, గ్రామీణ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు కల్పించే ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని, రూ.20 కోట్లతో రెండు హాస్టల్ భవనాల నిర్మాణానికి ఆర్థిక సహాయం మంజూరైందని తెలిపారు.
ఈ హాస్టల్‌లు ఆదివాసీ, గిరిజన విద్యార్థు లకు ఉన్నత విద్యా అవకాశాలను మెరుగుపరుస్తాయని, విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను ప్రాధాన్యంగా భావిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని, హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఫార్మసీ కోర్సులు ప్రవేశపెట్టడం సంతోషకరమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మంత్రిమండలి సమిష్టిగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని, విశ్వవిద్యాలయాలు యూజీసీ, నాక్, ఏఐసీటీఈ మార్గదర్శకాలను అనుసరించి నాణ్యమైన విద్య అందించాలని, గ్రామీణ విద్యార్థుల ఆశలను నెరవేర్చేలా శాతవాహన విశ్వవిద్యాలయం విద్యా ప్రమాణాల్లో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.
విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్య, మౌలిక సదుపాయాలపై చొరవ చూపుతోందని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, నాణ్యమైన విద్య ద్వారా విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించగలరని, రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, ఓఎస్డీ డాక్టర్ బి.హరి కాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత, చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## వైభవంగా రాజశ్యామల దేవి పూజమహోత్సవం

### ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య అభ్యుదయ సంఘము ఆధ్వర్యంలో, దాతల సహకారంతో మొట్టమొదటి సారిగా దసరా నవరాత్రుల సందర్భంగా రాజశ్యామల దేవి పూజ మహోత్సవంనిర్వహించారు .సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు మంచాల సౌజన్న రాజశేఖర్, మహిళా కమిటీ కర్వీనర్ యాద సంతోష్ ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై అమ్మవారికి నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు వాసవి మాత దేవాలయం నుండి పల్లకీ ద్వారా శ్రీనివాస కళ్యాణ మండపానికి అమ్మవారిని తీసుకువచ్చారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, రాజశ్యామల దేవి యంత్ర స్థాపన, ప్రధాన కలశ స్థాపన జరుగాయి. అనంతరం సామూహిక కుంకుమార్చన, కమలార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం పూర్తయ్యిన తరువాత అన్నప్రసాదం వితరణ జరిపారు. సాయంత్రం అమ్మవారికి సహస్రదీప అలంకరణ, బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాజశ్యామల దేవిని నవరాత్రుల్లో ఆరాధించడం వలన సకల శత్రు బాధలు, దృష్టిదోషాలు తొలిగి సంపూర్ణ ఆరోగ్యం, ఐశ్వర్యం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు ఆర్యవైశ్య కుల బాంధవులు, పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల మహిళాలు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనతో నిజాంపేట్ కార్పొరేషన్‌ను

# ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కె పి వివేకానంద్



**నిజాంపేట్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి .వివేకానంద్ గురువారం అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా మంజీరా నీటి నిర్వహణ, బిల్లులు, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి కాలనీలలో నిలిచిపోవడం, నత్త నడకన సాగుతున్న బాచుపల్లి ఫ్లైఓవర్ పనులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు.
అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ గత పదకొండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లు, కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంజీరా నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుతో పాటు చెరువుల పునరుద్దరణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నా మని తెలిపారు. బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక మౌలిక వసతుల కల్పనలో భాగంగా టెండర్లు పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.
ప్రజా ఆరోగ్యంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అలాగే నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతి నగర్, నిజాంపేట్ ప్రాంతాలలోని అన్నీ కాలనీలలో శానిటేషన్ నిర్వహణ సరిగాలేదని, శానిటేషన్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లలో పెరుగుతున్న దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్ ను విధిగా నిర్వహించాలి.

**చెరువులు, పార్కుల సుందరీకరణ :**
చెరువుల సుందరీకరణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది చెరువులకు 22 కోట్లు, ఐదు పార్కుల అభివృద్ధికి రూ.10 కోట్లను కేటాయించడం జరిగిందని ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలి.

**స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు :**
నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఖరి మజిలికి ముక్తి ఆశ్రమ్!

- పేదోడికి అండగా పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్
- కడసారి చూపు నుంచి కర్మకాండ వరకు ముక్తిఆశ్రమ్‌లోనే
- గౌరవెల్లి రాజు పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నివాళి




**మంథని, (జనంసాక్షి) :** అద్దె ఇంట్లో ఉంటూ ఆఖరి మజిలీకి అష్టకష్టాలు పడే పేదోడికి ముక్తి ఆశ్రమం భరోసా ఇస్తోంది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబంలో ఎవరైనా చనిపోతే అంతిమ కార్యక్రమం ఆ అద్దె ఇంట్లో నిర్వహించేందుకు ఇంటి యజమానులు అడ్డుకుంటుంటం సమాజంలో జరుగుతూనే ఉన్నాయి. ఒకరు చనిపోతే గౌరవించాల్సిన పరిస్థితులు ఉన్నా కట్టుబాట్లు, ఆచారాల పేరుతో పేదోడిని ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలుఉన్నాయి. నియోజకవర్గంలో ఎంతో మంది పేదలు తమ కుటుంబసభ్యుడు చనిపోతే అద్దె ఇంట్లో ఉంటలేక చివరకు పార్థివ దేహాన్ని రోడ్డుపైనే ఉంచిన సందర్భాలు అనేక ఉన్నాయి. పేదోడి ఆఖరి మజిలీకి కుటుంబసభ్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పుట్ట లింగమ్మ చారిటబుల్ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని బస్ డిపో సమీపంలో ముక్తి ఆశ్రమం నిర్మించారు. అద్దె ఇంట్లో ఉంటూ ఎవరైన చనిపోతే వారి అంతిమ సంస్కారాలతో పాటు కర్మకాండ పూర్తి చేసుకునే వరకు ఈ ముక్తి ఆశ్రమంలో ఉండి చేసుకునే విధంగా సదుపాయాలు కల్పించారు. ఈ మేరకు మల్హర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన గౌరవెల్లి రాజు ఓ ఇంట్లో కిరాయి ఉంటున్నారు. ఈ క్రమంలో గౌరవెల్లి రాజు మరణించగా అద్దె ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమాని అంగీకరించలేదు. దీంతో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ముక్తి ఆశ్రమంలో వారి అంతిమ కార్యక్రమం చేసుకుంటున్నారు. గురువారం రాజు పార్థీవ దేహాన్ని కి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ముక్తి ఆశ్రమం మీలాంటి పేదోళ్ల కోసమే ఏర్పాటు చేశామని, పేదోడి ఆఖరి మజిలీలో ఎలాంటి ఇబ్బందులు రాకూడనే ఆలోచనతో ముక్తి ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

## మంథని కోర్టులో బతుకమ్మ సంబరాలు

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని కోర్టు ఆవరణలో గురువారం మద్యాహ్నం బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి.భవాని,కోర్టుల సిబంది,మహిళా న్యాయవాదులు జి.శ్రీలక్ష్మి, బండ మాధురి, తో పాటు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కే.రఘోత్తం రెడ్డి,ప్రధాన కార్యదర్శి యం. సహేందర్ రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి కటుకం శరీనివాస్,ఏజీపి బి ఆంజనేయులు,సదన్ కుమార్, శశి భూషణ్ కాచె,మంథని శ్రీనివాస్, వ్యాస్ కుమార్ లు పాల్గొన్నారు.



# చెర వీడి చెరువైన బతుకమ్మ కుంట




- జాతీయ స్థాయిలో -బతుకమ్మకుంట- వైభవం
- ఈ నెల 26న సీఎం చేతులమీదుగా ప్రారంభం
- బతుకమ్మ ఉత్సవాలకు సర్వం సన్నద్ధం
- సర్వాంగ సుందరంగా మారిన బతుకమ్మ కుంట

**హైదరాబాద్, సెప్టెంబరు 25 (జనంసాక్షి) :**
బతుకమ్మకుంట తన పేరును సార్థకం చేసుకుంది. కబ్జాల కోరల్లో చిక్కుకున్న చెరువు నేడు జీవం పోసుకుంది. ముళ్ల పొదలు.. పిచ్చి మొక్కలతో అటువైపు చూడాలంటేనే భయపడే విధంగా ఉన్న బతుకమ్మ కుంట.. నేడు జలకళతో చూడముచ్చటగా తయారయ్యింది. కబ్జాల చెరను విడిపించుకుని కనువిందు చేస్తోంది. ఆక్రమణల నుంచి బయట పడి ఆహ్లాదంగా మారింది. ఇలా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ఇదంతా హైడ్రా చొరవతోనే సాధ్యమైందని అక్కడి నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్వాంగ సుందరంగా మారిన చెరువును చూసి ఇది కలా.. నిజమా అని సంబర పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పానికి, హైడ్రా పని తీరుకు బతుకమ్మ కుంట నిదర్శనమంటున్నారు. ఈ నెల 26న బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బతుకమ్మలతో ఘన స్వాగతం చెప్పేందుకు అక్కడి నివాసితులు సిద్ధమయ్యారు.

**హైడ్రాకు ప్రేరణగా నిలిచిన బతుకమ్మకుంట..**
జలకళతో.. జీవ వైవిధ్యంతో.. చక్కటి పర్యావరణంతో ఆరోగ్య వంత మైన జీవనం సాగించేలా ఈ నగరాన్ని తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించింది. దీనికై ఎలా ముందుకు వెళ్లాలి అని ఆలోచించే క్రమంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారికి తట్టిన ఆలోచనే హైడ్రా. జులై 19వ తేదీ 2024లో హైడ్రా ఆవిర్భవించింది. ఆరంభం నుంచే తన మార్కును చాటుతూ.. నగర భవిష్యత్తుకు బాటలు వేస్తున్న హైడ్రాకు బతుకమ్మ కుంట ప్రేరణగా నిలిచింది. వరద నివారణకు బతుకమ్మకుంట బాటలు వేసింది. నగరవ్యాప్తంగా చెరువులు అభివృద్ధి చెందితే వరదలు చాలావరకు నివారించవచ్చు నని బతుకమ్మకుంట నిరూపించిందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ తెలిపారు. వర్షం పడితే బతుకమ్మకుంట పరిసరాలు నీట మునిగేవి. ఈ వర్షాకాలంలో బతుకమ్మకుంటలోకి వరద నీరు చేరడంతో ముంపు సమస్య తప్పింది. కేవలం 5 నెలల్లో బతుకమ్మ కుంటను రూపొందిం మని చెప్పారు. ఒకప్పటి ఎర్రకుం టనే.. కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని స్థానికులు చెబుతు న్నారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్నారు.

**వివాదాలనుంచి బయటపడి..**
నిర్మాణ వ్యర్థాలతో చెరువును పూడ్చేసి..ఈ చెరువ8ఉ ఆనవాళ్లు లేకుండా కబ్జా రాయుళ్లు ఆక్రమించేశారు. ఆ భూమికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకుండా కేవలం అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్‌తో యెడ్ల సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బతుకమ్మకుంటను హైడ్రా చేపట్టింది. రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీతో కలిసి చెరువు చరిత్రను తవ్వి తీసింది. అన్ని విభాగాలతో కలిసి అనేక సమావేశాలు ఏర్పాటు చేసి బతుకమ్మ కుంట చెరువే అని నిర్ధారించుకుంది. బతుకమ్మ కుంట పునరుద్ధరణ ప్రక్రియలో HYDRAA అనేక న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంది, ముఖ్యంగా భూ కబ్జాదారులైన సయ్యద్ ఆజం, సయ్యద్ జహాంగీర్ మరియు ఏ. సుధాకర్ రెడ్డి లాంటి వారిచే వేసిన పిటిషన్లపై కోర్టులు పదేపదే ఇది చెరువు భూమియేనని స్పష్టం చేశాయి.





**బతుకమ్మ కుంట బతికే ఉందని రుజువైంది..**
మందు వేసవిలో దాదాపు రూ. 7.15 కోట్లతో బతుకమ్మ కుంట పనులను హైడ్రా చేపట్టింది. జేసీబీలతో మోకాలు లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చింది. బతుకమ్మ కుంట బతికే ఉందని రుజువు చేసింది. అక్కడి స్థానికులలో ఆనందం పెల్లుబికింది. బతుకమ్మ కుంట కాదు.. ఇది మా స్థలమంటూ ఇప్పటివరకూ నమ్మబలికిన వారిని ఇప్పుడేమంటారు అని అక్కడి స్థానికులు ప్రశ్నించారు. ఈ మేరకు అక్కడి ముళ్ల పొదలను తొలగించి... తవ్వకాలు చేపట్టిన హైడ్రాకు గంగమ్మ స్వాగతం పలికింది. అంబర్‌పేట మండలం,



బాగ్‌అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 -63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణం అని తేల్చిన సర్వే అధికారులు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించింది.

**సర్వాంగ సుందరంగా..**
బతుకమ్మకుంట ఇప్పుడు పిక్నిక్ స్పాట్‌గా మారింది. చెరువు అభివృద్ధిని దగ్గరగా పరిశీలించిన స్థానికులు సాయంత్రం అయితే చాలు అక్కడకు చేరుకుని సేదదీరుతున్నారు. బతుకమ్మ కుంట చుట్టూ ఎన్నో ఆకర్షణలు వచ్చాయి. పిల్లల ప్లే ఏరియా అందుబాటులోకి వచ్చింది. వయసు మళ్లిన వారు అక్కడ కూర్చొని సేద దీరేందుకు గుమ్మటాలు ఏర్పాటు చేశారు. చుట్టూ నడక దారి ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువులో వరద నీరు వచ్చి చేరడంతో నిండు కుండను తలపిస్తోంది. చెరువులో బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇలా అభివృద్ధి చేసిన చెరువును ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారు నగర ప్రజలకు ఈ నెల 26న అంకితం ఇవ్వనున్నారు. బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించింది.
అభినందనలు తెలిపిన స్థానికులు..
హైడ్రాను తీసుకువచ్చిన ప్రభుత్వానికి స్థానికులు అభినందనలు తెలిపారు. హైడ్రాతోనే ఇది సాధ్యమైందని అంటున్నారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారితో పాటు.. హైడ్రా అధికారులు, సిబ్బంది ఎంతో దీక్షతో ఈ చెరువును అభివృద్ధి చేశారు. హైడ్రా దీక్షా దక్షతకు ఇది నిదర్శనం. ముళ్ల పొదలతో భయంకరంగా కనిపించే ఈ పరిసరాలు.. ఇప్పుడు ఆహ్లాదంగా మారాయి. తమ ఇళ్లకు డిమాండ్ వచ్చింది. ఈ పరిసరాలకు కొత్త అందాలు వచ్చాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమిష్టి కృషితో స్వచ్ఛత సాధ్యం

### డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి




**గోదావరిఖని, జనంసాక్షి :** సమిష్టి కృషితో స్వచ్ఛత సాధ్యమని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం గోదావరినది పుష్కరఘాట్ వద్ద నిర్వహించిన 'ఏక్ దిన్ ఏక్ ఘంటా ఏక్ సాత్: నేషన్‌వైడ్ వాలంటరీ శ్రమధాన్' కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొని సమగ్ర పరిశుభ్రత డ్రైవ్ చేపట్టి ఒడ్డున ఉన్న ప్లాస్టిక్,చెత్త ఏరివేశారు.ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతా క్రమశిక్షణ సంస్కృతిని ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఒక మైలురాయి అని అన్నారు.ఈ కార్యక్రమం సమిష్టి కృషి శక్తిని నిరూపించిందని అన్నారు.నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు,సెక్రెటరీ ఉమామహేశ్వర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సిఓలు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు,ఎకో వారియర్స్ ప్రతినిధులు శివకృష్ణ, కరుణాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన లద్నాపూర్ భూ నిర్వాసితులు



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ సింగరేణి భూ నిర్వాసితులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం గురువారం ఐటి పరిశ్రమ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ని కాటారంలోని ధన్వాడ వారి నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. 283 మంది, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ సభ్యుల నిర్ణయం మేరకు పార్టీలకు తీతంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సదరు 283 మంది సింగరేణి భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ప్యాకేజీ ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బూర్గుల్ గ్రామంలో మద్యపాన నిషేధం



**నిజాంసాగర్ సెప్టెంబర్ 25(జనంసాక్షి) :** మహ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ గ్రామంలో గురువారం గ్రామ పెద్దల సమక్షంలో ప్రత్యేక సమావేశం జరిగింది.గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబాల శాంతి,సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మద్యం విక్రయాన్ని పూర్తిగా నిషేధించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో మద్యం అమ్మిన వారికి లక్ష రూపాయల జరిమానా విధిస్తాం అని స్పష్టంచేశారు.మద్యం విక్రయిస్తున్నారని ఎవరు సమాచారం ఇస్తే వారికి 20 వేల రూపాయల బహుమతి అందజేస్తామని తీర్మానం చేశారు. గ్రామంలోని యువత భవిష్యత్తు చెడిపోకుండా, కుటుంబాల్లో శాంతి నెలకొనాలని,గ్రామం సంపూర్ణంగా మద్యపాన వ్యసనాల నుండి విముక్తి పొందాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెద్దలు తెలిపారు.

## పెద్దపల్లిలో వైన్ షాపుల కేటాయింపు ఖరారు

- లాటరీ ద్వారా రిజర్వేషన్ షాపుల కేటాయింపు
- పారదర్శక ప్రక్రియకు వీడియోగ్రాఫీ
- గ్రామ పంచాయతీ ఎన్నికలకు శిక్షణ షెడ్యూల్
- అధికారులకు ఆదేశాలు జారీ

**పెద్దపల్లి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** జిల్లాలో వైన్ షాపుల రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ లాటరీ పద్ధతిలో ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఈ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 74 ఏ4 వైన్ షాపుల్లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గౌడ కులస్థులకు 13 షాపులు, ఎస్సీలకు 8 షాపులు రిజర్వ్ చేసి, వీటిని లాటరీ ద్వారా కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. పారదర్శకత కోసం మొత్తం ప్రక్రియను వీడియోగ్రాఫీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వైన్ షాపుల కేటాయింపులో గౌడ కులస్థులకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% రిజర్వేషన్ కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గౌడ కులస్థులకు 13 షాపులు, ఎస్సీలకు 8 షాపులు కేటాయించగా, మిగిలిన 53 షాపులకు అన్ని వర్గాలవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్కారీ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి మండల రవీందర్, ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా, గ్రామ పంచాయతీ ఎన్నికలకు నియమించిన ప్రిసైడింగ్ అధికారులకు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటలకు ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం మండలాలకు, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాలకు, కాకతీయ కళ్యాణ మండపం ఎన్టీపీసీలో పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలకు చెందిన ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. సెప్టెంబర్ 27న ఉదయం 10 గంటలకు సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో ఓదెల, సుల్తానాబాద్ మండలాలకు, జేఎన్టీయూ మంథనిలో కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాలకు చెందిన అధికారులకు శిక్షణ నిర్వహిస్తారు. ప్రిసైడింగ్ అధికారులకు ఆదేశాలు సంబంధిత ఎంపీడీవోలకు పంపించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవోలు ఆదేశాల కాపీలను సర్వ్ చేసి, అధికారులు శిక్షణకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

# రేషన్ డీలర్లు పండుగ పూట పస్తులు

- పండుగల లోపు డీలర్లకు కమీషన్ వచ్చేలా చర్యలు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** రాష్ట్ర రేషన్ డీలర్లకు రాబోయే పండుగల లోగా కమీషన్ వచ్చేట్లు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హొమ్ సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర డీలర్ల సంఘం అధ్యక్షులు బత్తుల రమేష్ బాబు తో స్పష్టం చేశారు. రానున్న పండుగల నేపథ్యంలో 5 నెలల కేంద్ర కమీషన్ డబ్బులు ఇప్పటివరకు రానందున డీలర్లు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను కరీంనగర్ లోని ' మహాశక్తి ' దేవాలయంలో కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ ని రమేష్ బాబు గురువారం రోజు మరొక్కసారి కలసి సమస్యను వారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. మంత్రి స్పందిస్తూ వెంటనే కేంద్ర ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ పిఏ జె. వినోద్ కుమార్ ద్వారా కేంద్ర మంత్రి ప్రహల్లాదు జోషి పర్సనల్ సెక్రటరీ నగేష్ , రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ(కమీషనర్) లతో ఫోన్ లో మాట్లాడగా సమస్యను పండుగల లోపు పరిష్కరించి డీలర్లకు కమీషన్ డబ్బులు చెల్లిస్తామని అధికారులు ఫోన్ ద్వారా స్పష్టం చేశారు. అనంతరం బత్తుల రమేష్ బాబు , రాష్ట్ర సివిల్ సప్లయ్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తో అపాయింట్మెంట్ కొరకు వారి పిఏ వేణు ప్రసాద్ కి ఫోన్ చేయగా అరగంట తర్వాత పిఏ రమేష్ బాబుకు తిరిగి ఫోన్ చేసి మినిస్టర్ తో ఫోన్ లో మాట్లాడించడం జరిగింది. పండుగల లోపు కమీషన్ వచ్చేలా చర్యలు తీసున్నట్లు మంత్రి ఫోన్ ద్వారా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రొడ్డ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హన్మాండ్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతరాజు రమేష్, చిలగాని మోహన్ జాయింట్ సెక్రటరీ తోట సమ్మయ్య, కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి గాలి గట్టయ్య, ప్రధాన కార్యదర్శి బి.జ్యోతిరవీందర్, కోశాధికారి బి. ప్రతాపరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.బాపురెడ్డి, సిహెచ్.నరేష్, ఆర్.విజయ్, ఏ. లచ్చన్న, బి.సమత, బి.సరోజన తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు

### నేడు నోటిఫికేషన్ విడుదల



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారైనట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో మొత్తం 94 మద్యం దుకాణాలకు గాను 17 దుకాణాలు గీత కార్మికులకు, 9 మద్యం దుకాణాలు ఎస్సీ కేటగిరీకి రిజర్వ్ చేశారు. 94 దుకాణాల్లో ఏయే దుకాణాలు గీత కార్మికులకు, ఎస్సీలకు రిజర్వ్ చేయాలో డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణదారుల ప్రస్తుత కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ 30 న ముగియనంది. డిసెంబరు 1, 2025 నూతన టెండర్లు దారులను ఖరారు చేసేందుకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ సంక్షేమ శాఖ డిడి నాగలేశ్వర్, సిఐలు జి.రాము ఎస్.అశోక్, ఎస్.బాబా, ఎస్ఐలు మహమ్మద్ ఇషాఖ్ పాషా, విజయ్ ఎక్సైజ్ సిబ్బంది అనిల్, సాయి కృష్ణ పాల్గొన్నారు. ఈ నెల 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరించనున్నారు. అప్లికేషన్లు ఇచ్చేందుకు ఆఖరి గడువు వచ్చే నెల(అక్టోబర్) 18వ తేదీ కాగా, వచ్చే నెల 23వ తేదీన దుకాణాల లైసెన్స్ కేటాయించేందుకు డ్రా తీయనున్నారు. డిసెంబర్ 01 వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయి.

# గ్రీన్ హైవే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులు



**మంథని, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక గ్రామంలో భూ నిర్వాసితులు పుట్టపాక దగ్గర నిర్మిస్తున్న గ్రీన్ హైవే నిర్మాణ పనులను అడ్డుకున్నారు. బుధవారం మంథని మండలం పుట్టపాక దగ్గర నిర్మిస్తున్న నాగ్‌పూర్, విజయవాడ గ్రీన్ హైవే నిర్మాణ పనులను చేపట్టడానికి వచ్చిన రోడ్డు నిర్మాణ అధికారులను, జెసిబిలను భూ నిర్వాసితులు చేపట్టిన ఆందోళనతో పోలీస్ పహార మధ్య ఉద్రిక్తంగా మారింది.మొత్తం 108 కి.మీ దూరం నిర్మించే జాతీయ రహదారి పనులను మూడు ప్యాకేజీల కింద విభజి ంచారు.1వ ప్యాకేజీలో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రసూల్‌పల్లి నుంచి మంథని మండలం పుట్టపాక వరకు 31 కి.మీ దూరానికి రూ.873 లో 2వ ప్యాకేజీ కింద పుట్టపాక నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంగిడిపల్లి వరకు 38 కిలోమీటర్ల దూరానికి రూ.881 కోట్లు,3వ ప్యాకేజీ కింద భూపాలపల్లి జిల్లా పంగిడిపల్లి నుంచి హనుమకొండ జిల్లా ఊరగొండ వరకు 39 కి.మీ దూరానికి రూ.851 కోట్లు కేటాయించారు.డివిజన్‌లో మొత్తం 204.46 హెక్టార్ల భూమిని సేకరించారు. ఇప్పటివరకు 164.49 హెక్టార్లకు పరిహారం చెల్లించగా,వివిధ కారణాలతో 19.73 హెక్టార్లు చెల్లింపులు జరగాల్సి ఉంది.1,519 మంది నిర్వాసితుల్లో 1,303 మందికి రూ.47.13 కోట్ల పరిహారం అందించారు.మరో 216 మందికి రూ.8.51 కోట్లు చెల్లించాలి. సాగులో ఉన్నవారి పేరిట రికార్డులో లేకపోవడం, సాదా బైనామాలు ఉండటం, వివాదాలు,కోర్టు కేసులతో పరిహారం చెల్లింపులో జాప్యం చోటు చేసుకుంటుంది. భూ నిర్వాసితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగిందంటూ రైతులు ఆర్బిట్రేషన్ కింద కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పరిహారం మొత్తాన్ని పెంచారు. రూ.51.17 కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.46.12 కోట్లు చెల్లించగా ఇంకా రూ.5.04 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. రికార్డులు సరిగ్గా లేని వారికి పరిహారం చెల్లించలేక పోతున్నామని అధికారులు వివరణ ఇస్తున్నారు. మంథని సిఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింప చేశారు.

# నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

### అంగన్వాడీ ఉద్యోగుల అరెస్టులపై సీపీఎం ఆగ్రహం

### సమస్యల పరిష్కారానికి డిమాండ్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25:** అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ వద్ద చలో కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైన అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులను రాత్రి నుంచే పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను పరిష్కరించకుండా, నిర్బంధాల ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలనుకోవడం అవివేకమని ఆయన అన్నారు. బుధవారం రాత్రి నుంచి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, తనను గృహనిర్బంధంలో ఉంచినట్లు, అలాగే జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అనేకమంది అంగన్వాడీ టీచర్లను ఉదయం 4 గంటల నుంచి నిర్బంధించినట్లు ఆయన తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వద్దకు చేరుకున్న మహిళా కార్యకర్తలను ప్రయాణికుల ముందు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఒకవైపు ప్రజాస్వామ్య పాలన అని చెప్పుకుంటూనే, సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకునే హక్కును కాలరాస్తూ నిర్బంధాలు విధించడం సరికాదని ఆయన ఆరోపించారు. నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేయాలనుకుంటే, అవి మరింత ఉధృతమై ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు18 వేల వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం అమలు చేయకపోగా, పీఎం శ్రీ విధానంతో అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, ఆన్‌లైన్ ఫోటో క్యాప్చర్ విధానంతో అంగన్వాడీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. ఈ విధానాలను రద్దు చేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధాలు ఉన్నప్పటికీ వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు హైదరాబాద్‌కు చేరుకున్నారని, దీన్ని బట్టి ప్రభుత్వం వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. లేనియెడల గత ప్రభుత్వాలకు ఎదురైన గుణపాఠం ఈ ప్రభుత్వానికి కూడా తప్పదని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధంలో ఉన్న అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సవిత, స్వాతి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యానికి గుర్రైన బాధితులను ఆదుకుంటాం

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అనారోగ్యంతో అస్పత్రిలో చికిత్స పొంది, అప్పుల పాలైన బాధితులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుకుంటామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. నిజామాబాద్ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో అయన నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) 59 చెక్కులను దాదాపు 28 లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోని పలు కాలనీలలో గల బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు. పేదలకు సహాయంగా అండగా. నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అర్హులకు నిరంతరంగ అందిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నామన్నారు.

# స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి దేశాభివృద్ధికి పాటుపడండి

- స్వరాజ్ ట్రాక్టర్లను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి
- జీఎస్టీ సంస్కరణలతో ఒక్కో ట్రాక్టర్‌పై రైతులకు రూ.40-80 వేలదాకా ఆదా అవుతుంది



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25(జనంసాక్షి) :** స్వదేశీ వస్తువులనే వాడాలని కేంద్ర హొంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మన దేశంలో తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా స్థానిక కంపెనీలు, చిన్నతరహా వ్యాపారాలు బలపడతాయని, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, డబ్బు దేశంలోనే చలామణి అవుతుందని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి చెందిన దేశంగా (ఆత్మ నిర్భర భారత్) అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణల ఫలితంగా 'స్వరాజ్ సంస్థ' ట్రాక్టర్ ధర రూ.40 వేల నుండి రూ.80 వేల వరకు తగ్గిన నేపథ్యంలో పలువురు రైతులు వాటిని కొనుగోలు చేశారు. స్వరాజ్ ట్రాక్టర్స్ డీలర్ల అసోసియేషన్ నాయకులు ఆయా ట్రాక్టర్లను కేంద్ర మంత్రి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఆయా రైతులతో, డీలర్స్ తో మాట్లాడి ఒక్కో ట్రాక్టర్ పై ఎంత ధర తగ్గిందని ఆరా తీశారు. జీఎస్టీ సంస్కరణలవల్ల తాను కొన్న ట్రాక్టర్ ధర రూ.10 లక్షల 50 వేలు ఉండగా, ప్రస్తుతం రూ. 9 లక్షల 80 వేలకే వచ్చిందని తద్వారా రూ.70 వేలు ఆదా అయ్యాయని మక్కపల్లికి చెందిన రైతు అఖిల్ చెప్పారు. మానకొండూరు మండలం లింగాపూర్ కు చెందిన అనిల్ కుమార్ అనే రైతు మాట్లాడుతూ... జీఎస్టీ వల్ల తనకు రూ.50 వేలు ఆదా అయ్యిందన్నారు. నుస్తులాపూర్ కు చెందిన వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ... తాను ట్రాక్టర్ కొనడంవల్ల రూ.50 వేలు ఆదా అయ్యిందన్నారు. స్వరాజ్ ట్రాక్టర్ డీలర్ వెంకట్ మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గింపుతో స్వరాజ్ కు చెందిన వివిధ రకాల ట్రాక్టర్లు ఒక్కో దానిపై సగటున రూ.40 నుండి రూ.80 వేలదాకా తగ్గింపు జరిగిందన్నారు. తద్వారా ట్రాక్టర్ల సేల్స్ బాగా పెరిగాయని, రైతులు చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారంతా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... జీఎస్టీవల్ల కలుగుతున్న ప్రయోజనాలను మీ చుట్టుపక్కలనున్న వారందరికీ వివరించాలని వారిని కోరారు.

## మెడికల్ షాపులపై పర్యవేక్షణ కరువు

**ముస్తాబాద్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** ముస్తాబాద్ మండల కేంద్రంలో విచ్చలవిడిగా మెడికల్ షాప్‌లు వెలుస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బి ఫార్మసీ చదువుకున్నవారే మెడికల్ షాప్‌లు నడిపించాలని షాపులో ఉన్నవారు. డ్రెస్ కోడ్ మందులపై పూర్తి అవగాహన కలిగి ఉన్నవారే మాత్రమే మెడకల్ దుకాణాలలో ఉండాలి. ఈ ప్రభుత్వ నిబంధనలన్నీ తుంగలో తొక్కి బీ ఫార్మసీ సర్టిఫికెట్ ఉన్నవారివి అద్దెకు తెచ్చుకొని నెల నెల డబ్బులు బీఫార్మసీ సర్టిఫికెట్ ఉన్నవారికి చెల్లిస్తు వేరేవారు నడిపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా ఆ మెడికల్ షాప్ లపై అప్పుడప్పుడు పర్యవేక్షణ చేస్తే ఇలా పుట్టగొడుగుల మెడికల్ షాపులు వెలువయని అంటున్నారు. బ్రాండెడ్ కంపెనీ ధరలు తీసుకుంటూ జనరిక్ మందులు ప్రజలకు అంటగడుగుతున్నారనరు, సిద్దిపేట, సిరిసిల్ల లాంటి పట్టణాలలో ఏ మెడికల్ షాప్ లో మందులు కొన్న ఆన్లైన్ బిల్లు ఇస్తారు కానీ మండలంలో ఏ మందులు తీసుకున్న బిల్లులో బిల్లులు మాత్రం ఇవ్వరు. డాక్టర్లు రాసేటి ఒక మందు మెడికల్ షాప్ వాళ్ళు ఇచ్చేటి మరొక కంపెనీ మందులు. డాక్టర్లు కూడా తెలిసి కూడా తెలవనట్టుగా వివరిస్తున్నారు. ముస్తాబాద్ లో ప్రైవేట్ మెడికల్ షాప్ మందుల పై అధిక రేట్లు వసూలు చేస్తున్నారన్నట్లు ఆరోపణలు. ఒక్క రూపాయి కూడా తగ్గించడం లేదని ప్రజలు అంటున్నారు. అమాయక ప్రజలను ఆసరా చేసుకుని ఇటు మెడికల్ షాపులో అందినంత దండుకుంటున్నారని మండలంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మెడికల్ షాపులపై పర్యవేక్షణ చేసి జనరిక్ మందులు అమ్మవారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# శరవేగంగా కొనసాగుతున్న ఆలయ పనులు

- ముందస్తుగా పలు భవనాలు కూల్చివేత
- 24 గుంటల ఆలయం 4 ఎకరాల్లో విస్తరణ





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నా యి. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించడంతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి కొరకు నిధులు కేటాయించడంతో పాటు ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు గతంలోనే శంకుస్థాపన చేశారు. ఇప్పటికే రాజన్న ఆలయంలోని కళాభవన్,ఆలయ ఈవో కార్యాలయం కూల్చివేశారు. ప్రస్తుతం రాజన్న ఆలయం 24 గుంటల విస్తీర్ణం ఉండగా అభివృద్ధి పనులలో భాగంగా నాలుగు ఎకరాలపై చిలుకు విస్తరణ జరగనుంది. అభివృద్ధి పనులలో భాగంగా ఇప్పటికే ఆలయ కూల్చి వేశారు.ఈవో కార్యాలయమును కూల్చి వేయడంతో తాత్కాలికంగా భీమేశ్వర సదన్లో ఈవో కార్యాలయం ఏర్పాటు చేశారు. దసరా తదుపరి ఆలయ మూసి వేసేందుకు రంగం సిద్ధమవుతున్న ఇప్పటి వరకు అధికారికంగా ప్రభుత్వము కానీ దేవాదాయ శాఖ అధికారులు కానీ ఎలాంటి ప్రకటన చేయడం లేదు. ఆలయ అభివృద్ధి పనులు భాగంగా శ్రీ స్వామివారిని దర్శించుకునే భక్తులకు భీమేశ్వర ఆలయంలో స్వామివారి దర్శన ఏర్పాట్ల కోసం షెడ్లు క్యూలైన్ల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. మరో నాలుగైదు రోజుల్లో భీమేశ్వరాలయంలో పనులన్నీ పూర్తి చేసేందుకు ఆలయ ఇంజనీరింగ్ అధికారులు కృషి చేస్తున్నారు.ఆలయ అభివృద్ధి పనులలో భాగంగా భక్తులకు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శన సౌకర్యం వుండదు. స్వామివారికి ప్రతినిత్యం జరిగే సుప్రభాత సేవ నుండి పవళింపు సేవల వరకు జరిగే నాలుగు పూజలను ఆలయ అర్చకులు యధావిధిగా కొనసాగిస్తారు.కానీ భక్తులకు మాత్రం స్వామివారి దర్శన సౌకర్యం భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వ పాలనలో మొదటి దశగా చేపట్టనున్న అభివృద్ధి పనులు రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ మాత్రమే నిర్వహించనున్నారు.ఇందుకోసం మొదటగా రూ.75 కోట్లను విడుదల చేశారు. బడ్జెట్ లో రూ 150 కోట్లను కేటాయించారు. పట్టణంలో మూలవాగ్ నుండి రాజన్న ఆలయం వరకు రహదారి విస్తరణ జరిగింది.ఇటీవల ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో, అర్చకులు శృంగేరి వెళ్ళి వచ్చారు. అనంతరం ప్రభుత్వ విప్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆలయంలో చేపడుతున్న పనులు మరియు శృంగేరి పర్యటన వివరాలను విప్ వివరించారు.

# రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : నూతన కమిటీ ప్రకటన



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం నిజామాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర సంఘం నుంచి విచ్చేసిన ఎన్నికల అధికారులు నారాయణ రెడ్డి, నిరంజన్ రావు సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, కలెక్టర్ కార్యాలయ డివిజన్ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు, తహసీల్దార్లు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అధ్యక్షులుగా ఎల్. రమణ్ కుమార్ (డీఏఓ, ఆర్‌డిఓ కార్యాలయం, నిజామాబాద్), అసోసియేట్ అధ్యక్షులుగా పి. శ్రీనివాస్ రావు (సూపరింటెండెంట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), ఉపాధ్యక్షులుగా బి. ప్రభు (ఏఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయం, డిచ్‌పల్లి), వై.వి. శశిభూషణ్ (తహసీల్దార్, సాలూర), ఎం. శైలజ (నాయబ్ తహసీల్దార్, తహసీల్ కార్యాలయం, ఇందల్వాయి), పి. వినయ్ సాగర్ (నాయబ్ తహసీల్దార్, తహసీల్ కార్యాలయం, నిజామాబాద్ రూరల్), ప్రధాన కార్యదర్శిగా బి. ప్రశాంత్ కుమార్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా డి. వసంత్ రావు (నాయబ్ తహసీల్దార్, ముప్కాల్), బి. భరద్వాజ్ (జూనియర్ అసిస్టెంట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), సంయుక్త కార్యదర్శులుగా బి. రాజశేఖర్ (నాయబ్ తహసీల్దార్, ఆర్‌డిఓ కార్యాలయం, నిజామాబాద్), ఎస్. సవిత (సీనియర్ అసిస్టెంట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), ఎస్. రాము (రికార్డు అసిస్టెంట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), డి. శ్రవణ్ కుమార్ (తహసీల్దార్, రెంజల్), కె. గంగరాజం (ఎంఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయం, సిరికొండ), క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా ఎన్. విజయరామ రాజు (జూనియర్ అసిస్టెంట్, తహసీల్ కార్యాలయం, నిజామాబాద్ సౌత్), కోశాధికారిగా బి. విజయకాంత్ రావు (తహసీల్దార్, నిజామాబాద్ నార్త్), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి. విజయేందర్ రెడ్డి (సీనియర్ అసిస్టెంట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), పి. సంతోష్ కుమార్ (సీనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆర్మూర్), ఎన్. ప్రభాకర్ (ఎంఆర్ఐ, తహసీల్ కార్యాలయం, నిజామాబాద్ నార్త్), నాగేశ్వర్ రావు (ఎంఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయం, నిజామాబాద్ సౌత్), పి. శైలజ (జూనియర్ అసిస్టెంట్, తహసీల్ కార్యాలయం, నిజామాబాద్ సౌత్), ఎన్.వి. కృష్ణ చైతన్య (టైపిస్ట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), సందీప్ (సీనియర్ అసిస్టెంట్, కలెక్టర్ కార్యాలయం, నిజామాబాద్), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పి. వెంకట రమణ (తహసీల్దార్, నవిపేట్), ఎం. దత్తాద్రి (తహసీల్దార్, ఎడపల్లి), ఎ. శ్రీధర్ (డీఏఓ, సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆర్మూర్) ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2025-2028 కాలానికి సేవలందిస్తుందని ఎన్నికల అధికారులు తెలిపారు. జిల్లాలో రెవెన్యూ సిబ్బంది సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
26 సెప్టెంబర్ 2025

# అంతర్జాతీయ స్థాయిలో ఆడబిడ్డల పండుగ

## బతుకమ్మ వేడుకల నిర్వహణపై మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** సెప్టెంబర్ 29న గిన్నిస్‌వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క అధికారులను ఆదేశించారు. డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రులు మాట్లాడుతూ ఈ నెల 27న ట్యాంక్ బండ్ పై బతుకమ్మ కార్నివాల్, 28న బైక్, సైకిల్ ర్యాలీలు, 29న సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో బతుకమ్మ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, 30న ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ కార్యక్రమాలు ఉంటాయని, దీనికి అనుగుణంగా ప్రతిష్ఠాత్మకంగా సన్నాహాలు జరగాలన్నారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేపట్టాలి. ట్యాంక్ బండ్ తో పాటు పీవీ మార్గ్, సచివాలయం, సరూర్ నగర్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించాలి. బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. మహిళలకు సౌకర్యాలు కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పండగ ప్రాశస్త్యానికి అద్దం పట్టేలా హైదరాబాద్ లో చారిత్రక ప్రదేశాలతో పాటు ప్రధాన జంక్షన్లను అందమైన ఆకృతులతో, విద్యుత్ దీపాలతో అలంకరించాలి, వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యాటక, సాంస్కృతిక, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోలీస్, ట్రాన్స్‌కో, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

సరూర్ నగరం స్టేడియంలో ఈ నెల 29న 10 వేల మంది బతుకమ్మ వేడుకలు, 63 అడుగుల ఎత్తైన బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నిస్ బుక్ రికార్డుల్లో చేర్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను తరలించే బాధ్యతను సెర్ఫ్ అధికారులు తీసుకోవాలని, దీనికి తోడు మిగిలిన వారిని తీసుకువచ్చేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జానపద, గిరిజన కళాకారుల మధ్య వేలాదిమంది మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి ట్యాంక్‌బండ్?లో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు, హైదరాబాద్ నగర వాసులు పెద్ద ఎత్తున బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొని విజయంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఖైదీల నుండి జైలు సిబ్బంది వసూళ్ల దందా!




**సంగారెడ్డి ప్రతినిధి (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా కందిలోని కేంద్ర కారాగారంలో అవినీతి రాజ్యమేలుతుందా? బయట వివిధ రకాల నేరాలు చేసి జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల పరివర్తన తీసుకరావల్సిన జైలు సిబ్బందే? ఖైదీలకు అడిగిన సేవలు చేస్తూ, నిబంధనలు అతిక్రమిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నరా? అన్న అంశాలకు నిజమే అనే సమాధానాలు వస్తున్నాయి.

సంగారెడ్డి జిల్లా కందిలోని కంది సెంట్రల్ వివాదలకు కేంద్రంగా మారుతున్నది. ఇక్కడి జైలు సిబ్బందిపై తరుచూ అరోపణలొస్తున్నాయి. కంది సెంట్రల్ జైల్‌లో ఖైదీల అత్మహత్యయత్నలు, ఖైదీల గొడవల వ్యవహారాలు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఏదో వివాదంతో వార్తల్లో నిలుస్తోంది. తాజాగా కందిలోని సెంట్రల్ జైలులో నిబంధనలను పక్కనపెట్టి ఖైదీలు కోరిన వసతులు కల్పించడానికి జైలు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టి వచ్చిందని, సిబ్బంది జాగ్రత్త ఉండాలని, వసూళ్ల దందా పై ఇంటలిజెన్స్ విభాగం ద్రష్టిపెట్టిందని సాక్షత్తూ జైలు సూపరెంటెండెంట్ కళాసాగర్ సందేశం సోషల్ మీడియాలో కన్పిపించింది. సెంట్రల్ జైలు సంబంధించిన మీడియాలో గ్రూపులో బుధవారం రాత్రి సూపరెంటెండెంట్ నెంబరు నుండి వచ్చిన హెచ్చరిక మెసేజ్ తర్వాత కొద్దిసేపటికే తొలగించబడింది. కోర్టుకు తిరిగివస్తున్న సమయలో ఖైదీలు నిషేదిత వస్తువులను బయట నుండి తీసుకువస్తురని, అంతేకాకుండా ఖైదీలకు అడిగిన వసతులు కల్పిస్తూ సహకరిస్తే, ఖైదీలు, వారి కుటుంబసభ్యుల నుండి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కొందరు జైలు సిబ్బంది తమ ఖాతాలకు పైసాలు బదిలీ చేసుకున్నట్టు అయన మెసేజ్‌లో ఉండటం సంచలనంగా మారింది. జైలు నిర్వహణలో భద్రతా లోపాలను సహించేది లేదని , ఏవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రాతపూర్వకంగా తెలియజేయలని, సిబ్బంది సోదాలను సమర్ధవంతంగా నిర్వహించలని స్పష్టం చేశారు. జైలు సిబ్బంది వ్యవహారశైలి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక తరహ సందేశం ఉన్నది. ఈ మెసేజ్ పైన, సిబ్బంది నిర్వకం, వసూళ్ల వ్యవహారంపై వివరణ కోసం జైలు సూపరెంటెంట్ కళాసాగర్‌ను సంప్రదిస్తే అందుబాటులోకి రావడం లేదు. కంచె చేను మెసినట్టు జైలు సిబ్బందే ఖైదీలకు సహకరిస్తు , వారి నుండే డబ్బులు వసూలు చేయడం పలు విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికే కంది సెంట్రల్ జైలు సిబ్బందిపైన, ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలపై ఉన్నతధికారులు దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

# నేడు కొత్త ఎస్టీపీలకు సీఎం శంకుస్థాపన

- ప్రారంభానికి సిద్ధంగా 6ఎస్టీపీలు
- 39 కొత్త ఎస్టీపీలకు శంకుస్థాపన





**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ మహా నగరంలో వంద శాతం మురుగు నీరు శుద్ధి చేసే లక్ష్యంతో చేపట్టిన ఎస్టీపీల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అంబర్ పేట్ తో పాటు మరో 5 ఎస్టీపీలను మురుగు నీటి శుద్ధి కేంద్రాలను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించనున్నారు. వీటితో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 39 ప్రాంతాల్లో ఉన్న స్థానిక సంస్థల, గ్రామాల్లో ఎస్టీపీలు నిర్మించడానికి 972 ఎమ్మెల్డీల సామర్థ్యం గల మొత్తం 39 ఎస్టీపీలకు శంకుస్థాపన చేస్తారు. జలమండలి ప్రధాన నగరం, జీహెచ్ఎంసీ పరిధి సర్కిళ్లు, ఓఆర్ఆర్ పరిధిలోని యూఎల్‌బీలకు తాగునీటి సరఫరా, మురుగు శుద్ధి సదుపాయాలను 1450 చదరపు కిలోమీటర్ల పరిధిలో నిర్వహిస్తోంది.

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న 39 ఎస్టీపీల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 26న శంకుస్థాపన చేయనున్నారు. అయితే ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి వచ్చే మురుగునీరు మూసీలో కలవకుండా ఎక్కడికక్కడే శుద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఓఆర్ఆర్ పరిధిలో అమృత్ 2.0లో 39 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్(ఎస్టీపీలు)లను ఏర్పాటు చేసే బాధ్యతలను జలమండలికి ప్రభుత్వం అప్పగించింది. వీటిని హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో భాగంగా 40 శాతం ప్రభుత్వ వాటా, 60 శాతం కాంట్రాక్టు ఏజెన్సీ వాటా కింద ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

### హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో..

ఓఆర్ఆర్ పరిధిలో 39 ఎస్టీపీలను నిర్మించడానికి కాంట్రాక్టు ఏజెన్సీలు రూ.1,805.97 కోట్లకు టెండర్లు దక్కించుకున్నాయి. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో భాగంగా 40 శాతం ప్రభుత్వ వాటా రూ.722.38 కోట్లు, 60 శాతం సంబంధిత ఏజెన్సీలు రూ.1,083.58 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ వాటాకు సంబంధించి హడ్కో నుంచి రుణం తీసుకో వాలని జలమండలి నిర్ణయించింది. లోన్ మంజూరు అయినట్లు అధికారులు చెబుతున్నారు.

### బతుకమ్మకుంట ఎస్టీపీ..

అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట ఎస్టీపీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అంబర్‌పేట్‌లో నిర్మిస్తున్న 212.5 ఎమ్మెల్డీ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) పనులు పూర్తయ్యాయి.

# హాస్టల్ బిల్డింగ్‌పై దూకి విద్యార్థిని ఆత్మహత్య

**పాట్నా, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రిన్సిపాల్ వేధిస్తున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. కాలేజీ క్యాంపస్‌లో ఆందోళనకు దిగారు. పోలీస్ వాహనాలకు నిప్పుపెట్టారు. బీహార్ రాజధాని పాట్నా సమీపంలోని చాంది ఇంజినీరింగ్ కాలేజీలో ఈ సంఘటన జరిగింది. ముంగేర్ జిల్లాలోని బరియార్‌పూర్ బ్లాక్‌కు చెందిన 20 ఏళ్ల సోనమ్ కుమారి సివిల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నది. బుధవారం రాత్రి హాస్టల్ బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న విద్యార్థులు అర్ధరాత్రి వేళ క్యాంపస్‌లో నిరసన చేపట్టారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ నందన్, స్టూడెంట్లను వేధించడంతోపాటు బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. సోనమ్ కుమారి రక్తం మడుగు ల్లో అరగంట పడి ఉన్నప్పటికీ కాలేజీ వాహనంలో ఆమెను హాస్పిటల్‌కు తరలించేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించినట్లు విమర్శించారు. ఆ తర్వాత స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఇది చూసి మృతురాలి స్నేహితురాలు శిఖా కుమారి మానసికంగా కుంగిపోయింది. దీంతో చికిత్స కోసం పాట్నా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు ఆమెను తరలించారు. మరోవైపు అర్ధరాత్రి వేళ స్టూడెంట్స్ నిరసన ఉద్రిక్తతకు దారి తీసింది. డీఎస్పీ వాహనంతోపాటు ఒక స్కూటర్‌కు నిప్పుపెట్టారు. ప్రిన్సిపాల్‌ను వెంటనే అక్కడకు రప్పించాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్స్ అశాంతి పెరగడంతో ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలతోపాటు 20 పోలీస్ స్టేషన్ల నుంచి పోలీస్ దళాలను ఆ కాలేజీ క్యాంపస్‌లో మోహరించారు. చివరకు గురువారం తెల్లవారుజామున పరిస్థితి అదుపులోకి వచ్చింది. కాగా, విద్యార్థిని సోనమ్ కుమారి మరణంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత ఆమె తల్లిదండ్రులతో పాటు విద్యార్థుల స్టేట్‌మెంట్లు రికార్డ్ చేస్తామని చెప్పారు. ఆ తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# నా ప్రాణమున్నంత వరకు అభివృద్ధి చేస్తా : స్టాలిన్



**చెన్నై, సెప్టెంబర్25 (జనంసాక్షి) :** తన బొందిలో ప్రాణమున్నంతవరకూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతూనే ఉంటానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి దివంగత నేత కరుణానిధిని ఆదర్శంగా తీసుకుని శ్రమించడమే కాకుండా, అందరికీ అన్ని సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. గురువారం ఉదయం తన నియోజకవర్గం కొళత్తూరులో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పెరంబూరు పేపర్‌మిల్స్ రోడ్డులో రూ.8.20 కోట్లతో మురసొలి మారన్ ఉద్యానవనం పునర్నిర్మాణ పనులకు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.13.95 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొళత్తూరు నియోజకవర్గంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.8.65 కోట్లతో నిర్మించిన రెండు పాఠశాల భవనాలు, పునర్నించిన ఫుట్‌బాల్ మైదానాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. చివరగా పెరియార్ నగర్ క్రీడామైదానంలో అనితా అచీవర్స్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 126 మంది విద్యార్థినీ విద్యార్థులకు ల్యాప్‌టాపలు, సర్టిఫికెట్లు, నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో అడుగుపెట్టగానే తనలో సంతోషం ఏర్పడుతుందని, ఈ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఆనందిస్తున్నానని చెప్పారు. రెండు గంటలపాటు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని అనితా అచీవర్స్ అకాడమీలో విద్యార్థులందరినీ చూడగానే తనలో మరింత చురుకుదనం ఆవహిస్తోందని చెప్పారు. ఈ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నవారంతా తమ పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలలో మరింతగా ప్రతిభా పాటవాలను పెంపొందిం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పోటీ యుగంలో అంతర్జాలంలో లభించన సమాచారం అంటూ ఏదీ లేదని, అన్వేషిస్తే అన్ని వివరాలు అర్థమవుతాయన్నారు. ఆన్‌లైన్ కోర్సులపై కూడా యువత దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, రాజ్యసభ సభ్యుడు గిరిరాజన్, ఎమ్మెల్యేలు తాయగం కవి, జోసెఫసాముల్, వెట్రి అళగన్, డిప్యూటీ మేయర్ మహేషకుమార్, డీఎంకే స్థానిక నాయకులు నాగరాజన్, ఐసీఎఫ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి కోసం పార్టీ తలవంచదు

**అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి**

**చెన్నై, సెప్టెంబర్25 (జనంసాక్షి) :** అన్నాడీఎంకే ఎవరికీ తలవంచదని, మిత్ర పక్షాలను బానిసలుగా చూడటం డీఎంకే నైజమని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో నియోజకవర్గాల వారీగా ఈపీఎస్ చేస్తున్న ప్రచారయాత్ర బుధవారం నీలగిరి జిల్లాలోని గూడలూరు నియోజకవర్గానికి చేరుకుంది. దేశంలోనే ఉన్నత విద్యలో తమిళనాడును అగ్రస్థానంలో నిలిపిన ఘనత అన్నాడీఎంకే ప్రభుత్వానిదేనని, అందుకే ఆ రంగానికి అధిక నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగి రాష్ట్రానికి రావాల్సిన నిధులను, పథకాలను ఏ మాత్రం జాప్యం లేకుండా పొందడంతో పాటు కేంద్రాన్ని మెప్పించి ప్రభుత్వ వైద్యకళాశాలలను కూడా తీసుకొచ్చింది అన్నాడీఎంకే ప్రభుత్వమేనని, అయితే ఈ డీఎంకే హయాంలో ఇలాంటి ఏ పథకాన్ని తీసుకురాలేపోయారని విమర్శించారు. దేశంలో అధికంగా అప్పులు చేయడంలో తమిళనాడు అదర్శవంతంగా ఉందని, అవినీతి, కమీషన్, కరప్షన్‌లో కూడా డీఎంకేకు సాటి ఎవరూలేరని ఈపీఎస్ ధ్వజమెత్తారు. 1999లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ కూటమిలో డీఎంకే చేరిందని, ఆ ఎన్నికల్లో గెలవడం ద్వారా అప్పటి ప్రధాని వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వంలో డీఎంకే తరుపున మురసొలిమారన్ కేంద్రమంత్రిగా పనిచేశారని, అప్పుడు బీజేపీని మంచిపార్టీగా డీఎంకే అభివర్ణించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకున్న బీజేపీని మతవాద పార్టీగా డీఎంకే విమర్శించడం సరికాదన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో ఎమర్జెన్సీ చట్టం అమలుకు వచ్చిందని, అప్పుడు డీఎంకే నేతలతో పాటు స్టాలిన్‌ను కూడా జైలుకెళ్లారని, అయితే తమను జైలుపాలు చేసిన కాంగ్రెస్ తో ఎందుకు పొత్తు కుదుర్చుకున్నారో ఆ భగవంతునికే ఎరుకన్నారు.

# 'కడారి'కి కన్నీటి వీడ్కోలు

- గోపాల్ రావు పల్లెలో విషాదఛాయలు
- నివాళులు అర్పించిన ప్రజాసంఘాల నాయకులు
- ఎర్రబారిన గోపాలరావు పల్లె
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హాజరైన విప్లవాభిమానులు








రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి). మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి మరణంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాలరావు పల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కడారి సత్యనారాయణ రెడ్డి మృతదేహం స్వగ్రామం చేరింది. పలు పార్టీల, ప్రజాసంఘాలు నాయకులు కడారి స్వగ్రామం లో గురువారం నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు గాదె ఇన్నయ్య, విరసం కార్యదర్శి పాణి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకురాలు పద్మతో పాటు సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు సత్యనారాయణ రెడ్డి కి నివాళులు అర్పించి ఆయన ప్రజల కోసం చేసిన త్యాగాన్ని కొనియాడారు. ప్రజా కళామండలి కళాకారుల విప్లవ పాటలు గోపాల్ రావు పల్లెలో మారుమోగాయి. ఈ సందర్భంగా గాదే ఇన్నయ్య తో పాటు పౌర హక్కుల సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేసిన హత్యాకాండ అని బూటకపు ఎన్కౌంటర్ లో సత్యనారాయణ రెడ్డిని చిత్రహింసలు చేసి కాల్చి చంపారని ఆరోపించారు. ముమ్మాటికి ఇది ప్రభుత్వం చేసిన హత్య అన్నారు. అంచలంచెలుగా ప్రజా పోరాటాలలో నాలుగు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలలో పనిచేస్తూ మావోయిస్టు కేంద్ర పార్టీ స్థాయికి ఎదిగారని అన్నారు. ద్రోహుల సమాచారంతో కామ్రేడ్ కడారి సత్యనారాయణరెడ్డి తోపాటు మరో కేంద్ర కమిటీ సభ్యులు రాజు ను చత్తీస్గడ్ నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్ సరిహద్దుల్లో బూటకపు ఎన్కౌంటర్ లో కాల్చి చంపారని ఆరోపించారు. విప్లవ అభిమానులు కడసారి కన్నీళ్ళతో జోహార్లు అర్పించారు. గ్రామస్తులు కడారి కి పూర్వం గ్రామంతో ఉన్న సంబంధాలను గుర్తుచేసుకుంది కంటతడి పెట్టారు. గోపాల్‌రావుపల్లి గ్రామం ఎర్రజెండాలతో రెపరెపలాడింది. ప్రజా కళామండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలాపించి కడారి కి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో భారత్ బచావో జాతీయ అధ్యక్షులు, ఇన్నయ్య, విరసం నాయకులు పాణి, అమరవీరుల బంధువిత్రుల కమిటీ నాయకురాలు పద్మ కుమారి భారీ సంఖ్య లో విప్లవ అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సెక్కితే బహుమతులు

## దసరాకు లక్కీడ్రా నిర్వహణ

- రూ.5.50 లక్షల విలువగల బహుమతులు గెలుచుకునే అవకాశం
- హైఎండ్ బస్సుల్లో ప్రయాణించే వారికే బహుమతులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దసరా పండుగ నేపథ్యంలో తమ బస్సుల్లో ప్రయాణించేవారికి లక్కీ డ్రా నిర్వహించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఈ లక్కీ డ్రాలో రీజియన్ కి ముగ్గురు చొప్పున 33 మందికి రూ.5.50 లక్షల విలువగల బహుమతులను సంస్థ అందజేయనుంది. ఒక్కో రీజియన్ కు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలను సంస్థ ప్రకటించింది. ఈ లక్కీ డ్రా లో పాల్గొనాలంటే ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు టీజీఎస్ఆర్టీసీకి చెందిన హైఎండ్ బస్సులైన సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతో పాటు అన్ని రకాల ఏసీ బస్సుల్లో ప్రయాణించిన వారే అర్హులు. ఈ సర్వీసుల్లో ఎక్కిన ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్ పై తమ పూర్తి పేరు, ఫోన్ నెంబరు రాసి బస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ల్లో వేయాల్సి ఉంటుంది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు చేసిన ప్రయాణాలను మాత్రమే లక్కీ డ్రాకి సంస్థ పరిగణనలోకి తీసుకుంటుంది. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. లక్కీ డ్రా అనంతరం డ్రాప్ బాక్స్ లను సంబంధిత ఆర్ఎం కార్యాలయాలకు చేర్చి.. ప్రతి రీజియన్ పరిధిలో లక్కీ డ్రా నిర్వహించి ముగ్గురి చొప్పున విజేతలను అక్టోబర్ 8న అధికారులు ఎంపికచేస్తారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేసి సంస్థ ఘనంగా సన్మానిస్తుంది. దసరా లక్కీ డ్రాలో ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ కోరారు. లక్కీ డ్రాకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 తో పాటు స్థానిక డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ఆర్టీసీ పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని, ప్రయాణికుల సౌకర్యార్థం 7754 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్నీ ప్రత్యేక బస్సులను నడపాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370